

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు

సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు

ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

హైదరాబాద్ fb.com/vaartha

Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem,Srikakulam

14-7-2024 ఆదివారం సంపుటి: 30 సంచిక: 165 పేజీలు: 10+4 వెల: 8.00



రూ.29 వేల కోట్ల ప్రాజెక్టులు ప్రారంభించిన ప్రధాని మోడీ 5లో

హైస్కూళ్లలో 'ప్రహారీక్లబ్'లు ఏర్పాటు 6లో


2060 నాటికి ఆర్థిక శక్తిలో

# భారత్ నం.1



## 2031 నాటికి రెండో స్థానంలోకి

### ఆర్బీఐ డిప్యూటి గవర్నర్ దేబబ్రత

**న్యూఢిల్లీ,జులై 13:** ప్రపంచంలోనే రెండో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ ఉన్న దేశంగా భారత్ 2031నాటికి మారుతున్నదని, 2060 నాటికి ప్రపంచంలోనే భారత్ అతిపెద్ద ఆర్థికవ్యవస్థ ఉన్న దేశంగా మారుతుందని ఆర్బీఐ డిప్యూటి గవర్నర్ దేబబ్రత పాత్ర పేర్కొన్నారు. ముస్సోరిలోని లాల్‌బహదూర్ నేషనల్ అకాడమీ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్‌లో జరిగిన సదస్సులో ఆయన పాల్గొనిప్రసంగించారు. వచ్చే దశాబ్దకాలం నాటికి భారత్ రెండో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ కానున్నదనడం కాదని, 2031 నాటికే భారత్ ఆర్థికవ్యవస్థ మరింతగా పెరుగుతుందని అన్నారు. 2060 నాటికి భారత్ ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్థికవ్యవస్థగలదేశంగా వృద్ధిలోకి వస్తుందని పాత్రా అన్నారు. ఐఎఎస్‌లకు మిడ్ కెరీర్ శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్న డిప్యూటి గవర్నర్ భారత్ ఆర్థికాభివృద్ధి అంశాలపై అవగాహన కల్పించారు. ఇప్పటికే దేశం 3.6లక్షలకోట్ల డాలర్ల ఆర్థికవ్యవస్థగా మారిందని ఆయన చెపుతూ అంటే భారత కరెన్సీలో 295.4 లక్షలకోట్ల ఎకానమితో ఉందన్నారు. అలాగే తలసరి ఆదాయం కూడా 2,076,030గా పెరిగిందని, డాలర్లలో పోలిస్తే 2500 డాలర్లుగా ఉందన్నారు. వచ్చేపదేళ్లలోనే భారత్‌వృద్ధిరేటు 9.6శాతంగా నమోదుకాగలదని అంచనా >>2

ఇక సకాలంలోనే

# ఫీజురీయింబర్స్

**హైదరాబాద్, జులై 13, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో ఇకపై ఏ ఏడాది ఫీజు రీయింబర్స్‌మెంట్ ఆ ఏడాదే విడుదల చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. గత రెండేళ్లుగా ఉన్న పెండింగ్ రీయింబర్స్‌మెంట్‌ను కూడా త్వరలోనే క్లియర్ చేస్తామని, రాష్ట్రంలోని ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీలు నాణ్యమైన విద్యను అందించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల యాజమాన్యాలకు సూచించారు రేవంత్ రెడ్డి. క్వాలిటీ ఇంజినీరింగ్ విద్యపై జేఎన్‌టీయూలో ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీలతో ఇంటరాక్షన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుతోపాటు విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి, జేఎన్‌టీయూ ఇన్‌చార్జ్ వీసీ బుర్రా వెంకటేశం, రెక్టార్ ప్రొఫెసర్ విజయ్ కుమార్‌రెడ్డి, సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేనతో పాటు ఇంజనీరింగ్ కాలేజీల యాజమాన్యాలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ విధానాలను విరించాలనే ఇంటరాక్షన్ కావాలని కోరుకున్నట్టు చెప్పారు. ప్రతి పేదవాడి బిడ్డ గొప్పగా ఉన్నత చదువు చదవాలని ఆనాడు దివంగత వైఎస్‌ఆర్ ఫీజురీయింబర్స్‌మెంట్ పథకం తీసుకొచ్చారని గుర్తు చేశారు. రకరకాల పరిస్థితుల్లో >>2




శనివారం జెన్‌టియులో ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీలతో ఇంటరాక్షన్ కార్యక్రమంలో ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్. చిత్రంలో మంత్రి శ్రీధర్‌బాబు తదితరులు

బకాయిలనూ చెల్లిస్తాం

ప్రైవేటు ఇంజినీరింగ్‌లో నాణ్యత పెరగాలి

త్వరలోనే జాబ్ క్యాలెండర్

కాలేజీల యాజమాన్యాలతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

# ఎమ్మెల్యే 9

## కాంగ్రెస్ గూటికి అరికెపూడి

### పలువురు కార్పొరేటర్లు చేరిక


**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జులై13:** బిఆర్‌ఎస్ పార్టీకి వరుస సాకులు తగుతుతూనే ఉన్నాయి. శుక్రవారం సాయంత్రం రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ 'కారు' దిగి కాంగ్రెస్ గూటికి చేరుకున్న మరుసటి రోజే బిఆర్‌ఎస్ పార్టీకి చెందిన మరో ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ కాంగ్రెస్‌లో చేరారు. తనఅనుచరులతో కలిసి రేవంత్‌రెడ్డి నివాసానికి వెళ్లిన శేరిలింగంపల్లి అరికెపూడి గాంధీ, సిఎం సమక్షంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. దీంతో కాంగ్రెస్‌లో చేరిన బిఆర్‌ఎస్ ఎమ్మెల్యేల సంఖ్య 9కి చేరింది. తాజాగా ఎమ్మెల్యే అరికెపూడి గాంధీతో పాటు పలువురు కార్పోరేటర్లు సైతం కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. శేరిలింగంపల్లి కార్పొరేటర్ నాగేందర్ >>2

## వలస బాటలో 'గూడెం'

నేడో, రేపో కాంగ్రెస్‌లోకి

3లో

# రాలుతున్న 'గులాబీ' రేకులు



## 'కమలం' పార్టీలో 'గులాబీ' విలీనం?

### కెసిఆర్‌లో అంతర్మథనం

### డిల్లీ వేదికగా చర్చలు నిజమేనా?

### రాజకీయ వర్గాల్లో ఊహాగానాలు

**హన్మకొండ జిల్లా బ్యూరో- ప్రభాతవార్త:** 2001వ సంవత్సరంలో మాజీ సీఎం గులాభి బాస్ కేసిఆర్ నేతృత్వంలో ఉద్యమ పార్టీగా పురుడు పోసుకున్న గులాభి పార్టీ కమలం పార్టీలో విలీనం కానుందా..? అనే చర్చ తెలంగాణ రాష్ట్రంలో హాట్‌టాపిక్‌గా మారింది. నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఉద్యమ పార్టీగా అవతరించి రాజకీయ పార్టీగా మారి ఎదురులేని శక్తిగా ఎదిగి 2014 నుండి 2023 వరకు రెండుపర్యాయాలు తెలంగాణ రాష్ట్రాన్ని ఏకచక్రాధిపతిగా సీఎం కేసిఆర్ ఏలిన మాట విధితమే. తనకు ఎదురు ఎవరు ఎవ్వరు లేరంటూ మాజీ సీఎం కేసిఆర్ వారి కుటుంబం చేసిన తప్పిదాలు ఒక్కొక్కటిగా గులాభి బాస్ మెడకు చెట్టుకొని ప్రస్తుతం రాజకీయ చతురత కలిగిన కేసిఆర్ ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. నాడు బిఆర్‌ఎస్ హయాంలో ప్రతిపక్షాలు లేకుండా చేయాలనే నేడు బిఆర్‌ఎస్ పార్టీ కొంపముంచిందనే చర్చ రాజకీయ విశ్లేషకుల్లో సైతం నెలకొంది. కేసిఆర్ కూతురు కల్వకుంట్ల కవిత లిక్కర్ స్కామ్‌లో ఇరుక్కోవడం, పోలీస్‌టాపింగ్ వ్యావహారంలో తనయుడు కేసిఆర్, కేటిఆర్ ఇరుక్కోవడం విద్యుత్ కొనుగోళ్లు, కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో అవినీతి అన్ని కలగూర గంపగా మాజీ సీఎం కేసిఆర్ ప్రతిష్టను దెబ్బతిసాయనే చెప్పవచ్చు. సొంత పార్టీ ఎమ్మెల్యేల, మంత్రుల అభిప్రాయాలు తీసుకోకుండా వారిని కనీసం కలువకుండా సొంత నిర్ణయాలు, కుటుంబం చేసిన అవినీతి అక్రమాలతో పాటు గులాభి ఎమ్మెల్యేలు చేసిన భూకబ్జాలు ఇవన్నీ పాపాలు గులాభి పార్టీని వెంటాడగా ఇటీవల 2023 డిసెంబర్‌లో జరిగిన తెలంగాణ రాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో పార్లమెంట్ ఎన్నికల్లో కమలం పార్టీ పుంజుకోవడం ఒక్క ఎంపి సీటు కూడా గెలవకపోవడంతో గులాభిబాస్ అంతర్మథనంలో పడ్డారు. అసెంబ్లీ ఎన్నికల తర్వాత ప్రభుత్వాన్ని కూలుస్తామని కేసిఆర్, కేటిఆర్ తండ్రి కొడుకులు చేసిన వాఖ్యలు కాంగ్రెస్ పార్టీని, సీఎం రేవంత్‌రెడ్డిని అలర్ట్ చేశాయి. కాంగ్రెస్ పార్టీ గర్‌వాపస్ అనే నినాదంతో కాంగ్రెస్ ఆకర్ష్ సీఎం రేవంత్‌రెడ్డి అమలు చేయగా గులాభి పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలు ఒక్కరొక్కరు హస్తం తీర్థం పుచ్చుకోవడంతో బిఆర్‌ఎస్ పార్టీ పూర్తిగా బలహీన >>2

# చిగురిస్తున్న ఆశలు

## ఆల్మట్టి ప్రాజెక్టులో పెరుగుతున్న నీటిమట్టాలు

### శ్రీశైలం, సాగర్ ఆయకట్టుకు కూడా మళ్లీ మంచి రోజులు

### 'నైరుతి' మరింత వర్షిస్తే ప్రాజెక్టులకు జలకళ



**హైదరాబాద్,జూలై 13,ప్రభాతవార్త:** లాల్ బహదూర్ శాస్త్రీ ఆల్మట్టి ప్రాజెక్టులో నీటిమట్టం పెరుగుతుండటంతో తెలుగు రాష్ట్రాల్లో ఆశలు చిగురిస్తున్నాయి. కర్ణాటకలో 519 ఎత్తులో ఉన్న ఎల్‌బిఎస్ ఆల్మట్టి ఆనకట్ట గరిష్ఠ నీటి సామర్థ్యం 129.72 టిఎంసిల కాగా ప్రస్తుతం 92.17 టిఎంసిల నీరు అందులోకి వచ్చి చేరింది. నైరుతి వర్షించడం ప్రారంభమైన గత యాభైరోజుల నుంచి ఆల్మట్టిలోకి 69.51 టిఎంసిల నీరు వచ్చిచేరింది. పూర్తి నీటి నిల్వ సామర్థ్యంకు 37.55టిఎంసిలు తక్కువ ఉన్నాయి. గత ఏడాది ఇదే రోజున ఆల్మట్టిలో 22.80టిఎంసిల నీరు మాత్రమే ఉండేది. గత యేడాది ఇదే రోజున ప్రాజెక్టు ఎగువ నుంచి 20028 క్యూసెక్కుల నీరు వరద వస్తూ వుండేది. ఈ యేడు దానికంటే తక్కువ వరద వస్తున్నది. ప్రస్తుతం19919 క్యూసెక్కుల వరద వస్తున్నా నీటినిల్వ ఎక్కువగా ఉండటంతో జూలై మూడోవారం చివర వరకు మరింత నీటి నిల్వపెరుగుతుందనే గంపెడాశతో తెలుగురాష్ట్రాల్లోని శ్రీశైలం, నాగార్జునసాగర్ ఆయకట్టు రైతాంగం ఎదురు చూస్తున్నారు. కృష్ణా నదిలో నీటి లభ్యత కనిష్ట స్థాయికి చేరుకోవడంతో బేసిన్‌లోని మహారాష్ట్ర,కర్ణాటక,తెలంగాణ ఆంధ్రప్రదేశ్‌లో సాగునీటికే కాదు తాగునీటికి కొరత ఏర్పడింది. మహారాష్ట్రలోని పశ్చిమ కనుమల్లో మహాబలేశ్వరం పర్వత శ్రేణుల్లో పుట్టిన కృష్ణమ్మ 1400 కి.మి కృష్ణాజిల్లా హంసలదీవి వద్ద బంగాళఖాతంలో కలుస్తుంది.గత ఏడాది 2015-16 శ్రీశైలం ప్రాజెక్టులోకి వచ్చిన కనిష్ట ప్రవాహం 58.96టిఎంసిల కంటే రెట్టింపు >>2

# రక్తం చిందిన నేషనల్ హైవే

## ఆటోను ఢీ కొట్టిన కంటైనర్

### ముగ్గురు మృతి, ఇద్దరి పరిస్థితి విషమం

**వాజేడు, జులై 13, ప్రభాతవార్త:** నేషనల్ హైవే 163 ఏటూరునాగారం హైవే ట్రీట్ ఫంక్షనల్ సమీపంలో శనివారం సాయంత్రం ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఆటోను ఢీకొట్టిన కంటైనర్ రక్తం చిందిన నేషనల్ హైవే ప్రమాదంలో ముగ్గురు అక్కడిక్కడే మృతి చెందారు, ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండటంతో వారిని ఏటూరు నాగారం సామాజిక వైద్యశాలకు >>2

# కురియన్ కమిటీ మళ్లీ 26న రాక

### మరింతగా అభిప్రాయ సేకరణ

**హైదరాబాద్,జూలై 13,ప్రభాతవార్త:** లోక్‌సభ ఎన్నికల ఫలితాలపై సమీక్ష కోసం ఏఐసిసి వేసిన కురియన్ కమిటి ఈనెల 26వ మళ్ళీ రెండోసారి రాష్ట్రానికి కురియన్ కమిటీ రానున్నట్లు తెలిసింది. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కురియన్ నాయకత్వంలో రఖిబుల్ హుస్సేన్, ఫర్గత్ సింగ్‌తో కూడిన త్రిసభ్య కమిటి గురు,శుక్రవరాల్లో గాంధీభవన్‌లో 16 మంది లోక్‌సభ అభ్యర్థులు, ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జీలు డిసిసి అధ్యక్షుల నుంచి అభిప్రాయాలను స్వీకరించింది. అయితే రెండు రోజులు జరిపిన విచారణలో హాజరైన నేతలందరు ఒకే తరహాలో సమాచారం తెలపడంతం మళ్ళీ వారి నుంచి సమాచారం తీసుకోవాలని నిర్ణయించినట్లు తెలిసింది.

తెలంగాణలో బిఆర్‌ఎస్ ఓట్లు బిజెపికి బదిలీ జరిగాయని, హిందుత్వం పట్ల ఓటర్లు మొగ్గుచూపారని చాలామంది వెల్లడించారు. కార్యకర్తలు కష్టడినా నాయకులు తప్పు చేశారని ముఖ్యంగా ఇతర పార్టీల నుంచి వలస వచ్చిన వారికి టికెట్లు ఇవ్వడం,స్థానికేతరులను బరిలో నిల పడం కూడా గెలిచే సీట్లు గెలవకుండా పోయా యని ఆరోపణలు ఎక్కువ మంది చేశారు.

ఈ రిపోర్టును నివేదిక రూపంలో ఈనెల హైకమాండ్‌కు నివేదించాల్సి ఉండగా మళ్ళీ తెలంగాణకు టూర్ పెట్టుకోవడం కాంగ్రెస్ నేతల్లో అనిశ్చితి పెరుగుతోన్నది. తెలంగాణలో ఆశించిన సీట్లు రాకపోవడానికి సామాజిక సమతుల్యత అభ్యర్థుల ఎంపికలో కూడా లేకపోయిందని దీనితో వెనుకబడినతరగతులు కూడా కాంగ్రెస్‌కు దూరం అవున్నారని కాంగ్రెస్ నాయకులు అభ్యర్థులు ఆవేదన వ్యక్తంచేవారు.



ఉప ఎన్నికలు:

# ఇండియా కూటమి జోరు

13లో పది సీట్లు కూటమికే

రెండు చోట్ల మాత్రమే ఎన్‌డిఎ

**న్యూఢిల్లీ, జులై 13:** ఏడురాష్ట్రాల్లోని 13 స్థానాల్లో జరిగిన ఉప ఎన్నికల్లో ఇండియా కూటమి పదిస్థానాలు గెలిచి తిరుగులేని పట్టును ప్రదర్శించింది. కాగాఅధికారంలోని బిజెపని కేవలం రెండుస్థానాలకే పరిమితం అయింది. మూడోసారి ప్రధానిగా నరేంద్రమోడీ పాలన పగ్గాలు చేపట్టిన తర్వాత జరిగిన మొదటి ఉప ఎన్నికల్లో ఇండియా కూటమి పట్టు మరోసారి నిరూపించుకోగలిగింది. పంజాబ్‌లో అప్ మహీందర్ భగత్ జలంధర్ వెస్ట్‌నుంచి గెలుపొందారు. 23వేలఓట్ల మెజార్టీతో గెలిచారు. పశ్చిమ బెంగాల్‌లో కూడా తృణమూల్ కాంగ్రెస్ తన ఆధిపత్యం ప్రదర్శించింది. మొత్తం ఎన్నికలు జరిగిన నాలుగుస్థానాల్లోను గెలిచింది. హిమాచల్‌ప్రదేశ్‌లో కూడా గణనీయంగా కాంగ్రెస్ తన మెజార్టీ నిరూపిం చుకుంది. ముఖ్యమంత్రి సుఖ్వీందర్‌సింగ్ సుకు సతీమణి కమలేష్ ఠాకూర్ డేహ్రా నియోజకవర్గంనుంచి గెలుపొందారు. అలాగే నాలాఘర్ స్థానంలోకూడా గెలిచింది.బిజెపి కేవలం హమీర్‌పూర్ స్థానమమాత్రమే నిలుపుకోగలిగింది. ముఖ్యమంత్రి సుఖు మాట్లాడుతూ హిమాచల్‌చల్ ప్రదేశ్‌ప్రజలు కుట్రలతో ప్రభుత్వాలను కూలగొట్టాలను కునేవారికి సరైన గుణపాఠం చెప్పారన్నారు. హిమాచల్ ప్రజలు మాకు 2022లో 40 స్థానాలు ఇచ్చారని, గతంలో కూడా ఎమ్మెల్యేలను కొనుగోలు చేయాలను కున్న పార్టీలకు గట్టిగా బుద్ధిచెప్పారని తెలి పారు. ఇక రాష్ట్రంలో అలాంటి కొనుగోళ్లు ఉండవని గుర్తుతెచ్చుకోవాలని ప్రజలు తెలియజెప్పారని సుఖు పేర్కొన్నారు. ముగ్గురు స్వతంత్ర ఎమ్మెల్యేల రాజీనామాకు కారణాలు లేవని వారు కేవలం బిజెపితో జట్టుకట్టేందుకే రాజీనామాచేసారన్నారు. వారికిసైతం ప్రజలు షాక్ ఇచ్చారన్నారు. ఇక తమిళనాడులో డిఎంకెకు చెందిన అన్నియూర్‌శివ విక్రవండి అసెంబ్లీ స్థానాన్ని గెలుచుకున్నారు. 60వేల మెజార్టీ సాధించారు. కాంగ్రెస్ పార్టీ ఉత్తరాఖండ్‌లోని రెండు స్థానాల్లోను గెలిచింది. బిజెపి చెందిన కమలేష్‌ప్రతాప్ సాహి మధ్యప్రదేశ్‌లోని అమర్‌వార్‌స్థానం గెలిచారు. స్వతంత్ర అభ్యర్థి శంకర్‌సింగ్ రూపౌలి నియోజకవర్గం ఉప ఎన్నికలో గెలిచారు.జెడియుకి చెందిన కలాధర్‌ప్రసాద్ మండల్ పై 8246 ఓట్ల ఆధిక్యంతో గెలుపొందారు. 2024 సార్వత్రిక ఎన్నికలు జరిగిన తర్వాత మొదటిసారిగా ఉప ఎన్నికలు జరిగాయి. ఇండియా కూటమి తన పట్టు నిరూపించుకుంటూ మరింతగా బలపడతామన్న సంకేతాలిచ్చింది.

# నిరుద్యోగుల రణభేరి

### గ్రూప్-2, 3 పరీక్షలు వాయిదా వేయాలని డిమాండ్

### భారీగా మోహరించిన పోలీసులు

### ఆందోళనలో సొమ్మసిల్లిపడిపోయిన యువతి

### ప్రభుత్వం దిగివచ్చేదాకా ఆందోళన విరమించబోమన్న నిరుద్యోగులు

**హైదరాబాద్ (చిక్కడపల్లి), జులై 13 ప్రభాతవార్త:** గ్రూప్-2,గ్రూప్-3 పరీక్షలను వాయిదా వేయాలని కోరుతు నిరుద్యోగులు శనివారం రాత్రి అశోక్‌నగర్ చౌరస్తా వద్ద పెద్దఎత్తున ధర్నా చేస్తూ రాస్తారోకో నిర్వహించారు.ముందుగా చిక్కడపల్లి చౌరస్తా నుంచి ఆర్టీసిక్రాస్‌రోడ్స్, జవహర్‌నగర్ మీదుగా అశోక్‌నగర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించిన నిరుద్యోగులు అనంతరం కొదిసేపు ఆర్టీసిక్రాస్‌రోడ్స్ వద్ద బైఠాయించి అనంతరం అశోక్‌నగర్ చౌరస్తా వద్ద వందల సంఖ్యలో నిరుద్యోగులు ఆందోళనకు దిగారు. ఆందోళన సందర్భంగా ఓ నిరుద్యోగ యువతి సొమ్మసిల్లిపోవడంతో వెంటనే ఆమెను పోలీసుల సహాయంతో సమీపంలోని ఆసుపత్రికి హుటాహుటిన తరలించారు. పదిసంవత్సరాల కెసిఆర్ పాలనలో తామంతా నిరుద్యోగంతో కృంగిపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ అయిన గ్రూప్-2, 3 పోస్టులను పెంచాలని, ఏండ్లకు ఏండ్లు ఎదురు చూస్తున్నామని, ఇదే మాకు చివరి అవకాశం అని, ఆ విధంగా పెంచి తమను ఆదుకోవాలని కోరారు. ముఖ్యంగా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడటానికి కీలకపాత్ర పోషించామని, రాష్ట్రంలో అన్ని జిల్లాలో ఊరువాడ తిరిగామని, కాళ్ళుపట్టుకుని >>2



హైదరాబాద్ అశోక్‌నగర్ చౌరస్తాలో శనివారం ఆందోళన చేస్తున్న నిరుద్యోగులు

## హైదరాబాద్- విజయవాడ రహదారి

# రూ.700 కోట్లతో విస్తరణ

**విజయవాడ,జూలై13,ప్రభాతవార్తప్రతినిధి:** హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారి విస్తరణ పనులకు ముమ్మర కసరత్తు సాగుతోంది. ఆరు వరుసలుగా దీన్ని నిర్మించేందుకు డీపీఆర్ రూపొందించే బాధ్యతను ప్రైవేటు సంస్థకు అప్పగించాలని కేంద్ర రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వశాఖ తాజాగానిర్ణయించింది.

వచ్చే నెల చివరిలోగా టెండర్లు ఆహ్వానించేందుకు వీలుగా అధికారులు వేగంగా కార్యాచరణ రూపొందిస్తున్నారు.హైదారాబాద్-విజయవాడ జాతీయ రహదారికి ప్రస్తుతం ఉన్న నాలుగు వరుసలకు రెండు వైపులా ఒక్కో వరుస రహదారిని నిర్మించాల్సి ఉంది. ప్రాథమిక అంచనా ప్రకారం దీనికి సుమారు రూ.600 కోట్లనుంచి రూ.700 కోట్ల వరకు వ్యయం అవుతుందని అధికారుల ప్రాథమిక అంచనాగా ఉంది. సవివర నివేదిక (డీపీఆర్) సిద్ధమయ్యే నాటికి ఎంత వ్యయం అవుతుందన్నది స్పష్టత వస్తుందని ఉన్నతాధికారి ఒకరు వివరించారు.



శనివారం హైదరాబాద్‌లో సిఎం రేవంత్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన ఎమ్మెల్యే అరికపూడి గాంధీ

# ఇక సకాలంలోనే ఫీజురీయింబర్స్

>> ప్రాధాన్యతలు మారి ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలు పేరుకుపోయాయని అన్నారు. పాత బకాయిలపై ఎలా ముందుకెళ్లాలనే అంశాన్ని పరిష్కరించే బాధ్యతను మంత్రి శ్రీధర్‌బాబుకి అప్పగిస్తున్నట్టు ప్రకటించారు. ఈ విద్యా సంవత్సరం నుంచి ఆన్‌టైమ్‌లోనే ఫీజురీయింబర్స్‌మెంట్ చెల్లించేందుకు ప్రయత్నిస్తామన్నారు. ఫీజురీయింబర్స్‌మెంట్ పై మీకు ఎలాంటి అనుమానాలు వద్దని యాజమాన్యాలకి సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఫీజురీయింబర్స్‌మెంట్‌పై తమ ప్రభుత్వం త్రిముఖ వ్యూహంతో ముందుకు సాగుతుందన్నారు. దేశంలో, ప్రపంచంలో గొప్ప గొప్ప నిర్మాణాలన్నీ ఇంజినీర్లు సృష్టించినవేనని అన్నారు. మానవ నిర్మిత అద్భుతాలన్నీ ఇంజినీర్లు ఆవిష్కరించినవేనని ఇంజనీరింగ్ కాలేజీలు నిరుద్యోగులను ఉత్పత్తి చేసే కర్మాగారాలుగా మారకూడదన్నారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించి దేశ భవిష్యత్తును నిర్మించేలా ఉండాలన్నారు. అందుకు కావల్సిన సాయాన్ని అందించేందుకు తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. కేవలం ఉద్యోగాలను సృష్టించే సంస్తలుగా కాదని.. దేశానికి మేధావులను అందించే సంస్థలుగా ఇంజనీరింగ్ కాలేజీలు ఉండాలన్నారు. ఇంజనీరింగ్‌లో కేవలం కంప్యూటర్‌సైన్స్ పైనే కాకుండా.. సివిల్, మెకానికల్ ఇంజనీరింగ్ లాంటి కోర్ కోర్సులను కూడా తప్పకుండా నిర్వహించాలని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. స్కిల్ డెవలప్‌మెంట్‌లో భాగంగా టాటా భాగస్వామ్యంతో రూ. 2400 కోట్లతో ప్రభుత్వం ఐటీఐల రూపురేఖలు మారుస్తోందాన్నరు. ఫార్మా, ఐటీ తరువాత ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ ప్రపంచాన్ని నడిపించబోతుందన్నారు. యువత కోసం త్వరలో స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీని ఏర్పాటు చేయబోతున్నామని రేవంత్ రెడ్డి తెలిపారు. ప్రపంచంతో పోటీ పడేలా తెలంగాణ రాష్ట్రాన్ని తీర్చిదిద్దుతామన్నారు. తమ ప్రభుత్వానికి భేషజాలు లేవని.. నిరుద్యోగులకు మేలు చేసేలా ప్రభుత్వ నిర్ణయాలు ఉంటాయని స్పష్టం చేశారు. నోటిఫికేషన్ల ప్రకారమే ప్రభుత్వం పరీక్షలను నిర్వహిస్తోంది. గ్రూప్-1లో ఒకటి నిష్పత్తి 100 ప్రకారం ఎంపిక చేయాలని కొందరు అంటున్నారని. .అలా చేస్తే నోటిఫికేషన్‌లో ఉన్న దానికి విరుద్ధంగా ఉంటుందని.. అలా చేయడంతో కోర్టులో వెంటనే ప్రక్రియ నిలిపివేస్తాయని అందుకే తాము నోటిఫికేషన్ ప్రకారమే గ్రూప్-1కి 1ః 50 ప్రకారం ఫలితాలను ప్రకటించినట్టు సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. గత పదేళ్లుగా ఉద్యోగాల కోసం యువత కొట్లాడిందని.. కానీ ఇప్పుడు కొందరు పరీక్షలను వాయిదా వేయాలని మాట్లాడుతున్నారని విమర్శించారు. పరీక్షలను వాయిదా వేయాలని కోరిన వారి గురించి వాకబుగా చేయగా వారిలో ఒకరు కోచింగ్ సెంటర్ నిర్వహకులు ఉన్నారని.. రెండు నెలలు వాయిదా వేస్తే ఆయనకి రూ. 100 కోట్ల ఆదాయం వస్తుందని డిమాండ్ చేసినట్టు తెలిసిందన్నారు. మరో ఇద్దరిని కొందరు రెచ్చగొట్టి దీక్షలను చేయించారని చెప్పారు. త్వరలోనే జాబ్ క్యాలెండర్‌ను తీసుకురాబోతున్నట్టు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. యూపీఎస్సీ తరహాలో ప్రతీ ఏటా జాబ్ క్యాలెండర్ ప్రకారం ఉద్యోగాలు భర్తీ చేస్తామన్నారు. విద్యా సంస్థలు రాజకీయ పునరావాస కేంద్రాలుగా మారకూడదనేది తమ ప్రభుత్వ విధానమన్నారు. తాము అధికారంలోకి వచ్చిన మొదటి 30 రోజుల్లోనే 30వేల ఉద్యోగాలను భర్తీ చేశామన్నారు. ఆర్థికభారం ఇతర సమస్యలు ఉన్నప్పటికీ ఒక్కొక్కటీ పరిష్కరించకుంటూ తమ ప్రభుత్వం ముందుకు సాగుతోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

# ఎమ్మెల్యే 9

>> యాదవ్, మియాపూర్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, చందానగర్ కార్పొరేటర్ మంజుల రఘునాథ్‌రెడ్డి, హైదర్‌నగర్ కార్పొరేటర్ నార్నె శ్రీనివాస్‌లు హస్తం గూడికి చేరారు. పార్టీలో చేరిన అనంతరం ఎమ్మెల్యే తన నివాసంలో మీడియాతో మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధి కోసం, రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్‌లో చేరానని చెప్పారు.

నియోజకవర్గంలో ఇప్పటికే ఎంతగానో అభివృద్ధి చేశామని, ఇంకా అభి వృద్ధి చేయాల్సిన అవసరం ఉందని పేర్కొ న్నారు. ఫ్లై ఓవర్లు, డబుల్ డెక్కర్ ఫ్లైఓవర్లు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. అభివృద్ధే ధ్యేయంగా ముందుకు పోతామన్న ఆయన నియోజకవర్గ అభివృద్ధికి నిధులు కోరామని దానికి సిఎం సానుకూలంగా స్పందించినట్లు వివరించారు. కాగా, జిహెచ్‌ఎంసీ పరిధిలోని చందానగర్ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని ఆ డివిజన్ కార్పొరేటర్ మంజుల రఘునాథ్‌రెడ్డి అన్నారు. చందానగర్ డివిజన్ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తానని, ఇప్పటి వరకు తమకు మద్దతు ఇచ్చిన ప్రజలు, కార్యకర్తలు, నాయకులు, అభిమానులకు ధన్యవాదాలు తెలిపారు. అరికెపూడి గాంధీతో కలిపి ఇప్పటి వరకు బిఆర్ఎస్ నుంచి 9 మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరారు.

## మోడల్ స్కూల్స్ రెగ్యులర్ టీచర్లకు అందని జీతాలు: హరీష్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జులై 13:** ఒకటో తేదీనే ప్రభుత్వ ఉద్యోగులకు వేతనాలు చెల్లిస్తున్నట్లు గొప్పలు చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం, ఆచరణలో మాత్రం అలసత్వం ప్రదర్శిస్తున్నదని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు పేరొనకనారు. మోడల్ స్కూల్ టీచర్లకు గత 7 నెలల నుంచి ఏ నెలలో కూడా 1వ తేదీన వేతనాలు చెల్లించకపోవడం కాంగ్రెస్ మోసపూరిత వైఖరికి నిదర్శనమని మండిపడ్డారు. ఈ నెల 13 రోజులు గడిచినప్పటికీ మోడల్ స్కూల్ రెగ్యులర్ టీచర్స్ జీతాలు అందక అనేక ఆర్థికపరమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈనెల 8వ తేదీన సగం మంది ఉద్యోగులకు మాత్రమే వేతనాలు చెల్లించిన సర్కార్, ఇంకా పలు జిల్లాల్లో పనిచేస్తున్న 1000 మందికి పైగా రెగ్యులర్ టీచర్లకు ఇంకా వేతనాలు చెల్లించలేదన్నారు.

# నిరుద్యోగుల రణభేరి

>> కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేయాలని అడిగామని, పోస్టులు పెంచే బాధ్యత కూడా తీసుకుని తమ సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. అన్ని పరీక్షలు రాసుకునే వెసులుబాటు కల్పిస్తామని సిఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండాలని కోరారు. గ్రూప్-1లో పోస్టులు పెంచారనని, డిఎస్సీలో పెంచారని దీనికి తాము స్వాగతిస్తున్నామని, కాని గ్రూప్-2, గ్రూప్-3లో కూడా పోస్టులు పెంచి తమను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చిక్కడపల్లి పోలీసుసబ్ డివిజన్ ఏసీపీ ఎల్.రమేశ్‌కుమార్ నేతృత్వంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. అశోక్‌నగర్ చౌరస్తా భారీగా నిరుద్యోగుల ఆందోళన సందర్భంగా భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. చిక్కడపల్లిట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వీరేశం నేతృత్వంలో ట్రాఫిక్‌కు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకున్నారు. రాత్రి 10.30 గంటల వరకు ఆందోళన ఇంకా కొనసాగుతూనే ఉంది.

# రాలుతున్న 'గులాబీ' రేకులు

>> పడుతున్న నేపథ్యంలో ఇదే అదునుగా భావించిన ఎలాగైనా 2028లో తెలంగాణలో కమలం జెండా ఎగురవేయాలనే ఆలోచనతో బిజెపి జాతీయ నాయకత్వం హమీద్‌షా, ప్రధానమంత్రి మోడి తెలంగాణపై ప్రత్యేక దృష్టి సారించారు. ఇటీవలనే పార్లమెంట్ ఎన్నికల్లో 8 సీట్లు గెలిచి తమ సత్తా చాటారు. ఎలాగైనా గులాభి పార్టీని తమ పార్టీలో విలీనం చేయాలనే దిశగా వ్యూహాత్మకంగా బిజెపి అడుగులు వేస్తుంది. ఓ వైపు తమ సొంత పార్టీ ఎమ్మెల్యేలను కాపాడుకోలేని స్థితిలో గులాభి బాస్ ఉండగా తన కూతురు డిల్లీ లిక్కర్ స్కామ్‌లో జైలులో మగ్గుతున్న విషయం తెలిసిందే. అవినీతి కేసులు కల్వకుంట్ల కుటుంబాన్ని ఉక్కిరి బిక్కిరి చేస్తున్న సందర్భంలో బిజెపితో దోస్తి కట్టడానికి అల్లుడు హరీష్‌రావు, తనయుడు కేటిఆర్ బిజెపి జాతీయ నాయకత్వంతో డిల్లీలో చర్చలు జరుపుతున్నారన్న వార్తలు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్నాయి. ఏది నిజమో ఏది అబద్ధమో తెలియని అయోమయ పరిస్థితిలో గులాభి క్రింది స్థాయి నేతలు కార్యకర్తలు ఉన్నారు. పార్టీని పటిష్టపరచడం దేవుడెరుగు కాని తన కుటుంబాన్ని కాపాడుకోవడానికి బిజెపితో అంటకాగుతున్నారా అనే చర్చ తెలంగాణలో ప్రస్తుతం జోరందుకుంది. కొంత మంది ఎమ్మెల్యేలు రాజ్యసభ సభ్యులు కమలం తీర్థం పుచ్చుకోనున్నారని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతుండగా ఒక్కొక్కరుగా గులాభి రేకులు రాలినట్లు చేజారిపోవడంతో కమలం పార్టీ సైతం బిఆర్ఎస్ ఎమ్మెల్యేలను చేర్చుకునే దిశగా రహస్యంగా మంతనాలు జరుపుతున్నట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ కమలం తెలంగాణ రాష్ట్రంలో వ్యూహాత్మకంగా అడుగులు వేస్తు బిఆర్ఎస్ పార్టీని బొందపెట్టుటకు చూస్తున్నాయన్న ఆరోపణలు గులాభి నేతలు చేస్తున్నప్పటికి లోలోపల మాత్రం ప్రస్తుత జైలు గంటాలు తప్పించుకోవడానికి గులాభి పార్టీని కమలంలో విలీనం చేయడమా..? లేక పొత్తు పెట్టుకోవడమా? లేక మద్దతు ఇవ్వడమా ఏం చేయాలి అని దిక్కుతోచని స్థితిలో గులాభి బాస్ ఉన్నట్లు తెలుస్తోంది. ఏదేమైనా తెలంగాణ రాష్ట్రంలో ఎదురులేని రాజకీయ శక్తిగా ఎదిగిన గులాభి పార్టీ కనుమరుగు కానుందా అనే చర్చ గ్రామీణ స్థాయి నుండి జిల్లా స్థాయి వరకు ఎక్కడ చూసినా అదే టాపిక్ రావడం విశేషం.



శనివారం ముంబయిలో అనంత్ అంబానీ వివాహానికి విచ్చేసిన ఎపి సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్‌కు స్వాగతం పలుకుతున్న ముకేష్ అంబానీ

## రక్తం చిందిన నేషనల్ హైవే

>> తరలించి చికిత్స అందిస్తున్నారు. మృతి చెందినవారు వాజేడు గ్రామానికి చెందిన వారుగా గుర్తించారు. వారిలో కాకర్లపూడి సత్యనారాయణరాజు (యర్రబాబు), కాకర్లపూడి సత్యవతి, ఆటోడ్రైవర్ తల్లండి నాగరాజు ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందారు. అంజిరెడ్డి అనితలకు తీవ్రగాయాలు కావడంతో అంబులెన్స్‌లో సామాజిక వైద్యశాలకు తరలించారు. వీరు వాజేడు నుండి ఏటూరునాగారం వైపు వస్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. సత్యనారాయణరాజు కూతురు అనితను ఏటూరునాగారంలో వైజాగ్ బస్సు ఎక్కించేందుకు వస్తున్న క్రమంలో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. కంటైనర్ డ్రైవర్ తప్పించుకుని పారిపోతుండగా జగన్నాథపురం జంక్షన్ వద్ద గ్రామస్తులు అడ్డుకోవడంతో డ్రైవర్ దిగి పారిపోయాడు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# చిగురిస్తున్న ఆశలు

>> ప్రవాహం వచ్చింది. శ్రీశైలంలోకి గత ఏడాది 120 టిఎంసిలు మాత్రమే నీరు రాడంతో కృష్ణాబేసిన్‌లో కరువు పరిస్థితులు దాపురించాయి. గత ఏడాది ఆగస్టు 6 నాటికి శ్రీశైలంలో 860.20 అడుగుల నీరు చేరడంతో 106 టిఎంసిల నీటి నిల్వ వచ్చిచేరింది. కృష్ణానదిలో ఏటా 75శాతం నికరజలాల నీటి ఆధారంగా 2130టిఎంసిలు లభ్యత ఉంటుదని బచావత్ ట్రిబ్యునల్ అంచనావేసింది. అందులో మహారాష్ట్రకు 585, కర్ణాటక 734, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు 811 టిఎంసిలు చొప్పున కేటాయించారు. ఇందులో ఆంధ్రప్రదేశ్‌కు 512టిఎంసిలు తెలంగాణకు 299 పంపిణీ చేశారు. ఆలమట్టి ఎత్తు 519 నుంచి 524అడగుల ఎత్తుకు పెంచడానికి కేంద్రం ఇచ్చిన అనుమతి ప్రకారం మరో ఐదు మీటర్లు ఎత్తు పెంచితే కర్ణాటకకు మరో 130టిఎంసిలు నీటిని వాడుకొనే సౌకర్యం లభిస్తే ఇక దిగువన ఉన్న తెలుగు రాష్ట్రాల పరిస్థితి మరింత దిగజారీ పోయే అవకాశం ఏర్పడే ప్రమాదం ఉంది. గత దశాబ్దకాలంగా కృష్ణానదిలో నీటి లభ్యత తగ్గిపోవడంతో తెలుగు రాష్ట్రాలపై తీవ్ర ప్రభావం చూపుతున్నది. నారాయణపూర్ ప్రాజెక్టు గరిష్ట నీటి సామర్థ్యం 37.64 టిఎంసిలు కాగా అందులో ప్రస్తుతం 25.50టిఎంసిల నీరు ఉంది. గత ఏడాది ఇదే రోజున ఇందులో 17.41టిఎంసిల నీరు ఉంది. కృష్ణానది ఆవిర్భావ ప్రాంతం నుంచి 775 కి.మి దూరంలో ఉన్న జూరాల ప్రాజెక్టు గరిష్ఠ నీటి మట్టం 9.66టిఎంసిలు కాగా ప్రస్తుతం 7టిఎంపిలనీరు ఉంది. గత ఏడాది ఇందులో 6.14టిఎంసిల నీరు మాత్రమే ఉంది. శ్రీశైలంలో గరిష్ఠ నీటి మట్టం 215.81 టిఎంసిలకు గాను 36.3టిఎంసిల నీరు ఉంది. గత ఏడాది 33 టిఎంసిలు మాత్రమే శ్రీశైలం ప్రాజెక్టులో ఉంది. నాగార్జునసాగర్ 312టిఎంసిల గరిష్ఠనీటి నిల్వకుగాను 120టిఎంసిల నీటిమట్టంతో డెడ్‌స్టోరేజిలోనే ఉంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని కృష్ణా, గోదవరి నదులపై ఉన్న నీటి వనరులలో గరిష్టంగా 966.90 టిఎంసిల నీరు నిల్వచేసుకొనే సామర్థ్యం ఉండగా ప్రస్తుతం236.98 టిఎంసిల నీరు మాత్రమే ఉంది. ఇంకా 730.16టిఎంసిల నీరు నిండితే ప్రాజెక్టులకు నీటి కళ వస్తుంది. గత ఏడాది 341.98టిఎంసి ఈ ప్రాజెక్టులలో నీరు ఉండేది. గోదావరి ప్రాజెక్టుల్లో నీరు చేరకపోయినా నైరుతి వర్షించడం మొదలైన నాటి నుంచి ఈ యేడాది ఆలమట్టిలో 69.51టిఎంసిల నీరు వచ్చింది. నారాయణపూర్‌కు 6.94 జూరాలకు 7.53టిఎంఎసిలు శ్రీశైలంకు 6.80టిఎంసిలు నీరు వచ్చి చేరింది. గత ఏడాదితో పోల్చి చూస్తే కృష్ణాక్యాచ్‌మెంట్ ఏరియాలో కొంత మెరుగైన వరద వస్తుందని సంతృప్తి వ్యక్తం అవుతున్నా ఎప్పుడు డ్రైస్పెల్ వచ్చి వర్షాలు ముఖం చాటేస్తాయో అనే భయం పట్టుకొంది. ఆగస్టు, సెప్టెంబర్ నెలలో కురిసే వర్షాలపై రైతాంగం కోటి ఆశలతో ఎదురుచూస్తున్నారు.

## బిఆర్ఎస్ నలుగురు ఎంపీలు బిజెపిలోకి వెళ్లరు: వద్దిరాజు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జులై13:** బిజెపిలో తాము చేరుతున్నట్లు... బిఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ విలీనం అవుతున్నట్లు కొన్ని పత్రికలు, ఛానెళ్లలో వెలువడుతున్న వార్తలు, కథనాల్లో ఏమాత్రం నిజం లేదని బిఆర్ఎసన పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర ఖండించారు. అవి అభూత కల్పనలు అని కొట్టిపారేశారు. తాము బిఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కెసిఆర్ నాయకత్వంలోనే ముందుకు సాగుతామని ఆయన స్పష్టం చేశారు. బిఆర్ఎస్ నలుగురు ఎంపీలు ఎవరు బిజెపిలోకి వెళ్లరని, ఇది మైండ్ గేమ్ పాలిటిక్స్ అని ఆయన తెలిపారు.

## తెలంగాణలో ఒక్కో ఎమ్మెల్యేకు కాంగ్రెస్ ఎంత ఆఫర్ చేస్తుందో?.. కెటిఆర్ ట్వీట్ వైరల్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జులై13:** ప్రస్తుతం రాష్ట్రంలోని బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఆ పార్టీన వీడుతున్న వేళ బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కెటిఆర్ ఎక్స్ వేదికగా ఆసక్తికర పోస్ట్ చేశారు. కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్య మీడియాలో చేసిన వ్యాఖ్యలను ప్రస్తావించారు. సిద్దరామయ్య వ్యాఖ్యల ప్రకారం ఒక్కో ఎమ్మెల్యేకు బిజెపి రూ.50 కోట్లు ఆఫర్ చేస్తోందని, తెలంగాణలో ఒక్కో ఎమ్మెల్యేకు కాంగ్రెస్ ఎంత ఆఫర్ చేస్తుందో అన్న ఆశ్చర్యం కలుగుతోందని కెటిఆర్ వ్యాఖ్యానించారు. మీరు ఎంత ధర నిర్ణయించారని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీని ఉద్దేశించి ప్రశ్నించారు. ఆర్ఆర్ ట్యాక్స్ వసూళ్ల మొత్తం ఆర్ఆర్ఆరన, కల్కి 2898ఏడీ కంటే ఎక్కువగా ఉంటుందా అని కెటిఆర్ అడిగారు. ప్రస్తుతం తెలంగాణలో బిఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి ఎమ్మెల్యేల చేరికల పర్వం కొనసాగుతున్నాయి. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌లోకి ఇప్పటి వరకు 9 మంది బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు చేరారు. మరోవైపు ఒకట్రెండు రోజుల్లో కూడా మరో ఐదారుగురు బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు కూడా కాంగ్రెస్‌లోకి చేరనున్నట్లు ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

## వారం - వర్జ్యం

తేది : 14-07-2024, ఆదివారం,
శ్రీ క్రోధి నామ సంవత్సరం,
ఆషాఢమాసం, ఉత్తరాయనం,
గ్రీష్మ ఋతువు, శుక్లపక్షం,
అష్టమి సా.5.26,
చిత్త రా.10.06,
వర్జ్యం తె.4.15-6.01
దు.సా.5.05-5.57
రాహుకాలం - సా.4.30-6.00

## వార్తాఫలం

**మేషం:** పరిచయాలు పెరుగుతాయి. ప్రముఖుల నుండి ఆహ్వానాలు అందుకొంటారు.

**వృషభం:** కొత్తవ్యక్తులు పరిచయమై నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు.

**మిథునం:** మిత్రులతో ఏర్పడిన విభేదాలు పరిష్కారమవుతాయి. ఆకస్మిక ప్రయానాలు లాభిస్తాయి.

**కర్కాటకం :** ఆకస్మిక ప్రయాణాలలో నూతన మిత్రుల పరిచయాలు. ఉద్యోగాలలో ప్రోత్సాహం.

**సింహం:** కార్య జయం పొందుతారు. బంధువులను కలిసి ఆనందంగా గడుపుతారు.

**కన్య :** నూతనోత్సాహంతో ముందుకు సాగుతారు. ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుంది.

**తుల :** బంధువులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకొంటారు. గృహనిర్మాణ ఆలోచనలు నిదానంగా సాగుతాయి.

**వృశ్చికం:** మిత్రుల నుండి ఒత్తిడులు పెరిగిన అధిగమిస్తారు. దూర ప్రయాణాలు లాభిస్తాయి.

**ధనుస్సు:** సన్నిహితుల నుండి శుభవార్తలు వింటారు. ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుంది.

**మకరం:** కుటుంబ సభ్యులలో ఏర్పడిన వివాదాలు పరిష్కరించు కొంటారు. గృహనిర్మాణ ఆలోచనలలో తొందరపాటు వద్దు.

**కుంభం:** కుటుంబంలో శుభకార్యాల ప్రస్తావన వుంటుంది. ఆర్థిక పరిస్థితి అభివృద్ధి సాధిస్తారు.

**మీనం :** వ్యవహారాలలో ఆటంకాలు ఎదురైన మిత్రుల సాయం అందుతుంది.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# భారత్ నం.1

>> వేసారు. అదేవృద్ధిని కొనసాగిస్తే భారత్‌లో అల్పాదాయ, మధ్యతరగతి వర్గాలు మరింతగా ఎదిగి భారత్ అభివృద్ధి చెందిన దేశంగా మారేందుకు దోహదం చేస్తుందన్నారు. భారత్ కొనుగోలు సామర్థ్యం ఒపెక్ అంచనాలప్రకారంచూస్తే అమెరికాను సైతం 2048 నాటికి అధిగమి స్తుందని పాత్రా అన్నారు. ఆర్బీఐ ద్రవ్యోల్బణం కూడా 4.1శాతంగానే నమోదవుతుందని అంచనా వేసిన అంశాన్ని ఆయన గుర్తుచేసారు. ప్రస్తుత ఆర్థికసంవత్సరంలో 4.5శాతం ఉన్న ద్రవ్యోల్బణం 2025-26 నాటికి 4.1శాతానికి తగ్గుతుందని దీనివల్ల అధిక వృద్ధికి ఆస్కారం కలుగుతుందని డిప్యూటీ గవర్నర్ పేర్కొన్నారు. అలాగే బ్యాంకింగ్ వ్యవస్థలోని స్థూల నిరర్థక ఆస్తులు కూడా తగ్గాయన్నారు. మొత్తం ఆస్తుల్లో ఈ ఏడాది 2024 నాటికి 2.8శాతంగా ఉన్నాయనినికర ఎన్‌పిఎలు కూడా మొత్తం ఆస్తుల్లో కేవలం 0.6శాతం మాత్రమేనని అన్నారు. ఆర్బీఐ నిబంధనలకు అనుగుణంగానే దేశంలో ద్రవ్యనిల్వలు న్నాయని ఆర్బీఐ డిప్యూటీ గవర్నర్ వెల్లడించారు.

## ప్రజల నుంచి నేరుగా వినతులు స్వీకరించిన సిఎం చంద్రబాబు

అమరావతి, జులై 13, ప్రభాతవార్త ప్రతినిధి: టిడిపి కేంద్ర కార్యాలయంలో వందల మంది నుంచి సిఎం చంద్రబాబు నాయుడు వినతులు స్వీకరించారు. ప్రతి శనివారం పార్టీ కార్యాలయానికి వెళుతున్న సిఎం శనివారం ఉదయం పార్టీ కార్యాలయానికి చేరుకుని తన కోసం వేచి ఉన్న ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ముందుగా గేటు వద్ద రాజమండ్రి నుంచి వచ్చిన దివ్యాంగుల నుంచి వినతి పత్రాలు తీసుకున్నారు. అనంతరం మీడియా రూంలో ప్రజలను, కార్యకర్తలను, వివిధ సమస్యలపై వచ్చిన వారిని కలిశారు. ఆరోగ్య సమస్యలు, భూవివాదాలు, వ్యక్తిగత సమస్యలపై ప్రజలు సిఎంకు విన్నవించారు. కార్యకర్తలు, నేతలు నామినేటెడ పదవుల్లో తమకు అవకాశం ఇవ్వాలని సిఎం చంద్రబాబును కోరారు. నాడు తెలుగుదేశం ప్రభుత్వంలో పనిచేసిన బీమా మిత్రలు తమను మళ్లీ విధుల్లోకి తీసుకోవాలని కోరారు. విజయవాడకు చెందిన షేక్ ఆసిన్, మహ్మద్ ఇంతియాజ్ రాజధాని అమరావతి కోసం రూ.లక్ష విరాళంగా అందించారు. ఫర్నిచర్ షాపు నడుపుతున్న వీరు రూ.లక్ష విరాళం ఇవ్వటాన్ని సిఎం చంద్రబాబు అభినందించారు.

THE GOVERNMENT OF BODOLAND
Results of 13/07/2024
M.R.P. ₹.10/-
DrawDate on:13/07/24

NAGARAJA SERIES Dr No:2
1st Prize Rs.5000/- ND 935036
2nd Prize Rs.1000000/- 127450
3rd Prize Rs.7000/- 30862
4th Prize Rs.3500/-
29809 30308 37180 52974 57729
58534 69253 72141 74932 96799
5th Prize Rs.200/-
0067 0122 2871 3372 3916
4734 5398 6319 8361 9984
6th Prize Rs.100/-
1350 3798 5198 6110 6232
6534 7267 7758 8520 9956
7th Prize Rs.50/-
048 197 279 334 443
503 668 724 854 914
8st Prize Rs.100000/- 935036
9st Prize Rs. 50000/- 35036
10st Prize Rs. 30000/- 5036
11st Prize Rs. 1000/- 036
12st Prize Rs. 100/- 36
13st Prize Rs. 10/- 6

SINGAM SERIES Dr No:2
1st Prize Rs.5000/- SN 464335
2nd Prize Rs.1000000/- 763293
3rd Prize Rs.7000/- 93412
4th Prize Rs.3500/-
02662 06020 12019 20866 31346
47310 57625 68121 73748 74534
5th Prize Rs.200/-
2078 2534 4615 5080 5839
6710 7469 7810 7821 7964
6th Prize Rs.100/-
0347 0873 2909 4504 4577
5267 5770 6460 7136 8073
7th Prize Rs.50/-
031 145 226 384 455
553 658 769 811 959
8st Prize Rs.100000/- 464335
9st Prize Rs. 50000/- 64335
10st Prize Rs. 30000/- 4335
11st Prize Rs. 1000/- 335
12st Prize Rs. 100/- 35
13st Prize Rs. 10/- 5

DrawDate on:13/07/24

KUIL SERIES Dr No:2
1st Prize Rs.5000/- KH 412201
2nd Prize Rs.1000000/- 215945
3rd Prize Rs.7000/- 28323
4th Prize Rs.3500/-
05231 13128 19202 20091 26295
28144 42629 50518 89818 98317
5th Prize Rs.200/-
0360 1306 3935 4128 5093
5713 7671 7983 8200 8280
6th Prize Rs.100/-
1007 1038 1280 5161 5228
5596 7155 7804 8611 8934
7th Prize Rs.50/-
024 180 260 324 416
555 628 749 841 902
8st Prize Rs.100000/- 412201
9st Prize Rs. 50000/- 12201
10st Prize Rs. 30000/- 2201
11st Prize Rs. 1000/- 201
12st Prize Rs. 100/- 01
13st Prize Rs. 10/- 1

ROSA SERIES Dr No:2
1st Prize Rs.5000/- TE 582698
2nd Prize Rs.1000000/- 328209
3rd Prize Rs.7000/- 94475
4th Prize Rs.3500/-
09111 13955 27312 30602 34152
43052 46312 63481 98005 98238
5th Prize Rs.200/-
0703 0936 0957 4049 4139
6782 7471 8152 9455 9632
6th Prize Rs.100/-
1542 2145 2702 2755 5068
5214 8061 8211 9162 9736
7th Prize Rs.50/-
084 105 239 383 421
572 680 715 835 917
8st Prize Rs.100000/- 582698
9st Prize Rs. 50000/- 82698
10st Prize Rs. 30000/- 2698
11st Prize Rs. 1000/- 698
12st Prize Rs. 100/- 98
13st Prize Rs. 10/- 8

DrawDate on:13/07/24

DEAR SERIES Dr No:2
1st Prize Rs.5000/- CG 790205
2nd Prize Rs.1000000/- 998239
3rd Prize Rs.7000/- 85298
4th Prize Rs.3500/-
10093 10129 14493 20653 25121
25600 26010 29176 36904 52441
5th Prize Rs.200/-
0242 0768 1063 1573 3554
3949 4051 5506 7431 9485
6th Prize Rs.100/-
1937 2179 3374 6153 6280
6327 6748 9273 9623 9743
7th Prize Rs.50/-
079 143 283 390 418
550 666 774 896 965
8st Prize Rs.100000/- 790205
9st Prize Rs. 50000/- 90205
10st Prize Rs. 30000/- 0205
11st Prize Rs. 1000/- 205
12st Prize Rs. 100/- 05
13st Prize Rs. 10/- 5

ABBLE SERIES Dr No:2
1st Prize Rs.5000/- LD 087395
2nd Prize Rs.1000000/- 443514
3rd Prize Rs.7000/- 41662
4th Prize Rs.3500/-
12971 30333 35935 40454 42692
45295 49417 69240 71940 73491
5th Prize Rs.200/-
0852 1207 3606 4908 5622
7256 7547 8931 9161 9768
6th Prize Rs.100/-
3754 4204 4415 4765 5150
5155 5652 7617 8650 9553
7th Prize Rs.50/-
097 112 243 300 447
585 623 721 849 959
8st Prize Rs.100000/- 087395
9st Prize Rs. 50000/- 87395
10st Prize Rs. 30000/- 7395
11st Prize Rs. 1000/- 395
12st Prize Rs. 100/- 95
13st Prize Rs. 10/- 5

THE GOVERNMENT OF BODOLAND
Results of 13/07/2024
M.R.P. ₹.2/-
DrawDate on:13/07/24

THANGAM SERIES Dr No:2
1st Prize Rs.100000/- 471154
2nd Prize Rs.7000/- 69078
3rd Prize Rs.3500/-
00973 16360 33066 38360 39721
63203 77089 80637 96754 99202
4th Prize Rs.200/-
0251 0487 1454 2737 2945
3213 4443 5120 6081 8691
5th Prize Rs.100/-
1888 2382 2727 2993 3154
4160 5900 6356 8639 8823
6th Prize Rs.50/-
026 189 254 371 417
500 643 725 805 967

NALLANERAM SERIES Dr No:2
1st Prize Rs.100000/- 886737
2nd Prize Rs.7000/- 78978
3rd Prize Rs.3500/-
00032 32112 36178 40328 58360
61128 62037 62281 77053 90616
4th Prize Rs.200/-
0000 0958 2623 5888 6019
8109 8634 8796 9216 9681
5th Prize Rs.100/-
1052 1067 2942 3382 4106
4388 6120 8209 8788 9481
6th Prize Rs.50/-
080 156 251 322 440
536 652 771 880 903

DrawDate on:13/07/24

KUMARAN SERIES Dr No:2
1st Prize Rs.100000/- 724743
2nd Prize Rs.7000/- 43252
3rd Prize Rs.3500/-
02012 08636 13612 28569 29861
33294 44308 56651 64487 71719
4th Prize Rs.200/-
0105 1239 3654 3680 3696
4201 5401 5924 6174 9986
5th Prize Rs.100/-
0720 1956 3031 3349 3879
4795 5877 6655 7520 8203
6th Prize Rs.50/-
065 106 221 322 419
501 679 768 871 912

VISHNU SERIES Dr No:2
1st Prize Rs.100000/- 132661
2nd Prize Rs.7000/- 54724
3rd Prize Rs.3500/-
11710 20059 39182 39441 70874
73925 74954 79697 82115 88585
4th Prize Rs.200/-
0050 0204 0373 1394 1825
2329 2471 4309 5680 6954
5th Prize Rs.100/-
0266 2516 3789 3862 4292
4719 5431 5580 7954 8914
6th Prize Rs.50/-
085 196 270 330 407
546 613 749 810 996

DrawDate on:13/07/24

SWARNALAXMI SERIES Dr No:2
1st Prize Rs.100000/- 153618
2nd Prize Rs.7000/- 31423
3rd Prize Rs.3500/-
18548 29360 31567 42517 53337
53927 64840 75700 86971 97463
4th Prize Rs.200/-
0054 0089 0617 1971 2259
4260 5732 6139 6392 9891
5th Prize Rs.100/-
0048 0381 3943 5540 5910
6467 7414 8884 9323 9851
6th Prize Rs.50/-
021 183 234 333 449
583 670 707 831 961

LION SERIES Dr No:2
1st Prize Rs.100000/- 952829
2nd Prize Rs.7000/- 28976
3rd Prize Rs.3500/-
17566 28676 39761 41233 52372
63317 63977 74780 85853 96979
4th Prize Rs.200/-
0166 0266 0733 3876 4461
4885 4908 5052 5301 6783
5th Prize Rs.100/-
1351 2018 2127 3660 4471
4925 6119 6190 8229 8963
6th Prize Rs.50/-
039 184 220 320 433
531 639 747 824 978



శనివారం జెఎన్‌టియులో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతున్న సిఎం రేవంత్

# డ్రగ్స్‌పై మహాసమరం

## పిల్లలకు మోరల్ పోలీసింగ్ నేర్పాలి

## మత్తుపదార్థాలు విద్యార్థుల దరికి రానివ్వొద్దు

## కుటుంబ వ్యవస్థ విచ్ఛిన్నం వల్లే పిల్లలు పక్కదారి

## జెఎన్‌టియు స్టూడెంట్ వలంటరీ పోలీసింగ్ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జులై 13:** సమాజంలో ఉండే సమస్యలను మనమే గుర్తించి పరిష్కరించుకుంటే దుష్ప లితాలను నివారించు కోవచ్చునని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. సమాజంలో పెడధోర ణులకు టెక్నాలజీ కూడా ఓ కారణంగా మారిందని, పిల్లలను మొబైల్ ఫోన్లకు దూరంగా ఉంచితే చాలా సమస్యలను నివారించ వచ్చునని పేర్కొన్నారు. జెఎన్‌టీయులో జరిగిన డ్రగ్స్ నియంత్రణ-మహిళ భద్రతలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల అనే కార్యక్రమంలో పాల్గొన్న సిఎం... స్టూడెంట్ వాలంటరీ పోలీసింగ్ లోగోను ఆవిష్కరించారు. కుటుంబ వ్యవస్థ విచ్ఛిన్నం కావడం వల్లే పిల్లలు పక్కదారి పడుతున్నారని సిఎం రేవంత్ పేరొనకన్నారు. చిన్నారుల మానసిక దృఢత్వానికి ఉమ్మడి కుటుంబం తోడ్పడు తుందని, పిల్లలను మానసికంగా సంసిద్ధం చేయాల్సిన అవసరం ఉందని, విద్యార్థులందరూ మన పిల్లలే అనేలా చూసుకోవాలని కోరారు. ఏది మంచో ఏది చేడో వారికి చెప్పాల్సిన బాధ్యత మనదేనని గుర్తు చేశారు. డ్రగ్స్ వల్ల యువత నిర్వీర్యం అవుతోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. తల్లిదండ్రులు పిల్లలకు సమయం కేటాయిం చాలని కోరారు. పిల్లలకు మోరల్ పోలీసింగ్ నేర్పించాలని స్కూళ్ళ, కళాశాలల యజమానులకు చెప్పామని తెలిపారు. పిల్లలకు సోషల్ పోలీసింగ్, కమ్యూనిటీ పోలీసింగ్ నేర్పించాల్సిన అవసరం ఉందన్నారు. డ్రగ్స్ నిర్మూలనపై సీరియస్‌గా దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. స్కూల్స్, కాలేజేస్‌లో సబ్జెక్ట్ నేర్పించడమే కాదు... మోరల్ పోలీసింగ్ కూడా నేర్పించాలన్నారు. పిల్లల ప్రవర్తనలో మార్పులు గమనించే వ్యవస్థ ఉండాలని నిర్వాహకులకు సూచించారు. స్కూళ్ళు, కాలేజీల్లో ఎన్ఎస్ఎస్ వాలంటీర్స్ అవసరం ఎంతో ఉందన్నారు. యూనిఫాం లేని పోలీసులు ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు అని మోరల్ పోలీసింగ్ చేయాల్సిన బాధ్యత వారిదేనని వ్యాఖ్యానించారు. డ్రగ్స్‌పై యుద్ధం ప్రకటించామని ఈ యుద్ధంలో ఎన్ఎస్ఎస్ కూడా కలిసి రావాలని ఆయన పిలుపునిచ్చారు. పోలీసులకు సమాచారం చేరవేసేలా వ్యవస్థను తయారు చేసుకుంటే రాష్ట్రాన్ని డ్రగ్స్ రహిత రాష్ట్రంగా మార్చవచ్చునన్నారు. డ్రగ్స్ నియంత్రణకు ప్రభుత్వం తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరోను ఏర్పాటు చేసిందన్నారు. మీ అన్నగా పిలుపునిస్తున్నా డ్రగ్స్ నిర్మూలనకు సహకరించండి పిలుపునిచ్చారు. తెలంగాణ పోరాటంలో కీలకంగా ఉన్నది విద్యార్థులేనని అలాంటి వారే డ్రగ్స్‌కు బానిసైతే సమాజం ఏమ్వాలని ఏమవ్వాలని ఆందోళన వ్యక్తం చేశారు. ఉద్యమాల గడ్డ తెలంగాణను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దాలి పిలుపునిచ్చారు. అన్ని ఇంటర్, డిగ్రీ కాలేజీల్లో కేరళ మాదిరిగా మోరల్ పోలీసింగ్ సిస్టం ఏర్పాటు చేయాలని పోలీస్ అధికారులకు ఆదేశాలు ఇస్తున్నానన్నారు. మోరల్ పోలీసింగ్‌తో అన్ని రకాల సమస్యలను పరిష్కరించవచ్చునన్నారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహించాలని నిర్ణయించిందన్నారు. ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గంలో ఒక స్టేడియం ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తోందన్నారు. భవిష్యత్‌లో క్రీడాకారులను ప్రోత్సహించే విధంగా ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటుందన్నారు. ప్రజాప్రతినిధి అనేది అత్యంత పవిత్రమైన బాధ్యత అన్నారు. ప్రజా సమస్యలపై ఫోకస్‌గా పనిచేయడం వల్లే నేను ఈ స్థాయికి చేరానన్నారు. సమస్యలకు భయపడి పారిపోవద్దు, నిలబడి సమస్యలపై పోరాడాలన్నారు. జీవితంలో ఫోకస్‌గా పనిచేయండి, లక్ష్యాలను సాధిస్తారన్నారు. నరేంద్రమోడికైనా, బిల్‌గేట్స్‌కైనా, రేవంత్‌రెడ్డికైనా రోజుకు 24 గంటలేనన్నారు. రోజుకు 16 గంటలు మీరు ఎంత ఫోకస్‌గా పనిచేస్తారో అది మీ లక్ష్యాన్ని అంత చేరువ చేస్తుందన్నారు. మన జీవితం మన చేతుల్లోనే ఉంది, మన జీవితాన్ని ఎలా డిజైన్ చేసుకోవాలో మన చేతుల్లోనే ఉంటుందన్నారు. గొప్ప వ్యక్తులు ఎవరూ గొప్ప కుటుంబాల నుంచి రాలేదన్నారు. ఎవరూ ఎవరికంటే తక్కువ కాదన్నారు. ఆ కార్యక్రమంలో మంత్రి శ్రీధర్‌బాబు, డిజిపి జితేందర్, జెఎన్‌టియు ఇన్‌చార్జీ వీసీ బుర్రా వెంకటేశం, హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ పోలీస్ కమిషనర్లు శ్రీనివాస్‌రెడ్డి, అవినాష్ మహంతి, సుధీర్‌బాబు పాల్గొన్నారు.

# వలస బాటలో 'గూడెం'

## నేడో, రేపో కాంగ్రెస్‌లోకి ఖాయం



ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

**పటాన్‌చెరు, జులై 13, ప్రభాతవార్త:** పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి పార్టీ మారనున్నట్లు రాజకీయ వర్గాల్లో విస్తృతంగా ప్రచారం జరుగుతుంది. బిఆర్ఎస్ నుంచి మూడోసారి ఎమ్మెల్యేగా కొనసాగుతున్న ఆయన పార్టీని విడనున్నట్లు తెలుస్తుంది. కాంగ్రెస్‌లో లేదా బిజెపిలో చేరతారనే చర్చలు గట్టిగా కొనసాగుతున్నాయి. పార్టీలో చేరడానికే ఆయన ఢిల్లీ వెళ్లారని గతంలో మీడియాలో పెద్దఎత్తున ప్రచారం జరిగింది. అయితే తన వ్యక్తిగత పనిమిద ఢిల్లీకి వెళ్లానని ఆయన వివరణ ఇచ్చుకున్నప్పటికి రాజకీయంగా ప్రచారం మాత్రం ఆగడంలేదు. అక్రమ మైనింగ్ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం తనిఖీలు, ఆస్తుల విషయంలో కేంద్రలోని ఈడీ దాడులతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే ఆయన పార్టీ మారే అవకశాలు ఉన్నట్లు ప్రచారం జరుగుతుంది. ఐతే ఇప్పటికి వరకు పలువురు ఎమ్మెల్యేలు బీఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఇప్పుడు గూడెం నేడో, రేపో కాంగ్రెస్ పార్టీలో పార్టీలో చేరనున్నట్లు జోరుగా వినిపిస్తుంది. గత కొంత కాలంగా బిజెపి పార్టీలో చేరుతారని వార్తలు వచ్చినప్పటికి బిజెపి పార్టీలో చేరాలంటే రాజీనామచేసి రావాలనే నిబంధనలు ఉండటంతో అందుకు సాహసించని గూడెం మహిపాల్‌రెడ్డి జిల్లా మంత్రి దామోదర రాజనర్సింహ సహకారంతో హస్తం గూటికి చేరనున్నట్లు సమాచారం.

# ఒడిశా బస్సు దుర్ఘటనపై కేంద్రమంత్రి సంజయ్ ఆరా

## గాయపడిన వారికి మెరుగైన చికిత్సఅందించాలి: హోంశాఖ

**హైదరాబాద్, జులై 13, ప్రభాతవార్త:** ఒడిశాలో జరిగిన బస్సు దుర్ఘటన పట్ల కేంద్రహోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బండి సంజయ్ ఆదేశాల మేరకు ఢిల్లీలోని హోంమంత్రిత్వ శాఖ కార్యాలయం ప్రమాద ఘటన, గాయపడిన ప్రయాణీకుల పరిస్థితిపై మాయూర్ బంజ్ జిల్లా మెజిస్ట్రేట్‌తో పాటు సిడిఎంఓ, ఆసుపత్రి సూపరింటెండెంట్‌తో పాటు మెడికల్ కాలేజీ అధికారులతో ఆరా తీసింది. ఈ ఘటనలో ముగ్గురు మరణించగా ఆరుగురు తీవ్రంగా గాయపడగా, మరో 14 మందికి గాయాలపాలు అయ్యారని ఆసుపత్రి అధికారులు వెల్లడించారు. ప్రమాదంలో మరణించిన వారి మృత దేహాలను తక్షణమే వారి స్వస్థలాలకు తరలించాలని, గాయపడిన వారికి మెరుగైన చికిత్స అందించాలని ఈ సందర్భంగా మంత్రిత్వశాఖ కార్యాలయం కోరింది.

# ఈసారి అసెంబ్లీకి కెసిఆర్ వస్తారు

## పార్టీలు మారుతున్న వాళ్లను చూసి బాధపడాల్సిన పనిలేదు

## మాజీ ఎంపి బోయినపల్లి వినోద్‌కుమార్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జులై 13:** బిఆర్ఎస్‌లో గెలిచి వేరే పార్టీలో చేరుతున్న వాళ్లను చూసి బాధపడాల్సిన పనిలేదని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. వాళ్లు ఇప్పుడు అభివృద్ధి కోసమే బిఆర్ఎస్‌లో చేరుతున్నామని చెప్పారని, ఇప్పుడు కూడా అదే చెప్పి పార్టీ మారుతున్నారని విమర్శించారు. పార్టీలు మారే ఎమ్మెల్యేలపై ప్రజలు ఆగ్రహంగా ఉన్నారని చెప్పుకొచ్చారు. వాళ్లు తిరిగి వస్తామంటే ప్రజలు రానివ్వరని స్పష్టం చేశారు. శనివారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. త్వరలోనే పార్టీ సమావేశాలు పెట్టుకుంటామని, కొత్తతరం నేతలకు కెసిఆర్ ప్రోత్సహిస్తారని చెప్పారు. కెసిఆర్ అసెంబ్లీకి వస్తారని... రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో బిఆర్ఎస్ చురుకైన పాత్ర పోషిస్తుందని, ఈసారి కేంద్రంలో బిజెపికి సొంతంగా మెజారిటీ రాలేదని, టిడిపి, జెడీయు తదితర పార్టీల మద్దతుతోనే కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిందని తెలిపారు. ఏపీ విభజన చట్టంలో ఉన్న అంశాలపై ఇటీవల చంద్రబాబు ఢిల్లీ వెళ్లినప్పుడు ప్రధాని మోడీతో మాట్లాడారని చెప్పారు. ఆ తర్వాత విభజన చట్టం షెడ్యూల్ 13లో ఉన్న పెట్రో, కెమికల్, ఆయిల్ రిఫైనరీ హబ్ ఏపీకి ఇస్తున్నట్లుగా వార్తలు వచ్చాయని అన్నారు. ఇదే షెడ్యూల్ 13లో తెలంగాణకు కాజీపేటలో రైల్వేకోచ్ ఫ్యాక్టరీ, బయ్యారంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలని ఉందని తెలిపారు. పదేళ్లుగా అడుగుతున్నా తెలంగాణకు ఏమీ ఇవ్వడం లేదని అసహనం వ్యక్తం చేశారు. ఏపీలో పెట్రో కెమికల్స్, రూ.65వేల కోట్ల విలువ చేసే ఆయిల్ ఫైనరీ ఏర్పాటుకు కేంద్రం హామీ ఇచ్చిందని, దానికి తాము వ్యతిరేకం కాదని, మాకు రావాల్సినవి కేంద్రం ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నిస్తున్నామన్నారు. చంద్రబాబుపై కేంద్రం ఆధారపడింది కాబట్టే ఏపీకి పెట్రో, కెమికల్ హబ్ ఇస్తున్నారని, ఇక్కడ తెలంగాణపై ఆధారపడలేదు కాబట్టి ఏమీ ఇవ్వడం లేదా అని ప్రశ్నించారు. కోచ్ ఫ్యాక్టరీ కోసం వరంగల్ ప్రజలు 40 ఏళ్లుగా కొట్లాడుతున్నారని, ఎందుకు ఇవ్వడం లేదో చెప్పాలన్నారు. ఏపీలో ప్రాంతీయ పార్టీ గెలిచింది కాబట్టే చంద్రబాబు అడిగినవ్నీ ఇస్తున్నారని అన్నారు. తెలంగాణలో 8 ఎంపీలను గెలిపించినా బిజెపి తెలంగాణ ప్రజలకు మొండి చేయి చూపిస్తోందని విమర్శించారు. తెలంగాణకు కేంద్రం ఐటిఐఆర్ ఇవ్వలేదని, కెసిఆర్ కొత్తగా ఏర్పాటు చేస్తే ఒక్క నవోదయ విద్యాలయం కూడా ఇవ్వలేదని ఆయన విమర్శించారు. ఎన్నికల తర్వాత బిజెపి రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో రాజకీయాల గురించి తప్ప రాష్ట్ర అభివృద్ధిపై ఒక్క చర్చ లేదని అన్నారు.



మంత్రి తుమ్మల నాగేశ్వరరావును సన్మానిస్తున్న దృశ్యం

# ఖమ్మంకు బ్రాండ్ ఇమేజ్ ఉండేలా నగర అభివృద్ధి జరగాలి

## ఆదాయం పెంపునకు ప్రణాళిక చర్యలు చేపట్టాలి

## ఖమ్మం నగర అభివృద్ధిపై మంత్రి తుమ్మల సమీక్ష

**కార్పొరేషన్, జులై 13, ప్రభాతవార్త:** ఖమ్మం బ్రాండ్ ఇమేజ్ ఉండేలా నగర సమగ్ర అభివృద్ధి జరగాలని రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్, సహకార, చేనేత జౌళిశాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. శనివారం మంత్రి ఖమ్మం నగరపాలక సంస్థ సమావేశ మందిరంలో నగర అభివృద్ధిపై కార్పొరేటర్లు, అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఖమ్మంనగరం, అందంగా పరిశుభ్రంగా, అందరికి అమోదయోగ్యంగా ఉండాలన్నారు. విద్య, వైద్యం, ప్రశాంతత ఉంటుందని అన్ని వర్గాలకు భరోసా కలగాలన్నారు. నగరానికి అండర్ గ్రౌండ్ డ్రైనేజి సాధిస్తానన్నారు. నగరంలో మంచి గాలి, సురక్షిత తాగునీరు, మంచి రోడ్లు, మంచి వాతావరణం కల్పించాలన్నారు. వర్షాకాలం కనుక శానిటేషన్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. రోడ్లు, విధులు పరిశుభ్రంగా వుండేలా చర్యలు తీసుకోవాలని, డ్రయినేజ్‌లు ఎక్కడా బ్లాక్ కాకుండా, నీరు నిల్వకుండా ఉండేలా చూడాలన్నారు. వాహనాలు ఖమ్మం నగరంలోకి రాకుండా హైదరాబాద్ తరహాలో అమరావతి - దేవరాంపల్లి రోడ్ నిర్మాణం చేపడతామన్నారు. రోడ్లన్నింటికి సర్వీస్ రోడ్ల ఏర్పాటు చేస్తామన్నారు. అసెంబ్లీ తర్వాత ముఖ్యమంత్రితో సమావేశం ఏర్పాటు చేసి నగర అభివృద్ధికి చేయాల్సిన పనులకు కార్యరూపం తెస్తానన్నారు. జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ మాట్లాడుతూ నగర అభివృద్ధికి ప్రగతి ప్రణాళిక చేయాలన్నారు. ఆదాయం పెంపునకు ప్రణాళికబద్ధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఆస్తి, వాణిజ్య, నీటి పన్నుల వసూలు వందశాతం జరగాలన్నారు. ఖమ్మం నగర పాలక సంస్థ కమీషనర్ అభిషేక్ అగస్త్య మాట్లాడుతూ శానిటేషన్ ప్రణాళిక చేసినట్లు వార్డుల వారిగా కార్పొరేటర్లకు అందజేయనున్నట్లు తెలిపారు. ఏబిసి కేంద్రం ద్వారా త్వరలో కుక్కల జనాభా నియంత్రణకు చర్యలు తీసుకుంటామని అన్నారు. జేసిబి, ట్రాక్టర్ పరికరాల మరమ్మత్తులు చేపట్టి, పూర్తి స్థాయిలో వినియోగంలోకి తెస్తామన్నారు.

# ఉచిత చేపపిల్లల పథకానికి నోటిఫికేషన్

**హైదరాబాద్, జులై 13, ప్రభాతవార్త:** తెలంగాణలో ఉచిత చేపపిల్లల పథకానికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా 26 వేల నీటి వనరుల్లో 86 కోట్ల చేప పిల్లలు, 10 కోట్ల రొయ్య పిల్లలను వేయాలని నిర్ణయించింది. ఇందుకు గాను ప్రస్తుత 2024-25 ఆర్థిక సంవత్సరంలో దాదాపు 114 కోట్ల రూపాయల మేర ఖర్చవుతుందని అంచనా వేసి ఆ మేరకు అధికారులు ప్రతిపాదనలు రూపొందించారు. ఈ మేరకు దీనికి సంబంధిచి మత్స్య శాఖ తాజాగా టెండరు నోటిఫికేషన్ జారీ చేసింది. టెండరు డాక్యుమెంట్ డౌన్‌లోడ్ చేసునేందుకు ఈ నెల 20వ తేదీ మధ్యాహ్నం వరకూ గడువు ఇచ్చింది. దీనికి సంబంధించి మత్స్య శాఖ డైరక్టరు కార్యాలయంలో ప్రీబిడ్డింగ్ సమావేశానిన అధికారులు నిర్వహిం చారు. టెండరు బిడ్లను దాఖలు చేసేందుకు ఈ నెల 15వ తేదీ ఉదయం 11 గంటల నుండి 23వ తేదీ మధ్యాహ్నం 3 గంటల వరకూ అవకాశం కల్పించారు. ఈ గడువు ముగిసిన వెంటనే అరగంటలో బిడ్డింగ్‌లు తెరుస్తారు. చేపపిల్లల టెండర్లనుఈ ప్రొక్యూర్‌మెంట్ కింద నిర్వహించనున్నారు. ఈ టెండర్ల నిర్వహణ జిల్లాల వారీగా కలెక్టర్ల ఆధ్వర్యంలో జరగనుంది.

# హైస్కూళ్లలో ప్రహారీ క్లబ్‌ల ఏర్పాటు

## విద్యార్థులను, స్కూల్స్‌ను డ్రగ్స్ నుంచి రక్షించడానికి కమిటీలు

## స్కూల్ హెడ్మాస్టర్, ప్రిన్సిపాల్ నేతృత్వంలో కమిటీ ఏర్పాటు

**హైదరాబాద్, జులై 13, ప్రభాతవార్త:** రాష్ట్రంలో డ్రగ్స్ నిర్మూలనకి కఠినమైన చర్యలు తీసుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులను డ్రగ్స్‌కి దూరంగా ఉండేలా చూడటానికి చర్యలు తీసుకుంటుంది. ఇందుకు సంబంధించి రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు హైస్కూల్స్‌లో డ్రగ్స్ నివారణ కోసం ప్రహారీ క్లబ్స్ పేరుతో కమిటీలను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. పాఠశాలల్లో డ్రగ్స్ వినియోగంతోపాటు.. పాఠశాల పరిసర ప్రాంతాల్లో డ్రగ్స్ విక్రయాలు జరగకుండా ఉండేలా చేయడానికి ఈ ప్రహారీ క్లబ్స్ పేరుతో కమిటీలను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఇందుకు సంబంధించిన జీవో ఎంఎస్ నంబర్ 20ని విద్యా శాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం శుక్రవారం జారీ చేశారు. ప్రహారీ క్లబ్‌లోని సభ్యులు పాఠశాలలోని విద్యార్థులు ఎవరూ కూడా డ్రగ్స్ జోలికి వెళ్లకుండా చూడాలని.. అలాగే పాఠశాల పరిసర ప్రాంతాల్లో డ్రగ్స్ అమ్మకాలు జరగకుండా చూడాలని ఉత్తర్వులో పేర్కొంది. దాంతోపాటు డ్రగ్స్ మూలంగా ట్రాఫికింగ్ జరగకుండా చూసేలా ప్రహారీ క్లబ్ కమిటీలు వ్యవహరించనున్నాయి. పాఠశాలకి చెందిన హెడ్మాస్టర్ లేదా ప్రిన్సిపాల్ అధ్యక్షుడిగా ప్రహారీ క్లబ్స్‌ను రాష్ట్రంలోని 6 నుంచి 10వ తరగతి వరకు ఉన్న ప్రతి హైస్కూల్‌లోనూ ఏర్పాటు చేయనున్నారు. స్కూల్ హెడ్మాస్టర్, ప్రిన్సిపల్ అధ్యక్షుడిగా కొనసాగుతుండగా.. వైస్ ప్రెసిడెంట్‌గా పాఠశాలకి చెందిన సీనియర్ టీచర్ లేదా విద్యార్థులతో ఫ్రెండ్లీగా ఉండే టీచర్ కొనసాగుతారు.

# పెన్షన్ డబ్బు తిరిగి ఇవ్వాలంటూ వృద్ధురాలికి ప్రభుత్వం నోటీసు

## ఇదే రివర్స్ పాలన అంటే: ఘాటుగా స్పందించిన కెటిఆర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జులై 13:** ఆసరా పెన్షన్‌దారులకు రేవంత్‌రెడ్డి సర్కార్ నోటీసులు ఇవ్వడంపై బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీమంత్రి కల్వకుంట్ల తారక రామారావు సీరియస్ అయ్యారు. కొత్తగూడెం జిల్లాలో ఆసరా పెన్షన్లపై ఇటీవల సర్వే నిర్వహించగా దాసరి మల్లమ్మ(80) అనే వృద్ధురాలు ఆసరా పెన్షన్‌కి అనర్హురాలు అని... ఇప్పటి వరకు ఆమె తీసుకున్న రూ.1,72,928 తిరిగి ప్రభుత్వానికి 7 రోజుల లోగా చెల్లించాలని ఆమెకు నోటీసు ఇచ్చారు. అయితే... ఈ వివాదంపై కెటిఆర్ ఎక్స్ ద్వారా స్పందించారు. రేవంత్ సర్కార్ వింత చేష్టలు మొదలు పెట్టిందని ఆగ్రహించారు. కొత్త పథకాలు ఇస్తామని గతంలో దొంగ హామీలు ఇచ్చారని మండిపడ్డారు. ఇప్పుడు లబ్దిదారుల సొమ్ము వెనక్కి అడుగుతున్నారని ఆగ్రహించారు. ఇదే రివర్స్ పాలన అంటే ఇదే అంటూ మండిపడ్డారు. పెన్షన్ తిరిగి ఇవ్వాలని వృద్ధురాలికి నోటీసులిచ్చారని ఫైర్ అయ్యారు. అడిగితే సాంకేతిక కారణాల వంక చూపిస్తున్నారని నిప్పులు చెరిగారు. కొండ నాలుకకు మందేస్తే ఉన్న నాలుక ఊడినట్టుందన్నారు. పేదలపై దుర్మార్గపు చర్యలు మానుకోవాలని కోరారు. లేకపోతే ప్రజలే కాంగ్రెస్ సర్కార్‌పై తిరగబడతారని హెచ్చరించారు.

# ఒకరికి ఒకే పెన్షన్

## రెండు పెన్షన్లు పొందుతున్న 1,826 మందికి నోటీసులు ఇచ్చాం : మంత్రి సీతక్క

## దాసరి మల్లమ్మకు రెండు పెన్షన్‌లు ..



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జులై 13:** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం పింఛన్లు అందుకున్న వారికి నోటీసులు ఇచ్చి వారి నుంచి పింఛన్ డబ్బులు రికవరీ నోటీసులు ఇచ్చినట్లు వార్తలు వచ్చాయి. ఈ వార్తలపై పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క స్పందించారు. దాసరి మల్లమ్మకు వృద్ధాప్య పెన్షనన తిరిగి ఇవ్వాలని పంపిన నోటీసులపై మంత్రి వివరణ ఇచ్చారు. దాసరి మల్లమ్మ కుమార్తె రాజేశ్వరి వైద్య ఆరోగ్య శాఖలో ఏఎన్ఎంగా పనిచేస్తూ... ఇటీవల మృతి చెందారు. దీంతో ఫ్యామిలి పెన్షన్ కింద దాసరి మల్లమ్మకు రూ.24,073 పెన్షన్ అందుతోందని మంత్రి పేర్కొన్నారు. మల్లమ్మ ఇద్దరు కుమారుల్లో ఒకరు ప్రభుత్వ ఉద్యోగం చేస్తుండగా, మరొకరు ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నారన్నారు. కుమారుడితో పాటు సొంత పక్కా ఇంట్లో మల్లమ్మ నివసిస్తుందని, అలాగే, 2014 నుంచి ఆసరా వృద్ధాప్య పెన్షన్ కూడా ఆమె తీసుకుంటుంది. రూల్స్ ప్రకారం ఒకే వ్యక్తి రెండు పెన్షన్లు తీసుకోవడం నిబంధనలు అంగీకరించవని మంత్రి సీతక్క తెలిపారు. అక్రమంగా పెన్షన్లు పొందుతున్న వారిని గుర్తించి వారికి నోటీసులు ఇస్తున్నామనియ పేర్కొన్నారు. ఈ క్రమంలోనే రాష్ట్ర వ్యాప్తంగా వృద్ధాప్య, ఫ్యామిలి పెన్షన్లను 1,826 మంది పొందుతున్నట్లు ట్రెజరీ శాఖ ఈ మధ్యనే గుర్తించి వారందరికీ రికవరీ నోటీసులు పంపింది. 2 పెన్షన్ పొందుతున్నట్లు గుర్తించిన వారికి నోటీసులు జారీ చేశామని ఇందులో భాగంగా దాసరి మల్లమ్మకు నోటీసులు వెళ్లాయని మంత్రి సీతక్క తెలిపారు. వాస్తవాలు ఈ రకంగా ఉంటే ప్రభుత్వం మీద బురద జల్లడమే పనిగా పెట్టుకున్న కొందరు ప్రభుత్వానికి దురుద్దేశాలను ఆపాదిస్తూ తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని మంత్రి పేర్కొన్నారు. ఎందరో అర్హులకు పెన్షన్లు అందించకుండా గత ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని ఒక పంట కూడా సరిగా పండని అడవిలో కొండలు, గుట్టలతో కూడిన పోడు భూమి 5 ఎకరాలకు మించి ఉందన్న కారణం చూపి ఇచ్చిన పెన్షన్లను గత ప్రభుత్వం రద్దు చేసిందని సీతక్క తెలిపారు. ఆటోలు, కార్లు నడపుకునే బతికే కుటుంబాలకు రేషన్ కార్డుతో పాటు పెన్షన్లకు కోతలు పెట్టిందని, కానీ తమ ప్రభుత్వం మానవీయ కోణంలో ఆలోచిస్తోందని మంత్రి తెలిపారు. అర్హులందరికీ పెన్సన్ అందడమే తమ ప్రభుత్వ లక్ష్యమని, ప్రతి పైసా అర్హులకే దక్కాలన్నది తమ ప్రభుత్వ సంకల్పం అని పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో జరిగిన పొరపాట్లను సరిదిద్దుతూ సంక్షేమ ఫలాలు అర్హులకు, అవసరం ఉన్నవాళ్లకే దక్కేలా ప్రజల నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకుంటూ మానవీయ కోణంలో పాలన సాగిస్తున్నామని చెప్పారు. దాసరి మల్లమ్మ విషయంలో రెండు రకాల పెన్షన్లు ఇచ్చేందుకు ప్రభుత్వ నిబంధనలు అంగీకరించవన్న విషయాన్ని గుర్తెరిగి వ్యవహరించాలని కోరుతున్నామని మంత్రి సీతక్క తెలిపారు.

# ఎస్సీ గురుకులాల ఆహార, శానిటేషన్ మహిళా సంఘాలకు కాంట్రాక్ట్


## గురుకుల విద్యాలయాల సొసైటీ కార్యదర్శి వర్షిణి

**హైదరాబాద్, జులై 13, ప్రభాతవార్త:** తెలంగాణలోని సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో ఆహారం, శానిటేషన్‌కు సంబంధించిన కాంట్రాక్ట్‌లను మహిళా సంఘాలకు ఇవ్వాలని ఎస్సీ గురుకుల విద్యాలయాల సొసైటీ నిర్ణయం తీసుకున్నట్లు ఆసంస్థ కార్యాదర్శి అలుగు వర్షిణి తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటనలో ఇందుకు అనుగుణంగా చర్యలు చేపట్టినట్లు చెప్పారు. మహిళా గ్రూపులు ఏవైనా తమను సంప్రదిస్తే వాటి పనులను అప్పగిస్తామని వివరించారు. గురుకుగల్లో మెనూ అమలు కాపోయినా, ఇతర సమస్యలు ఉన్నా పిల్లలు నేరుగా రాష్ట్ర అధికారులకు ఫిర్యాదు చేసేలా ప్రత్యేక ఫోన్ సదుపాయాన్ని కల్పిస్తున్నామని చెప్పారు. ప్రస్తుత వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని గురుకులాల్లో శానిటేషన్ కార్యక్రమాలను చేపట్టినట్లు వెల్లడించారు. ఇందు కోసం ప్రత్యేకించి శానిటేషన్ రెస్క్యూ ఫోర్స్ టీమ్‌లను ఏర్పాటు చేశామన్నారు. పనులకు సంబంధించిన బిల్లులను కూడా గ్రీన్ ఛానల్ ద్వారా చెల్లిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇక పాఠశాలలు, ఇంటర్ కాలేజీల్లో సీటు పొందిన వారు వేరే ప్రాంతాలకు బదిలీ అయ్యేందుకు ఆన్‌లైన్లో ఫీజు చెల్లిస్తే మెరిట్ ప్రకారం బదిలీ చేస్తామన్నారు. కాగా ఎస్సీ గురుకుల పరిధిలో ఎంబిఎ కాలేజీ కూడా రాబోతున్నట్లు తెలియచేశారు. ఇక ప్రపంచ స్థాయి చెస్ పోటీలకు భారత్ నుండి మొత్తం 9 మంది ఎంపిక కాగా, అందులో ఎస్సీ గరుకులాలకు చెందిన 4గురు ఎంపికయ్యారని వెల్లడించారు.

# కార్ల బ్లాక్ ఫిలింలు, స్టిక్కర్ల తొలగింపుపై పోలీసుల స్పెషల్ డ్రైవ్

## ఈసారైనా ఈ ప్రక్రియ పూర్తయ్యేనా?

## కార్పొరేటర్లు మొదలుకొని సెలబ్రటీల వరకు బ్లాక్ ఫిలింలున్న వాహనాలను వాడుతున్న వైనం



**హైదరాబాద్, జులై 13, ప్రభాతవార్త:** గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో కార్లకు ఉన్న బ్లాక్ ఫిలింలను తొలగించేందుకు పోలీసు శాఖ మరోమారు స్పెషల్ డ్రైవ్ చేబట్టింది. బ్లాక్ ఫిలింలతోపాటు ఇతరత్రా స్టిక్కర్లను తొలగించడమనేది చాలాకాలంగా జరుగుతున్నా వాహనదారులు పట్టించుకోవడం లేదు. ఇలాంటి వాహనాల వల్ల ఏదైనా ప్రమాదం లేదా నేరం జరిగినపుడు హడావిడి పడడం, ఆ తరువాత కొన్నిరోజులపాటు వీటి తొలగింపు కోసం డ్రైవ్‌లు నిర్వహించడం పోలీసులకు పరిపాటిగా మారిందనే విమర్శలు వున్నాయి. రెండేళ్ల క్రితం జూబ్లీహిల్స్‌లో అప్పటి టిఆర్ఎస్ ఎంఎల్ఎ షకీల్ తనయుడు రాహిల్ నడిపిన కారు కారణంగా జరిగిన ప్రమాదం తీవ్రవర్చకు దారితీసి చివరకు ట్రైకమిషనరేట్లలో కార్లకు వున్న బ్లాక్ ఫిలింలను తొలగించేందుకు పోలీసు శాఖ ఆదేశాలు జారీ చేసేవరకు వెళ్లింది. ఈ నెల ఎనిమిదవ తేదీ నుంచి పోలీసులు మళ్లీ వీటి తొలగింపునకు స్పెషల్ డ్రైవ్ చేబట్టడడం గమనార్హం. హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్ల పరిధుల్లో కార్లకు వున్న బ్లాక్ ఫిలింలు, స్టిక్కర్లు, ద్విచక్ర వాహనాలకు వున్న స్టిక్కర్ల తొలగింపు విషయంలో పోలీసుల స్పెషల్ డ్రైవ్ నిరం తరంగా కొనసాగాల్సిన అవసరం వుంది. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం దేశవ్యాప్తంగా ఎక్కడా ఎవరూ బ్లాక్ ఫిలింలు కార్ల అద్దాలకు వాడరాదు. కేవలం జడ్, జడ్ ప్లస్ సెక్యూరిటీ వున్న ప్రముఖుల వాహనాలకే ఈ వెసులుబాటు వుంది. జమ్మూకాశ్మీర్‌లో 2000 దశకంలో ఉగ్రవాదులు బ్లాక్ ఫిలింలు వున్న కార్లతో అరాచకాలు చేయడంతో దీనిపై కఠినంగా వ్యవహరించాలని సుప్రీం కోర్టు కేంద్రానికి ఆదేశాలు జారీ చేసింది. అప్పటి నుంచి ఈ ఆదేశాలు అమల్లో వున్నా ఆచ రణలో మాత్రం ఎక్కడా అమల వడం లేదనే చెప్పాలి. రాష్ట్రం వరకు వస్తే ఈ నిబంధన అప్పుడప్పుడు అమలవుతోందని చెప్పాలి. 2022 మార్చి నెలలో జూబ్లీహిల్స్‌లో నాటి బోధన్ ఎంఎల్ఎ షకీల్ తనయుడు రాహిల్ కారులో వుండగా చోటుచేసుకున్న ప్రమాదం ఎంతటి దుమారం రేపిందో తెలిసిందే. ఆ తరువాత నాలుగైదు రోజులు పోలీసులు హడావిడిచేసి పెద్ద సంఖ్యలో కార్లకు వున్న బ్లాక్ ఫిలింలను, స్టిక్కర్లను, ద్విచక్ర వాహనాలకు వున్న స్టిక్కర్లను తొలగించి సదరు వాహనదారులకు జరిమానాలు విధించారు.

### ట్రై కమిషనరేట్లలో వేల సంఖ్యలో బ్లాక్ ఫిలింలు, స్టిక్కర్లలో దర్జాగా తిరుగుతున్న వాహనాలు

ఇక బ్లాక్ ఫిలింలు, స్టిక్కర్లు వున్న వాహనాల విషయానికి వస్తే ట్రైకమిషనరేట్లలో నిత్యం వేలసంఖ్యలో ఇవి దర్జాగా తిరుగుతూనే వున్నాయి. ట్రాఫిక్ పోలీసులు చౌరస్తాలలో సిగ్నల్ పడిన సందర్భాల్లో ఇవి కనిపిస్తే అపుడప్పుడూ తొలగిస్తుండడం తప్పించి, వీటిపై నిరంతర స్పెషల్ డ్రైవ్ నిర్వహించడం లేదు. ఇదే సమయంలో వీటిని తొలగించకుంటే భారీ జరిమానాలు విధిస్తామని చెప్పినా, ఇది అమలవడం లేదు. బ్లాక్ ఫిలింలు కలిగిన కార్లు ఎక్కువగా ఎంఎల్ఎలు, ఎంపిలు, ప్రజాప్రతిని ధులు, సెలబ్రటీలు, కార్పొరేటర్లు, వారి బంధుగణానికి సంబంధించినవే కావడం గమనార్హం. నిబంధనల ప్రకారం వీటిని వెంటనే తొలగించాలని పోలీసులు ఆదేశాలు జారీచేసినా ఈ ఆదేశాలను 90 శాతం మంది వాహనదారులు పాటించడం లేదని నగర రహదారులపై బ్లాక్ ఫిలింలు, స్టిక్కర్లతో తిరుగుతున్న వాహనాలు చెబుతు న్నాయి. ఇక ప్రస్తుత విషయానికి వస్తే జంట నగరాలలో ఈ నెల ఎనిమిదవ తేదీ నుంచి వాహనాలకు వున్న బ్లాక్ ఫిలింలను తొలగించేందుకు ట్రాఫిక్ పోలీసులు స్పెషల్ డ్రైవ్ చేబట్టారు. ఇప్పటి వరకు వెయ్యికిపైగా కేసులు నమోదయ్యాయి. ఈ సంఖ్య మరింత పెరిగే వీలుంది.

సెంట్రల్ కౌన్సిల్ ఫర రీసెర్చ్ ఇన్ హోమియోపతి
(భారత ప్రభుత్వ ఆయుష్ మంత్రిత్వ శాఖ యొక్క స్వతంత్ర ప్రతిపత్తి గల సంస్థ)
జవహర్‌లాల్ నెహ్రూ భారతీయ చికిత్స మరియు హోమియోపతి అనుసంధాన్ భవన్
61-65, ఇన్‌స్టిట్యూషనల్ ఏరియా, D-బ్లాక్ ఎదురుగా, జనక్‌పురి, న్యూఢిల్లీ-110058

Advt. No.: 102/2024-25 తేది: 12.07.2024

కాంట్రాక్ట్ ప్రాతిపదికన రీసెర్చ్ ఫెలోల నియామకం

JSPS, G.H.M.C. కాలేజీ హైదరాబాద్ వద్ద క్రింది రీసెర్చ్ ఫెలోల నియామకానికి సెంట్రల్ కౌన్సిల్ ఫర్ రీసెర్చ్ ఇన్ హోమియోపతి, న్యూఢిల్లీ భావిస్తోంది. క్రింద పేర్కొన్న తేదీలలో పరీక్ష/ వాక్-ఇన్-ఇంటర్వ్యూ ద్వారా పూర్తి కాంట్రాక్ట్ ప్రాతిపదికన.

| క్ర.సం | ఉద్యోగం పేరు | ఉద్యోగం సంఖ్య(లు) | ఇంటర్వ్యూ తేదీ |
|---|---|---|---|
| 1. | రీసెర్చ్ అసోసియేట్ (మైక్రో-బయోలజీ/ బయో-టెక్నాలజీ/లైఫ్ సైన్సెస్) | 01 | 09.08.2024 |
| 2. | సీనియర్ రీసెర్చ్ ఫెలో (హోమియో) | 02 | 08.08.2024 |
| 3. | జూనియర్ రీసెర్చ్ ఫెలో (మైక్రో-బయోలజీ/ బయో-టెక్నాలజీ/లైఫ్ సైన్సెస్) | 02 | 10.08.2024 |

పోస్టింగ్ ప్రదేశం, అవసరమైన అర్హతలు, అనుభవం, వేతనం మొదలైన వాటి గురించిన వివరాలు కౌన్సిల్ వెబ్‌సైట్ www.ccrhindia.nic.in లో అందుబాటులో ఉన్నాయి.

అసిస్టెంట్ డైరెక్టర్ (అడ్మిన్.)

సహజంగానే కలియుగప్రత్యక్షదైవమ్ తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి విఐపి బ్రేక్ దర్శనాలు, ఆర్జితసేవలకు సంబంధించి అధికారంలో ఉన్న ప్రభుత్వాల మంత్రులు, ఎంపిలు, ఎంఎల్సిలు, ప్రజాప్రతినిధులు, రాజ్యాంగపరిధిలోని ప్రముఖులు తమవారికి, అనుచరులకుసిఫార్సు లేఖలు జారీ చేస్తారు. ఈ సిఫార్సు లేఖలపై స్వయంగా మంత్రులు, ఎమ్మెల్యేలు వచ్చిన సమయంలో ఆరు మందినుండి పదిమంది వరకు వారికుటుంబసభ్యులు, బంధువులు, అనుచరులను అనుమతిస్తుంటారు. అయితే గత ప్రభుత్వ హయాంలో ఇందుకు భిన్నంగా మంత్రులు తమతోబాటు ఇరవై, ముప్పయి మందివరకు తీసుకువచ్చి విఐపి బ్రేక్ దర్శనాలు చేయించిన సందర్భాలు ఉన్నాయి. గత వైసిపి ప్రభుత్వంలో మంత్రులు దర్శన టిక్కెట్ల చిట్టాను ఇప్పటికే విజిలెన్స్ అధికారులకు టిటిడి అందించింది. వీటిపై విచారణ జరిపి, అక్రమాలపై నిగ్గుతేల్చేపనిలో నిమగ్నమయ్యారు. మాజీమంత్రులపై దర్శనాల టిక్కెట్ల అమ్మకాల ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఏకంగా ఉమ్మడిచిత్తూరుజిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులు తిరుమలను రాజకీయాలకు వాడుకున్నారని జనసేన నేతల ప్రధాన ఆరోపణలు. ఇందుకు సంబంధించి ఆధారాలు కూడా ప్రభుత్వ విజిలెన్స్ అధికారులకుటిటిడి అధికారులు అందించారు. ఇలాఅన్ని అక్రమాలపై విజిలెన్స్ అధికారుల బృందం సమగ్ర విచారణ చేపట్టే దిశగా అడుగులు వేస్తోంది. టిటిడి ధర్మకర్తల మండలి సభ్యులకు 35 టిక్కెట్లుపైగానే కేటాయించారనే ఆరోపణలు ఉన్నాయి. విఐపి బ్రేక్‌దర్శనాలతోబాటుసుపథం టిక్కెట్లు పై కూడా ప్రభుత్వ విజిలెన్స్ అధికారులు ఫోకస్ పెట్టారు. కొందరు ప్రముఖులకు కోటాతో సంబంధం లేకుండా దర్శన టిక్కెట్లు జారీఅయినట్లు అదనపు ఇఒ, తిరుమలజెఇఒ ఇద్దరు ముఖ్య అధికారులు వెల్లడించినట్లు తెలుస్తోంది. దేవుని ముందు తప్పుచేసిన, అక్రమాలకు పాల్పడిన వారికి శిక్ష తప్పదనే వ్యాఖ్యలు విజిలెన్స్ అధికారుల నోటినుండే వెలువడటం కొసమెరుపు.

# టిటిడిలో అవినీతి ఆరోపణలపై విజి 'లెన్స్'!

**పి.పద్మనాభమ్**

ప్రపంచ ప్రసిద్దిగాంచిన హిందూ ధార్మికసంస్థ తిరుమల తిరుపతి దేవస్థానమ్ చరిత్రలో ఇదివరకు ఎప్పుడూ జరగని రీతిలో 2019-2024 ఐదుసంవత్సరాల మధ్య కాలంలో దర్శనాల అవినీతి, టిటిడి టెండర్లు, శ్రీవాణి ట్రస్ట్ నిధులు వినియోగం, నిధులు ప్రైవేటు బ్యాంకులకు మళ్ళింపు, ప్రసాదాల తయారీకి నియోగించే ముడిసరుకుల కొనుగోళ్లలో అక్రమాలు, ఇంజినీరింగ్ పనుల్లో అక్రమాల ఆరోపణలపై ప్రభుత్వ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్ మెంట్ అధికారులు విచారణ సంచలనంగా మారింది. టిటిడిలో ఐదేళ్ళుగా ఇష్టారాజ్య నిర్ణయాలపై ప్రభుత్వ విజిలెన్స్ విచారణ పెద్ద దుమారం రేపుతోంది. ఇంజనీరింగ్ పనులకు కోట్ల రూపాయలు భారీగా నిధులు కేటాయించడంపై, దర్శనాల పేరుతో వసూళ్లు, అడ్డగోలు నియామకాలు తదితర 14అంశాలపై జరిగినఅవినీతి అక్రమాల ఆరోపణలపై కూపీలాగి మరింత లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. గత పదిరోజులుగా తిరుమల తిరుపతి దేవస్థానమ్‌కు సంబంధించిన తిరుమలలోని అదనపు ఇఒ కార్యాలయం, తిరుపతిలోని పరిపాలన భవనంలోని ఇంజనీరింగ్ విభాగాలు, ఐటి ఇడిపి కార్యాలయాలు, శ్రీవాణి ట్రస్ట్‌కు చెందిన విభాగంపై విజిలెన్స్ ఎన్‌ఫోర్స్ మెంట్ ఎస్పీ కరీముల్లా షరీఫ్ నేతృత్వంలో విజయవాడ, రాజమండ్రి, గుంటూరు, నెల్లూరు, కడప జిల్లాల నుండి వచ్చిన 30మంది వరకు విజిలెన్స్ డిఎస్పీలు, సిఐలు, ఎస్ఐలు బృందాలు లోతుగా విచారణ చేపట్టారు. ఇప్పటికే పలు రికార్డులను ఇంజినీరింగ్ విభాగంనుండి స్వాధీనం చేసుకున్నారు. కీలక అధికారులను ప్రశ్నించి వివరాలు సేకరించారు. ఇంకా మరో వారంరోజుల వరకు ఈ దర్యాప్తు కొనసాగే సూచనలు కనిపిస్తున్నాయి. గత ఐదేళ్లలో టిటిడిలో జరిగిన అక్రమాలపై లోతైన దర్యాప్తు చేపట్టాలని రాష్ట్రప్రభుత్వం ఆదేశించింది. అక్రమాలపై రాష్ట్రప్రభుత్వం విజిలెన్స్ ఎన్‌ఫోర్స్ మెంట్ విచారణకు ఆదేశించడంతో, రెండు దఫాలుగా టిటిడిలోని అన్నివిభాగాలపై సోదాలు చేసిన విజిలెన్స్ అధికారులకు కీలకఅంశాలు వెలుగుచూడటంతో ప్రకంపనలు మొదలయ్యాయి. శ్రీవారి భక్తులు తమ మొక్కుబడుల రూపంలో దేవుని హుండీకి సమర్పించుకుంటున్న నగలు, నగదు కానుకలతో భక్తుల సంక్షేమానికి, సౌకర్యాలకు వెచ్చించాల్సిన నిధులను పక్కదారి పట్టించి భారీగా ముడుపులు దండుకున్నారనే ఆరోపణలపై విజిలెన్స్ ఎన్‌ఫోర్స్ మెంట్ తనిఖీలు చేపట్టింది. ప్రధానంగా టిటిడిలోని అన్ని విభాగాల్లో అవినీతి ఎక్కడ జరిగింది అనే దానిపై దృష్టిసారించారు. గతంలో శ్రీవాణి ట్రస్ట్ నిధులు, టిక్కెట్ల వ్యవహారంపై జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ తీవ్ర ఆరోపణలు చేసిన విషయం



విదితమే. శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనం టిక్కెట్ల కేటాయింపుతోబాటు శ్రీవాణి ట్రస్ట్‌లో అక్రమాలపై ఫిర్యాదులు ప్రభుత్వానికి అందడంతో ఆ ఆధారంగానే శ్రీవాణిట్రస్ట్ విరాళాల వినియోగంపై ప్రభుత్వ విజిలెన్స్ తనిఖీలు చేశారు. గతంలో ఎన్నడూ జరగని విధంగా టిటిడివార్షిక బడ్జెట్‌తో సమానంగా గత2023 నవంబర్, డిసెంబర్ మధ్య కాలంతోబాటు 2024 జనవరి, ఫిబ్రవరి, మార్చినాలుగైదు నెలల కాలంలో దాదాపు 1,500 కోట్ల రూపాయలు నిధులు ఇంజనీరింగ్ విభాగానికి కేటాయించడం మరోసంచలన విషయం. నాలుగునెలల్లోనే బడ్జెట్‌తో సంబంధంలేకుండా సివిల్ కాంట్రాక్టు పనులుఇచ్చారని, వేలకోట్లరూపాయలు ఇంజినీరింగ్ పనులకు ధర్మకర్తల మండలి కేటాయించిన ఈ అంశంపై, ఈ పనుల్లో అవినీతి జరిగిందనే ఆధారాలతో విజిలెన్స్ అధికారులు వివరాలు సేకరించి రికార్డులు స్వాధీనం చేసుకోవడం మరింత చర్చనీయాంశంగా మారింది. ఇదే సమయంలో టిటిడిలో గత ధర్మకర్తలమండలి ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి, మాజీ ఇఒ ఏవి ధర్మారెడ్డి అవినీతి అక్రమాలపై విచారణ చేపట్టాలని కూటమి నేతలు ఇటీవల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. గత ఐదేళ్ళలో వైసిపికి లబ్ధిచేకూర్చేందుకు మాజీ ఇఒ ధర్మరెడ్డి, మాజీ ఛైర్మన్ కరుణాకర్‌రెడ్డి అక్రమాలకు తెగబడ్డారని, సంప్రదాయాలకు విరుద్ధంగా నడుచుకున్నారని వారిపై సిబిసిఐడి, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్ మెంట్ విభాగంతో విచారణజరిపి అక్రమాలను వెలికితీయాలని కోరారు. సహజంగా టిటిడిలో 2కోట్ల రూపాయలవరకు ఇంజినీరింగ్ పనులకు సంబంధించి అధికారులు చేసిన ప్రతిపాదనలపై ఆమోదం తెలిపి నిధులు విడుదలచేసే అర్హత టిటిడి ఇఒకుఉంది. ఆ పైనిధులు కేటాయింపు జరగాలన్నా టిటిడి బోర్డులో ప్రతిపాదించి ఆమోదించిన తరువాత నిధులు విడుదల చేస్తారు. శ్రీవాణిట్రస్ట్ ద్వారాగతఐదేళ్ళలో టిటిడికి అందిన ప్రతిపాదనలు, వాటిలో ఎన్ని ఆమోదించారు. ఎక్కడెక్కడ ఆలయాలు నిర్మించారు, ఏఏ ఆలయాలకు దూపదీపనైవేద్యాలకు నెలకు5వేల రూపాయలు చెల్లిస్తున్నారు అనేఆధారాలు సేకరించారు. శ్రీవాణి ట్రస్ట్ టిటిడిలో భాగస్వామ్యం కాకున్నా ప్రత్యేకంగా ట్రస్ట్‌ను ఏర్పాటుచేసుకుని నిధులు రాబట్టడంపై కూడా విజిలెన్స్ ఉన్నతాధికారులు దృష్టిపెట్టారు. శ్రీవాణి ట్రస్ట్ బ్రేక్‌దర్శనం పేరుతో విరాళాలరూపంలో వసూలుచేసిన 10వేల రూపాయలు లెక్కన దాదాపు రూ. 2వేలకోట్లకు పైగా ఆదాయం సమకూరినట్లు రికార్డులు ఉన్నప్పటికీ, ఈ నిధులను ఎక్కడ ఎలావిడు దలచేసి, మంజూరు చేశారనేది ఇప్పుడు తేలాల్సిన వాస్తవాలు. శ్రీవాణి ట్రస్ట్ ద్వారా తెలుగురాష్ట్రాల్లో నేగాక దేశవ్యాప్తంగా సమరస సేవా ఫౌండేషన్ సహకారంతో 2,273నూతన ఆలయాలు నిర్మాణానికి నిధులు కేటాయించారు. 176పురాతన ఆలయాలు పునరుద్దరణ చేపట్టారు. 150 ఆలయాలకు నెలకు రూ.5వేల లెక్కన దూపదీపనైవేద్యాలకు నిధులు కేటాయిస్తున్నారు. ఈ ఆలయాలు ఎక్కడెక్కడ ఉన్నాయి, ఏ ప్రాతిపదికన నిధులు మంజూరు చేశారనేది ఇప్పుడు విజిలెన్స్ విచారణలో వెల్లడికానుంది. 2019 అక్టోబర్‌లో ప్రారంభమైన శ్రీవాణి ట్రస్ట్‌కు తొలి ఏడాదిలో 26.25 కోట్లు రూపాయలు ఆదాయం చేకూరింది. 2020వ సంవత్సరానికి 70.21కోట్లు, 2021లో 176కోట్లు, 2022లో 282.64కోట్లు, 2023లో రూ.వెయ్యికోట్లు విరాళాలందాయి. 2024లో గత ఐదునెలల్లో మరో రూ.550కోట్ల వరకు ఆదాయం చేకూరినట్లు తెలుస్తోంది. ఈ నిధులపై ఇప్పుడువిజిలెన్స్ రికార్డుల ను స్వాధీనం చేసుకుని విచారణచేపట్టింది. తిరుమల తిరుపతి దేవస్థానమ్‌లోచేసే ప్రతి చిన్నపని కూడా టిటిడి ఇఒ దృష్టికి వెళ్ళి, ఆయన అంగీకారంతోనే నిధులు వెచ్చించడం అనాదిగా వస్తున్న ఆనవాయితీ. ఇందుకు సంబంధించి టిటిడి ట్రస్ట్‌లకు, పథకాలకు దాతలు ఇచ్చే విరాళాలుగానీ, పలు రకాలుగా స్థలాలు ఇచ్చినా అవన్నీకూడా టిటిడి ఇఒ, తిరుపతి పేరున అందించడం జరుగుతుంది. టిటిడిలో ఏచిన్నపనిచేయాలన్నా టెండర్ పిలిచేందుకు కూడా ఇఒ అనుమతి తప్పనిసరి. గతంలో 100కోట్ల నుండి రూ.150కోట్ల వరకు ఉండే ఇంజినీరింగ్ కేటాయింపులు ఈబడ్జెట్‌లో ఏకంగా రూ. 350కోట్లు పెంచడం దుమారం రేకెత్తిస్తోంది. ఇంజినీరింగ్ విభాగంలో గత ఐదు సంవత్సరాలుగా "రివర్స్ టెండరింగ్" పేరుతో చేపట్టిన పనులు నిధులు కేటాయింపుల్లో వాటాలు, కోట్లాదిరూపాయల పనులను కొందరికే అప్పగించడంపై ఆంతర్యం? లబ్ధి పొందిన కాంట్రాక్టర్‌కు, టిటిడి ఇంజినీరింగ్ విభాగం ఉన్నతాధికారులకు, ధర్మకర్తలమండలి పెద్దలకు ఆర్థిక లావాదేవీలు జరిగాయనే కోణంలో విజిలెన్స్ అధికారులు రికార్డులు స్వాధీనం చేసుకున్నారు. టిటిడిలో ఎఫ్ఎసిఎఒ, మాజీ ఇఒ, ఆయన అనుచరుల వ్యక్తిగత ల్యాప్‌టాప్‌లు, డిలీటైన డాటాను రికవరీచేసే ప్రయత్నాలు సాగిస్తున్నారు. అలిపిరివద్ద నూతనంగా మార్కెటింగ్ గోడౌన్‌ల నిర్మాణానికిరూ.11.05కోట్ల టెండర్లు ఆమోదించడం, రేణిగుంటరోడ్డులో 80అడుగుల రోడ్డు విస్తరణకు రూ.15.12కోట్లుమంజూరు, నారాయణాద్రి ఆస్పత్రి కూడలి నుండి తిరుచానూరు హైవేరోడ్డువరకు నాలుగులేన్ల రోడ్డు విస్తరణకు 13.29కోట్లతో టెండర్లు ఆమోదం, పుదిపట్ల నుండి వకుళమాత ఆలయం వరకు జాతీయ రహదారికి నాలుగు లేన్ల రోడ్డుకు 21.10కోట్లతో టెండర్లు ఆమోదం, స్విమ్స్‌లో నూతన కార్డియో న్యూరోబ్లాక్ నిర్మాణానికి74.24 కోట్లతో టెండర్లు ఆమోదం, స్విమ్స్ ఆస్పత్రికి దశల వారీగా రూ. 197కోట్ల అనుమతికి ఆమోదం తెలపడం వంటివి ప్రధానంగా విజిలెన్స్ దృష్టిపెట్టినట్లు తెలుస్తోంది. ●

---

బీహార్

# వంతెన 'మాయ'!

**ఎ.వి.వి ప్రసాద్**

ఒకటి.. రెండు..మూడు.. పది.. పదమూడు ఇవి సాధారణ అంకెలు కావు. కూలిన వంతెనలు. బీహార్‌లో గత మూడు వారాల్లోను వంతెనల బీభత్సం పరాకాష్టకు చేరుకుంది. ప్రాణనష్టం పెద్దగా లేకపోయినా, వంతెనకూలడమంటే భారీఆర్థిక నష్టమే. ఇన్ని వంతెనలు ఎలా కూలు తున్నాయన్నదే దేశంలో అందరి సందేహం. ఎక్కడైనా, ఎప్పుడైనా ఓ వంతెన కూలితేనే ఎంతో ఆశ్చర్యం కలుగుతుంది. ఎంతో బాధ్యతగా చేసే నిర్మాణం అది. ముఖ్యంగా నదులపై నిర్మించే వంతెనలు మరింత జాగ్రత్తగా, మరింత బాధ్యతతో చేయవలసి ఉంటుంది. కానీ బీహార్‌లో ఎప్పుడూ లేని విధంగా వరుసగా బ్రిడ్జిలు కూలిపోతున్నాయి. నితీశ్‌కుమార్ ప్రభుత్వం దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తోంది గాని, జరుగుతున్న నష్టాన్ని నివారించలేకపోతోంది. ఒక్క సరన్ జిల్లాలలోనే కేవలం 24 గంటల్లో మూడు వంతెనలు కుప్పకూలాయంటే పరిస్థితి ఎంత ఆందోళనకరంగా ఉన్నదో అర్థమవుతుంది. జులై మూడవ తేదీన ఒక్కరోజులో మూడువంతెనలు కూలిపోవడం వార్త విని దేశ ప్రజలంతా కూడా దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. అసలు బీహార్‌లో ఏం జరుగుతోందనే ప్రశ్న అందరి నుండి వినిపించింది. అప్పటికే రెండు వారాలలో తొమ్మిదివంతెనలు ఒక దాని తర్వాత మరొకటి కూలిపోయాయి. రాష్ట్రంలో భారీగా కురుస్తున్న వర్షాలవల్ల వంతెనలు కూలిపోతున్నాయని అధికారులు చెబుతున్నమాట కంటి తుడుపునకు పనికి వస్తుందిగాని వాస్తవం కాదని అర్థమవుతూనే ఉంది. సరన్ జిల్లాలో కూలడానికి ముందు జనతా బజార్, లహ్లాద్‌పూర్ ఏరియాల్లో రెండు వంతెనలు పడిపోయాయి. ఈ జిల్లాలో కొన్ని రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నమాట నిజమే అయినావంతెనలు కూలిపోయేంత భారీకాదు. మధుబని, అరారియా, తూర్పు చంపారణ్, కిషన్ గంజ్ జిల్లాల్లో కూడా పది వంతెనలు కూలిపోయాయి. రాష్ట్రంలోని అన్ని పాతబ్రిడ్జిల పరిస్థితిపై ప్రభుత్వం సమీక్షకు ఆదేశించింది కానీ అదిచేతులు కాలాక ఆకులుపట్టుకోవడం వంటిదే. ఇంజినీర్ల పర్యవేక్షణ లోపం, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతోనే వారధులు కూలుతున్నాయనేది సుస్పష్టం. గండకీ నదిపై ఆరువంతెనలు ఒకదాని తర్వాత ఒకటి కూలిపోతుంటే అది ఏదోసాధారణ విషయమే అన్నట్లుగా ప్రభుత్వం వ్యవహరించడం నిజంగా విడ్డూరమే. వంతెనలు చాలా పాతకాలానివి, అందుకే కూలిపోయాయంటూ బీహార్ అదనపు ప్రధానకార్యదర్శి చైతన్య ప్రసాద్ చేసిన వ్యాఖ్యమరింత ఆశ్చర్యం కలిగించింది. వాటిలో కొన్ని30యేళ్ల క్రితం నిర్మించినవే. అంటే కాలదోషం పట్టిన వంతెనలేమీ కావు. 80యేళ్లక్రితం నిర్మించినవి మూడు వంతెనలున్నాయి. వాటి పునాదులు క్షీణించడం వల్ల కూలిపోయాయంటే అర్థం ఉంది. కానీ30యేళ్లకే వంతెనలు కూలడం చాలా ఆందోళనకర విషయం. సరన్ జిల్లా లో కూలిన వంతెనల



కూలిన వంతెన

వల్ల దాదాపు 150 గ్రామాలకు లింకులు తెగిపోయాయి. రవాణా పూర్తిగా స్తంభించిపోయింది. ఈ వంతెనలు పునర్నిర్మించడానికి మళ్లీ కొంతకాలం పడుతుంది. ఈలోగా అక్కడి ప్రజలు ఒక గ్రామం నుంచి మరో గ్రామానికి వెళ్లలేక నానా అవస్థలు పడవలసివస్తుంది. ముఖ్యంగా సరకురవాణా స్తంభించిపోయి తీవ్ర ఆర్థికనష్టం కూడా వాటిల్లుతుంది. తొమ్మిదిసార్లు ముఖ్యమంత్రి పదవిని అధిష్టించిన, నిర్మాణ ఇంజనీర్ అయిన నితీశ్‌కుమార్‌కు వంతెనల నష్ట ఎందుకు స్ఫూర్తించలేదో అర్థంకాని విషయం. నదులుఉధృ తంగా ప్రవహిస్తుండడంతో ఇటువంటి ముప్పు మరింతవాటిల్లే అవకాశంకూడా ఉంది. ఇప్పటికే నిర్మాణం పూర్తయిన, నిర్మాణంలో ఉన్న బ్రిడ్జిలు ఎక్కడెక్కడ ఉన్నాయి. వాటి పరిస్థితి ఏమిటి?అనే విషయం ఇప్పటికైనా అంచనా వేయవలసిన అవసరంఉంది. బీహార్ ఇంజినీరింగ్ సర్వీసెస్ అసోసియేషన్ కూడా వంతెనలనష్టం గురించి స్పష్టమైన అంచనాలు చెప్పలేకపోవడం మరింత ఆశ్చర్యం కలిగించే విషయం. నాలుగు వంతెనలు కూలిన తర్వాత కళ్లు తెరిచిన అసోసియేషన్ అటువంటి కూలిపోయే దశలోఉన్న బ్రిడ్జిల గురించిసర్వే జరుపుతున్నట్లు ప్రకటించింది. ప్రభుత్వం తక్షణమే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. అయితే ఇటువంటి ఘటనలు జరిగినప్పుడు సంబంధిత వ్యక్తులు, సంస్థలు ఏవో ప్రకటనలు చేయడం గాక నిర్దిష్టమైన ప్రణాళిక ఏం రూపొందిస్తున్నారో ప్రజలకు తెలియచేయవలసి ఉంది. ప్రతి నిర్మాణానికి ఒక తుదిగడువు ఉంటుందన్నదినిజమే అయినా, అది స్పష్టంగా తెలియకపోవడంవల్ల ఇటువంటి ముప్పు ఏర్పడుతున్నట్లుగా అర్థమవుతున్నది. ముఖ్యంగా వంతెనల వంటి కీలక కట్టడాలు ఉన్నచోట అవి ఎప్పుడు నిర్మించాలో శిలాఫలకంపై ఉంటుంది గాని, దాని 'జీవితకాలం' ఎంతో తెలిసే సూచికలేవీ ఉండవు. 'ఎక్స్‌పైరీ డేట్' తప్పనిసరిగాఉంటే తప్పఆ బ్రిడ్జి ఎంతకాలం సరిగా పనిచేస్తుందో తెలియదు. బ్రిడ్జిలపై వాటి జీవితకాలం తెలిపే సంఖ్యలు వేయడం ఇప్పటికైనా చాలా అవసరమని గుర్తించాలి. బ్రిడ్జిలు కూలిపోవడం అప్పుడప్పుడు అక్కడక్కడ వినిపించేదే అయినా బీహార్‌లోని పరిస్థితి మాత్రం ఎక్కడా ఉండదనే చెప్పాలి. కొన్ని బ్రిడ్జిలు 'ఐకానిక్'గా నిర్మిస్తూంటారు. శతాబ్దాల చరిత్రకూడా వాటికి ఉంటూంటుంది. కోల్‌కతాలోని హౌరా బ్రిడ్జి వంటి నిర్మాణాలు అటువంటివే. 1977-2017 మధ్యమనదేశంలోనే దాదాపురెండువేల బ్రిడ్జిలు కూలిపోయినట్లు గణాంకాలు చెబుతున్నాయి. అయితే వాటిలో నదులపై కూలిపోయినవి తక్కువే. చాలా పాతబ్రిడ్జిలు పటిష్టంగాఉంటే, కొన్ని కొత్తబ్రిడ్జిలు కూలిపోతున్నాయి. అంటే లోపంనిర్మాణ ప్రక్రియలోనే ఉన్నదనే విషయం స్పష్టమవుతుంది. ఇంజనీరింగ్ నిపుణులు చెబుతున్న ప్రకారం బ్రిడ్జి డిజైన్‌లో లోపాలవల్లే కూలిపోతున్నాయనీ, నాణ్యత కలిగిన సిమెంటు కాంక్రీటు ఉపయోగించకపోవడం వల్ల ఆబ్రిడ్జిలు జీవితకాలంముందుగానే పూర్తవుతున్నదనీ తెలుస్తోంది. దీనిపై సమగ్ర దర్యాప్తు జరిపితేనే ఆ 13బ్రిడ్జిలుఎందుకు కూలిపోయాయో తెలుస్తుంది. బీహార్‌లో వరదలకు గురయ్యే ప్రాంతం 73 శాతం ఉన్నందున ఆలస్యం చేయకుండా మొత్తం బ్రిడ్జిల సర్వేజరిపించవలసిన అవసరం ఉంది. ఎన్ని బ్రిడ్జిల జీవితంకాలం ఎంత?వాటిలో ఎన్ని బ్రిడ్జిలు 'ఎక్స్‌పైరీ డేట్' ఇప్పటికే పూర్తయిందనే విషయంపై ప్రభుత్వం ఒక శ్వేతపత్రం విడుదల చేస్తేఇంకా మంచిది. రాష్ట్రంలో పరిస్థితి ఎంతగా క్షీణించిందో అందరికి అర్థమవుతుంది. ●

---

ఫ్రాన్స్

# ఎన్నికల్లో మాక్రాన్‌కు ఎదురుగాలి..

**గన్ని మోహన్**

పార్లమెంటును రద్దుచేసి ముందస్తు ఎన్నికలకు వెళ్లిన ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్‌కు చేదు అనుభవం ఎదురయింది. 577 స్థానాలున్న పార్లమెంటు దిగువసభకు జరిగిన ఎన్నికల్లో మాక్రాన్ పార్టీ లా రిపబ్లికన్ ఎన్ మార్చే ఊహించని విధంగా వెనుకబడింది. కొత్తగా వచ్చిన లెఫ్ట్‌కూటమి అత్యధిక స్థానాలు కైవసం చేసుకుంది. అధికారం కావాలంటే ఫ్రాన్స్‌లో ఏ ఒక్కపార్టీకి ప్రభుత్వం ఏర్పాటు చేసే స్థాయిలో మెజార్టీ రాలేదు. దీనితో విధిగా భావసారూప్యత ఉన్న పార్టీలతో జతకట్టాల్సిన పరిస్థితి పశ్చి ఐరోపా దేశంలో నెలకొంది. ఫ్రెంచ్ రాజకీయ వ్యవస్థనుప్రక్షాళన చేసే కార్యాచరణలో ఈసారి మాక్రాన్‌కు ఈ ఎన్నికలు అతిపెద్ద షాక్ ఇచ్చాయనే చెప్పాలి. రెండు విడతలుగా జరిగిన ఎన్నికల్లో న్యూపాపులర్ ఫ్రంట్ కూటమికి 182 స్థానాలు లభిస్తే ఎన్‌సెంబుల్ అలయన్స్‌కు 163 స్థానాలు వచ్చాయి. నేషనల్ ర్యాలీ ఇతర మిత్రపక్షాలకు 143 స్థానాలు రాగా ఇతర రైట్‌వింగ్ పార్టీలకు 68, ఇతర వామపక్ష పార్టీ అభ్యర్థులు 11 మంది, స్వతంత్రులుగా మరో పది మంది గెలిచారు. ఎన్నికల్లో ఈసారి ప్రజలు వామపక్ష కూటమికే పట్టంకట్టారని ఫలితాలు స్పష్టంచేస్తున్నాయి. అదే 2022లో జరిగిన ఎన్నికల్లో అయితే మాక్రాన్ ఆధ్వర్యంలోని ఎన్సెంబుల్‌కు 245 స్థానాలు వచ్చాయి. ఎన్‌పీఎఫ్‌కు 131స్థానాలు నేషనల్ ర్యాలీకి 89, ఇతరులు 112 స్థానాలు గెలిస్తే ఈసారి ఫలితాలుతారుమారు అయ్యాయి. మాక్రాన్ ప్రస్తుతం అతిపెద్ద ఐరోపాదేశాన్ని అనిశ్చితిలోకి, అస్థిరతలోనికి నెట్టివేసారన్న విమర్శలు ఎదుర్కొన్నారు. ప్రభుత్వ వ్యతిరేక నిరసనలు ఫ్రాన్స్‌లో మిన్నంటాయి. సామాజిక అన్యాయం జరుగుతోందని, అధ్యక్షుడు కేవలం సంపన్న వర్గాల అధ్యక్షుడుగానే కొనసాగుతున్నారన్న అపవాదులు పెరిగిపోయాయి. అంతేకాకుండా సామాన్యులకు అందుబాటులో ఉండేందుకు ఇష్టపడని నేతగాను, అహంకారి అన్న విమర్శలు ఎదుర్కొన్నారు. మరోవైపునుంచి వామపక్ష కూటమి ఇదే అదునుగా ఎన్నికల్లో మాక్రాన్ కూటమిని కార్మిక హక్కులు పరిరక్షణకు ఏమాత్రం కృషిచేయడం లేదని, కార్మికవ్యతిరేక పార్టీ అంటూ ప్రచారం చేసి ఓట్లు రాబట్టుకోగలిగింది. దీనికితోడు ఇటీవల జరిగిన యూరోపియన్ పార్లమెంటరీ ఎన్నికల్లో కూడా అధ్యక్షుడు తనఆధిక్యత చూపించలేకపోయారు. దీనికితోడు ఒకస్పష్టమైనవ్యూహం లేకుండానే పార్లమెంటును రద్దుచేసి ముందస్తు ఎన్నికలకు రావడం మాక్రాన్‌చేసిన అతిపెద్దతప్పిదంగా ఆదేశంలోని రాజ్యాంగ నిపుణులు చెపుతున్నారు. ఆనాడు కుంభకోణాల ఆరోపణలు ఎదుర్కొన్న ఫ్రాంకోయిస్ హాలెండీపైగెలిచిన మాక్రాన్ ఫ్రాన్స్‌పాలనపై తన పట్టును పెంచుకున్నా ఎన్నికల్లో నిరూపించుకోలేక



ఇమ్మాన్యుయేల్ మాక్రాన్

పోయారన్నది ఆయన పార్టీవాదన. అందువల్లనే రెండోవిడత ఎన్నికలు ముగి సిన వెంటనే మాక్రాన్ సెంట్రిస్ట్ కూటమి, లీపెన్‌కు చెందిన ఫార్ రైట్ పార్టీనేషనల్ ర్యాలీని వెనక్కినెట్టి వామపక్ష సంకీర్ణం ఎన్ఎఫ్‌పి అగ్రస్థానంలోకి వచ్చింది. ఎన్ఎఫ్‌పి అధినేత జీన్‌లుక్ మెలన్షన్ ఇక అధికారం తమదేనంటూ ప్రజలనుద్దేశించి సందేశం కూడాఇచ్చారు. ప్రస్తుతపరిస్థితుల్లో తీవ్రంగా పోటీపడిన మూడు కూటముల్లో దేనికీ స్పష్టమైన మెజార్టీరాలేదు. ప్రభుత్వ ఏర్పాటుకు 289సీట్లు అవసరం అవుతాయి. ఈపరిస్థితుల్లో ఏ ఒక్కపార్టీకూడా సొంతంగా ప్రభుత్వం ఏర్పాటుచేయలేని ఫలితాలు వెలువడ్డాయి. ఎన్‌పిఎఫ్ తనకు182సీట్లు వచ్చినా తప్పనిసరిగాఅటు మాక్రాన్ లేదా నేషనల్ రాలీ మద్దతుఅనివార్యం అవుతున్నది. లేదా ఇతరులుగా వచ్చిన 89స్థానాల్లోని ప్రతినిధులను మచ్చికచేసుకుంటేన్యూపాపులర్ ఫ్రంట్ కచ్చితంగా అధికారంలోకి వచ్చేస్తుంది. ఆదిశగానే ఈ వామపక్ష కూటమి నేత జీన్ లుక్ మెలన్షన్ పావులు కదుపుతున్నారు. ఒకవేళ మాక్రాన్ పార్టీకూడా ఇతర ఇదే 89 మందితో చేతులు కలిపేందుకు ప్రయత్నిస్తే మళ్లీ అధికార కూటమికి పగ్గాలు దక్కుతాయి. అయితే ప్రస్తుత పరిస్థితుల్లోఫ్రాన్స్‌లో తమపాలన షురూచేయాలన్న లక్ష్యంతోనే వామపక్ష కూటమి పావులు కదుపుతోంది. అందువల్లనే జీన్‌లుక్ తానే ప్రధాని అవుతాననికూడా ప్రకటించేసుకున్నారు. ఈ ఎన్నికల ఫలితాలను బట్టిచూస్తే ఫ్రాన్స్ పౌరులు మార్పును కోరుకుంటున్నట్లు స్పష్టం అవుతోంది. అయితే భిన్న వాదనలతో కూడిన ప్రజానీకం తమతమ ప్రాధాన్యతలు నెరవేర్చే కూటములకే ఓట్లు వేసినట్లు ఈ హంగ్‌ఫలితాలు స్పష్టంచేస్తున్నాయి. యూరోపియన్ సానుకూల వాదంతో తన నిరంతర దౌత్యసంబంధాల కృషితో అంతర్జాతీయంగా ప్రపంచదేశాల దృష్టిని ఆకర్షించిన మేక్రాన్‌కు ఈ ఎన్నికల్లో గట్టి షాక్ తగిలిందనే చెప్పుకోవాలి. తనహయాంలో ఎక్కువగా బిజినెస్ ఫ్రెండ్లీ విధానాలను అనుసరించి ఫ్రాన్స్ ఆర్థిక వ్యవస్థను వృద్ధిలోకి తెచ్చే కార్యాచరణ ఎక్కువ అవలంభించారు. వాస్తవానికి ఫ్రాన్స్‌లో సంకీర్ణ ప్రభుత్వాలు సాంప్రదాయం కాకపోయినా రాజకీయ అస్థిరతను అధిగమించేందుకు అనివార్యం అవుతోంది. ఐరోపాకూటమిలోని 27దేశాలతోసొంతంగా రక్షణ వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని, వాణిజ్య, ఆర్థికసంస్కరణలు తీసుకువస్తే చైనా, అమెరికాలతో మరింతగాపోటీపడవచ్చన్న భావనతో ఆయనఐరోపా సానుకూలవాదాన్నే అనుసరించారు. ఐరోపావ్యవహారాలు, రక్షణవ్యవస్థ, విదేశాంగ విధానాల్లో ఫ్రెంచ్ రాజ్యాంగం అధ్యక్షునికి కొన్ని విచరక్షణాధికారాలు దఖలుపరిచింది. మాక్రాన్ చేపట్టిన ఆర్థిక సంస్కరణలతో నిరుద్యోగం పది నుంచి 7.5శాతానికి దిగివచ్చింది. విదేశీ పెట్టుబడులు కూడా ఫ్రాన్స్‌కు దండిగానే వచ్చిపడ్డాయి. 2017లో మొదటిసారి ఎన్నికయిన మాక్రాన్ 2022లో తన ప్రధాన ప్రత్యర్థి మరైన్ లీపెన్‌ను అధ్యక్ష ఎన్నికల్లో ఓడించి మళ్లీ పగ్గాలుచేపట్టారు. కానీ పార్లమెంటులో మెజార్టీ లేనందున రిటైర్‌మెంట్ వయసును 62నుంచి 64ఏళ్లకు పెంచాలన్న ప్రతిపాదనను నెగ్గకురాలేకపోయారు. ప్రజల నుంచి వెల్లువెత్తిన నిరసనప్రదర్శనలే మాక్రాన్ పార్టీకి నేషనల్ అసెంబ్లీలో కొంతమేర సీట్లు తగ్గడానికి కారణమైందని చెప్పాలి. ●

---

# యువత భవిష్యత్తుకు కార్యాచరణ ఎక్కడ?

**చిట్టెడ్డి కృష్ణారెడ్డి**

గత రెండు దశాబ్దాలుగా తెలుగు రాష్ట్రాల యువకులు ఉపాధి కోసం నాణ్యమైన జీవన విధానం కోసం ఎదురు చూపులు చూస్తూనే ఉన్నారు. ఉపాధ్యాయుల కొరత ఉన్నప్పటికీ అనేక అవస్థలు పడుతూ డిగ్రీలు పొందినప్పటికీ వారి భవిష్యత్తుకు దారి చూపే మార్గాలు లేకపోవడంతో యువత నిరాశ నిస్పృహలకు, మానసిక ఆందోళనకు నిరంతరం గురవుతున్నారు. లక్షల సంఖ్యలో ప్రభుత్వ ఉద్యోగాలు ఖాళీగా ఉన్నప్పటికీ రాష్ట్ర ఆర్థికఖజానాను సమతుల్యత విధానంలో ఖర్చు చేయడంలో విఫలమై, ఉద్యోగాలు భర్తీ చేస్తే జీతాలకు నిధుల కొరత ఏర్పడుతుందని భయంకూడా ప్రభుత్వానికి ఉన్నట్లు కనిపిస్తుంది. కానీ యువశక్తిని రాష్ట్ర అభివృద్ధిలో పాలుపంచుకునే విధంగా ఉపాధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టి యువతకు ప్రోత్సాహాన్ని ఇచ్చినట్లయితే నిరుద్యోగ సమస్య పరిష్కరించడమే కాకుండా రాష్ట్రం సర్వతోముఖ అభివృద్ధికి మెరుగైన అవకాశాలు ఉండేవి. నేడు నిరుద్యోగులు కథనరంగమై పల్లెపల్లెనా, పట్టణాలలో ఉద్యమిస్తున్నప్పటికీ, వాటికి రాజకీయ రంగు పులిమి నిరుద్యోగ సమస్యను చాలా తేలికగా, పక్కదారి పట్టిస్తున్నారు. గత రెండు దశాబ్దాలుగా ఉమ్మడి రాష్ట్రంలోనూ నిరుద్యోగులు కదంతొక్కినా తగిన ఫలితం దక్కలేదు. నేడు స్వరాష్ట్రంలో సైతం అదేపరిస్థితి దాదాపుగా ఉండటంనిరుద్యోగులు జీర్ణించుకోలేకపోతున్నారు. ఈ రెండు దశాబ్దకాలంలో ఉన్నత చదువులు చదివిన మొదటితరం యువకులు, సరైనఉపాధి లభించకపోవడంతో, విద్యావ్యవస్థపైనే ప్రతికూల అభిప్రాయాన్ని ఏర్పరచుకునే ప్రమాదం కనబడుతోంది. అంతేకాకుండా రాబోయే తరాలు కూడా, ఉన్నత విద్యలను చదవడానికి ఆసక్తి చూపించకుండా వెనుకబడిపోయే పెను ప్రమాదం సైతం లేకపోలేదు. కావున ఉపాధి కల్పన కోసం ప్రభుత్వ ఉద్యోగుల క్యాలెండర్‌తోపాటు ప్రైవేట్ ఉద్యోగాల కల్పన విషయంలోనూ, స్వయం ఉపాధి కల్పన విషయంలోనూ, ఒక దీర్ఘదర్శిని ప్రణాళికను ప్రజలముందు అత్యంత వేగంగా తీసుకురావాల్సిన అవసరం ప్రభుత్వంపైన ఉంది. నిరుద్యోగ యువత కేవలం పట్టణాల్లోనే కాకుండా గ్రామాల్లో సైతం భారీ సంఖ్యలో ఉన్నారు. వారందరికీ మార్కెట్ అనుగుణంగా స్వల్పకాలిక శిక్షణా కార్యక్రమాలను ఏర్పాటు చేసి వ్యాపార రంగంలో భాగస్వామ్యమయ్యే విధంగా సహాయ సహకారాలు అందించి నట్లయితే ఉపాధి అవకాశాలు చాలా మెరుగుపడతాయి. రాష్ట్రం ఏర్పడిన తొలినాళ్లలో కొత్తరాష్ట్రం అనేక సవాళ్లు అనే వాదంతో నిరుద్యోగ సమస్యకు పరిష్కారంచూపించడం, వాయిదా వేయడం జరిగింది. ఆ తర్వాత సైతం జిల్లాల పునర్విభజన ద్వారా ఈ ప్రాంత వాసులకు, పాత ఉద్యోగులతోపాటు మరికొన్ని కొత్తఉద్యోగ అవకాశాలు కలుగుతాయి అన్న ఆనందంతో ఉద్యోగుల కోసం ఎదురుచూసే పరిస్థితి ఉంది. కానీ ఆ తర్వాత కాలంలో ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి ఒకవైపు, న్యాయ పరమైన చిక్కులు మరోవైపు ఎదురు కావడంతో, నిరుద్యోగుల బతుకులు ఛిద్రం అయ్యాయి. గత పాలకుల వైఖరిపై విరక్తితో ప్రత్యామ్నాయ నాయకత్వానికి మద్దతు తెలిపి, కొత్త ప్రభుత్వానికి అవకాశం ఇచ్చి నేడు అది కొలువు దీరినప్పటికీ, ఆ నిరుద్యోగులకు నేటికీ సరైన భరోసా లేక ఆందోళన పడుతున్న వైనం నేడు కళ్లముందు కనబడుతోంది. నిరుద్యోగ సమస్యను ముందుండి నడిపించే నాయకులకు రాజకీయ ఉద్యోగాలు వచ్చాయి కానీ, నిరుద్యోగులకు మాత్రం ఉద్యోగాలు రాకపోవడం చాలాబాధాకరం. అన్ని రాజకీయ పక్షాలు గత రెండు దశాబ్దాలుగా నిరుద్యోగుల సమస్యను రాజకీయం చేసి, పాలకపక్షంపై వ్యతిరేక వైఖరిని తీసుకు వచ్చి, లబ్ధి



పొందడానికి మాత్రమే చేసినట్టుగా ఆ పోరాటాల ఫలితాలు కనిపిస్తున్నాయి. ప్రభుత్వ ఉద్యోగాలు గరిష్టంగా దాదాపు రెండు లక్షల మందికి మాత్రమే ఉపాధిని కల్పించగలవు అన్నది కఠోరమైన వాస్తవం. కానీ నేడు దాదాపుగా 35 నుంచి 40లక్షలపైగా నిరుద్యోగులు ఉపాధి కోసం ఎదురు చూస్తున్న వైనం కళ్లముందు కనబడుతోంది. ప్రభుత్వ ఉద్యోగాలు మాత్రమే జీవితాలకు భరోసా నివ్వగలుగుతాయనే నమ్మకాన్ని బలంగా నాటుతూ, లక్షలాది మంది యువకుల యువశక్తిని నిర్వీర్యం చేస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగాలను ఎప్పటికప్పుడు భర్తీచేస్తూ, ఉద్యోగాలు కల్పించడంతో పాటు, మిగిలిన లక్షలాది మందికి స్వయం ఉపాధితో, వ్యవస్థాపకులుగా మారడానికి అవసరమైన సహాయసహకారాలను పెద్దఎత్తున అందించాల్సిన అవసరం ఉంది. వ్యవస్థాపకులుగా కొత్త ఆలోచనలకు శ్రీకారం చుట్టడానికి, ఆలోచనలకు అంకురార్పణ చేయడానికి, అవసరమైన ఆర్థిక వనరులను సమకూర్చడంలోనూ, అవగాహన, ప్రోత్సాహకాలను అందించడంలో ప్రభుత్వానికి స్పష్టమైన ఆలోచన కానీ, ఒక విధానం కానీ లేకపోవడం చాలా బాధాకరం. నిరుద్యోగులునేడు ఉద్యోగాల క్యాలెండర్ను విడుదల చేసి ఒక స్పష్టమైన విధానాన్ని ప్రకటించాలని కోరుతున్నప్పటికీ, పాలకపక్షం ఇది ఒక రాజకీయమైన సమస్యగానే చూడటం వల్ల పరిస్థితి మరింత ఇబ్బందికరంగా మారుతుంది. రెండు దశాబ్దాల కాలంలో యువత వయసు కొవ్వొత్తిలా కరిగిపోతూ, ఆనాటి యువకులు, నేడు మధ్యవయసు దాటి, నిరాశ నిస్పృహలతో చాలీచాలని బతుకులను వెళ్లదీస్తూ కడు దయనీయ పరిస్థితిని ఎదుర్కోవడానికి, రాజకీయ పరిస్థితులే కారణాలు అనటంలో ఎటువంటి సందేహం లేదు. ప్రభుత్వ ఉద్యోగాలకు సంబంధించి ఆచరణయోగ్యమైన క్యాలెండర్‌ని యువతకు అందిస్తూ, వేగంగా అభివృద్ధి చెందుతున్న సాంకేతిక పరిజ్ఞానం వివిధ రంగాల్లో అవలంభించే విధంగా అవసరమైన కోర్సులను అభివృద్ధి చేసి, చిన్న నగరాలలో సైతం శిక్షణ తరగతులను నిరుద్యోగ యువతకు అందించేవిధంగా కార్యక్రమాలను చేయవలసిన అవసరం ఉంది. తదనుగుణంగా రాష్ట్ర యువశక్తికి అవసరమైన నైపుణ్యాలను పెంపొందిస్తూ యువకులను వ్యవస్థాపకులుగా తీర్చిదిద్దడానికి హైదరాబాద్ నగరంలో 'టీ హబ్', మహిళల వ్యవస్థాపకులుగా తీర్చిదిద్దడానికి 'వీ హబ్' లాంటి వాటికి అత్యధిక ప్రాధాన్యతనిస్తూ, నిరుద్యోగ యువకులలో అవగాహన కల్పిస్తూ, వారి ఆలోచనలకు పదును పెట్టుకోవడానికి పెద్ద ఎత్తున సహకారాన్ని అందించినట్లయితే, నిరుద్యోగ సమస్య తీరడమే కాకుండా రాష్ట్ర ప్రగతిలో కీలకపాత్ర పోషించడానికి అవకాశం ఉంటుంది. రాష్ట్రంలో ప్రతి ద్వితీయ శ్రేణి నగరాల్లో సైతం వ్యవసాయ, వ్యవసాయ ఆధారిత పరిశ్రమలలో శిక్షణా కేంద్రాలను పెద్దఎత్తున ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. అదే విధంగా మార్కెట్లో ఉపాధి అవకాశాలను కల్పించగలిగే కోర్సులను గుర్తించి పల్లెల్లో ఉన్న నిరుద్యోగులు సైతం శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేసి మెరుగైన జీవితాన్ని పొందే విధంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు చేయాల్సిన అవసరం ఉంది. రాష్ట్ర యువకుల యువశక్తిని రాష్ట్ర పరిస్థితుల్లో భాగస్వాములను చేయాలంటే ద్వితీయ శ్రేణి నగరాల్లో సైతం అంకుర పరిశ్రమలకు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తూ ఔత్సాహికులైన యువకులకు ప్రోత్సాహాన్ని, సహాయ సహకారాలను అందించినట్లయితే రాష్ట్ర రూపురేఖలతోపాటు ఈ ప్రాంత ప్రతిబిడ్డ ఆర్థికంగా, సామాజికంగా ముందుకు పోవడానికి ఆస్కారం ఉంటుంది. దాదాపుగా అరకోటికి దగ్గరగా చేరుకుంటున్న నిరుద్యోగులకు ప్రభుత్వ ఉద్యోగాలతోపాటు ప్రైవేట్, స్వయం ఉపాధిపై స్పష్టమైన విధానాన్ని గనుక అమల్లోకి తెచ్చినట్లయితే ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది. ●

# లెఫ్టినెంట్ గవర్నర్‌కు మరిన్ని అధికారాలు

## జమ్ముకాశ్మీర్ పునర్‌వ్యవస్థీకరణ చట్టానికి సవరణలు



**న్యూఢిల్లీ,జులై 13:** జమ్ముకాశ్మీర్ పునర్‌వ్యవస్థీకరణ చట్టానికి కేంద్ర హోంశాఖ సవరణలు తెచ్చింది. కొత్త సవరణలతో లెఫ్టినెంట్ గవర్నర్‌కు మరిన్ని అధికారాలు దఖలుపడతాయి. రాష్ట్రపతి ద్రౌపదిముర్ము ఈ సవరణలకు తన ఆమోదం తెలిపారు. జమ్ముకాశ్మీర్ పునర్‌వ్యవస్థీకరణ చట్టం సెక్షన్ 55 (34 ఆఫ్ 2019) ప్రకారం గవర్నర్‌కు కొన్ని ప్రత్యేక అధికారాలు ఇచ్చారు. ఈసవరణలకు ఎలాంటి ప్రభుత్వ శాఖల ఆమోదం అవసరం లేదని, ఆర్థికశాఖ, పోలీస్, పబ్లిక్ ఆర్డర్ ఆలిండియా సర్వీస్, అవినీతి నిరోధక శాఖలు వంటివి ఇకపై లెఫ్టినెంట్ గవర్నర్ విచక్షణతోనే పనిచేయాల్సి ఉంటుంది. అలాగే అడ్వకేట్ జనరల్, ఇతర న్యాయాధికారులను నియమించేందుకు అడ్వకేట్ జనరల్‌కు కోర్టు వ్యవహారాల్లో సహకరించేందుకుగాను కొన్ని నియామకాలకు ఈ చట్టం సవరణలు తెచ్చింది. చీఫ్ సెక్రటరీ ద్వారా లెఫ్టినెంట్ గవర్నర్‌కువెళ్లే ప్రతి ఫైలు ఇకపై ఎల్జీ అనుమతితోనే అమలుకువస్తుంది. అలాగే రూల్42బి ప్రకారం ఇక ఏవిధమైన ప్రాసిక్యూషన్ అయినా సరే ప్రధాన కార్యదర్శి ద్వారా లెఫ్టినెంట్ గవర్నర్‌కు వచ్చిన తర్వాత ఎల్జీ ఆమోదంతోనే నిర్వహిస్తారు. జైళ్లు, డైరెక్టర్‌ఆఫ్ ప్రాసిక్యూషన్, ఫోరెన్సిక్ సైన్స్ లేబొరేటరీ వ్యవహారాలు పాలనా కార్యదర్శి ఎల్జీకి నివేదిస్తారు. ఇక అడ్మినిస్ట్రేటివ్ కార్యదర్శులు ఆలిండియా సర్వీస్ అధికారుల నియామకాలు బదలీలు అన్ని కూడా ప్రతిపాదనలు లెఫ్టినెంట్ గవర్నర్‌ద్వారానే జరుగుతాయి. ఇక ఇతరత్రా 2020 ఆగస్టు 27వ తేదీ గెజిట్‌లో ప్రచురించిన నియమనిబంధనలు అన్నీ యధాతథంగా అమలవుతాయని, ఆ తర్వాత 2024 ఫిబ్రవరి 28వ తేదీ తెచ్చిన సవరణలు కూడా లెఫ్టినెంట్ గవర్నర్ పరిధిలోనే అమలవుతాయని హోంశాఖ తెలిపింది.

## జమ్ముకాశ్మీర్ మాజీ సిఎంల గృహనిర్బంధం



**శ్రీనగర్, జులై13:** జమ్ముకాశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి పిడిపి అధినేత్రి మెహబూబా ముఫ్తీని గృహనిర్బంధం చేసినట్లు ఆమె ఆరోపించారు. కాశ్మీర్ అమరవీరుల దినోత్సవం సందర్భంగా మజార్ ఏ షుహదాను సందర్శించకుండా తనను అడ్డుకునేందుకే ఈ గృహనిర్బంధం అని ఆమె ఆరోపించారు. మజార్ ఏషుహదాను సందర్శించకుండా హౌస్ అరెస్టుచేసారని, మరోసారి మా ఇంటి గేటుకు తాళాలు వేసారన్నారు. కశ్మీర్ ప్రజల స్ఫూర్తిని అణిచివేయలేరనడానికి అమరవీరుల త్యాగాలే నిదర్శనమన్నారు. వారికి నివాళులర్పించడాన్ని నేరంగా పరిగణిస్తున్నారన్నారు. ఈచర్యల ద్వారా మన హక్కులు గౌరవాన్ని కాపాడుకునేందుకు పోరాటం చేయాలనే మా సంకల్పాన్ని మరింత బలపరుస్తాయని సోషల్‌మీడియాలో ముఫ్తీ పోస్టు చేసారు. తాళం వేసి ఉన్న తన ఇంటి గేటు ఫోటోను కూడా ఆమె పోస్టుచేసారు. మరోవైపు మాజీ సీఎం నేషనల్ కాన్ఫరెన్స్ ఉపాధ్యక్షుడు ఓమర్ అబ్దుల్లాకూడా గృహనిర్బంధంలో ఉన్నట్లు తెలుస్తోంది. అమరవీరులకు నివాళులర్పించేందుకు వీలు కల్పించకుండా అడ్డుకుంటున్న పోలీసుల తీరుపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేసారు. 1931లో మహారాజు నిరంకుశత్వానికి వ్యతిరేకంగా పోరాడిన 22 మంది నిరసనకారులు నాటి సైన్యం చేతిలోప్రాణాలు కోల్పోయారు. వారి త్యాగాలకు గుర్తుగా కాశ్మీర్‌లో మజార్ ఏ షుహదానున ఏర్పాటుచేసారు. ఈనెల 13న అమరవీరుల దినోత్సవం సందర్భంగా ఈ పరిణామం చోటుచేసుకుంది.



## ఎయిమ్స్‌నుంచి రాజ్‌నాథ్ సింగ్ డిశ్చార్జి

**న్యూఢిల్లీ, జులై 13:** రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను ఎయిమ్స్ వైద్యులు శనివారం డిశ్చార్జి చేసారు. రెండురోజులక్రితమే ఆయనకు వెన్నునొప్పి అధికం అయిందన్న సమస్యతో ఎయిమ్స్‌లో చేరారు. ఎయిమ్స్ మీడియాసెల్ ఇన్‌ఛార్జి డా.రిమా దాదా మాట్లాడుతూ రాజ్ నాథ్‌సింగ్‌కు వచ్చిన వెన్నునొప్పిపై సుదీర్ఘ పరిశీలన పరీక్షలు చేసారని, అనంతరం ఇంటి వద్దనుంచే మందులు వాడవచ్చని తేల్చారన్నారు. మంత్రిని శనివారం మధ్యాహ్నం రెండుగంటలకు డిశ్చార్జి చేసినట్లు తెలిపారు. రక్షణమంత్రిని పాత ప్రైవేటు వార్డులో న్యూరోసర్జరీ విభాగంకిందకు వచ్చే వార్డులో రెండురోజుల క్రితం చేర్చారు. అప్పటి నుంచి ఆయన్ను ఆసుపత్రిలోనే ఉంచి చికిత్సలు జరుపుతున్నారు.

# కాంగ్రెస్ తప్పులు మనం చేయొద్దు

### బిజెపికి నితిన్‌గడ్కరీ హెచ్చరిక




**పనాజీ, జులై 13:** కాంగ్రెస్‌ను అధికారం నుంచి గద్దె దింపడానికి దారితీసిన తప్పిదాలను బిజెపి పునరావృతం చేయవద్దని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ అన్నారు. ఈ మేరకు ఆయన సొంత పార్టీని హెచ్చరించారు. భిన్నత్వం ఉన్న పార్టీ బిజెపి అన్న ఎల్‌కె అద్వానీ వ్యాఖ్యలను గుర్తు చేశారు. శుక్రవారం గోవాలో జరిగిన పార్టీ అత్యున్నత స్థాయి సమావేశంలో నితిన్ గడ్కరీ మాట్లాడారు. అధికారంలో ఉన్నప్పుడు కాంగ్రెస్ పార్టీ చేసిన తప్పుల వల్లనే ప్రజలు బిజెపిని ఎన్నుకున్నారని తెలిపారు. 'కాంగ్రెస్ చేసిన పనిని మనం కొసాగిస్తే, (అధికారంనుంచి) వారి నిష్క్రమణ, మన ప్రవేశం వల్ల ప్రయోజనం ఉండదు' అని అన్నారు. కాగా, తన గురువు, మాజీ ఉప ప్రధాని ఎల్‌కె అద్వానీ వ్యాఖ్యలను ఈ సందర్భంగా నితిన్ గడ్కరీ ప్రస్తావించారు. 'మనది భిన్నత్వం ఉన్న పార్టీ అని అద్వానీ చెప్పేవారు. ఇతరపార్టీలకంటే మనం ఎంత భిన్నంగా ఉన్నామో అర్థం చేసుకోవాలి' అని అన్నారు. మరోవైపు రాబోయే రోజుల్లో దేశంలో సామాజిక, ఆర్థిక సంస్కరణలు తీసుకురావడానికి రాజకీయాలు ఒకసాధనమని, పార్టీ కార్యకర్తలు ఇది తెలుసుకోవాలని నితిన్ గడ్కరీ తెలిపారు. సొంత రాష్ట్రమైన మహారాష్ట్ర రాజకీయాలను ఆయన ప్రస్తావించారు. కుల ప్రాతిపదికన రాజకీయాలు చేయకూడదని సూచించారు. 'ఈధోరణిని అనుసరించకూడదని నేను నిర్ణయించుకున్నా. కుల ఆధారిత రాజకీయాలు చేయబోనని ప్రజలకుచెప్పా. కులం గురించి మాట్లాడే వారికి బలమైన కిక్ వస్తుంది' అని అన్నారు. అలాగే అవినీతిరహిత దేశాన్ని సృష్టించడానికి సరైన ప్రణాళిక చేయాలని పార్టీకి పిలుపు నిచ్చారు.

## చాందిపుర వైరస్‌తో నలుగురు చిన్నారులు మృతి



**హిమ్మత్‌నగర్, జులై 13:** గుజరాత్‌లోని సబర్ కాంతజిల్లాలో చాందిపురవ ఐరస్‌సోకి నలుగురు పిల్లలుచనిపోయారు. మరో ఇద్దరు చిన్నారులు ప్రస్తుతం చికిత్సపొందుతున్నారు. హిమ్మత్ నగర్‌జిల్లా కేంద్రంలోని సివిల్ ఆసుపత్రిలో చిన్నారులకు చికిత్స అందుతోంది. చాందిపురవ వైరస్‌కేసుల్లో జ్వరం లక్షణాలు ఎక్కువగా ఉంటాయి. ఆ వైరస్ సోకిన వారికి ఫ్లూ లాంటి లక్షణాలుకూడా ఉంటాయి. తీవ్రస్థాయి ఇన్‌సెఫలిటిస్‌కూడా వస్తుంది. దోమలు, పురుగుల ద్వారా ఆ వైరస్ వ్యాప్తి చెందుతుంది. ఆరుగురు చిన్నారులకు చెందిన రక్తపు నమూనాలను పూణెలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీకి పంపించారు. ఆ శాంపిళ్ల ఫలితాలకోసం ఎదురు చూస్తున్నట్లు సబర్‌కాంత జిల్లా ఆరోగ్యశాఖ అధికారి రాజ్‌సుతారియా తెలిపారు. ఈనెల 10వ తేదీన నలుగురు చిన్నారులకు చాందిపురవ ఐరస్‌సోకి మృతిచెందారని తొలుత హిమ్మత్ నగర్ ఆసుపత్రి చిన్నపిల్లల వైద్యులు అనుమానాలు లేవనెత్తారు. ఆ పిల్లల లక్షణాలే మరో ఇద్దరిలో గమనించామని అన్నారు. చాందిపుర వైరస్‌వల్ల మృతిచెందినవారిలో ఒకరు సబర్‌కాంత్‌జిల్లా వాసి అయితే మరో ఇద్దరు ఆరావలిజిల్లావాసులున్నారు. నాలుగోచిన్నారి మాత్రం రాజస్థాన్‌కు చెందిన వ్యక్తి. ప్రస్తుతం చికిత్సపొందుతున్న ఇద్దరు కూడా రాజస్థానీయులే. రక్షణాత్మక చర్యల్లో భాగంగా ప్రభావితప్రాంతాల్లో రెక్కల పరుగులను చంపాలని ఆదేశించడంతో ఇపుడు ఆ కార్యాచరణ ముమ్మరంగా సాగుతోంది.

# రూ.29వేలకోట్ల ప్రాజెక్టులు ప్రారంభించిన ప్రధాని మోడీ



**ముంబయి,జులై 13:** మహారాష్ట్రపర్యటనలో భాగంగా ముంబయి వచ్చిన ప్రధాన మంత్రి 29,400 కోట్ల రూపాయల విలువయిన అభివృద్ధి పనులను ప్రారంభించారు. మహారాష్ట్ర దేశ అభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తుందని ఈసందర్భంగా ప్రభుత్వ పెద్దలను ప్రశంసించారు. లోకమాన్య తిలక్ టెర్మినస్ ఎక్స్‌టెన్షన్, 10,11 ప్లాట్‌ఫారాల విస్తరణవంటి పనులు కూడా వీటిలో ఉన్నాయి. థాణె బోరివాలి ప్రాంతాల్లో నిర్మించనున్న రెండు సొరంగాల నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. అలాగే బృహన్ ముంబయి మున్సిపల్ కార్పొరేషన్ గోరెగాంవ్ ములుండ్ లింక్ రోడ్డును కూడా ప్రారంభించారు. ఈ అభివృద్ధి పనులతో కనెక్టివిటీ పెరు గుతుందని నగర మౌలికవసతులు మరింతగా వృద్ధిలోకి వస్తాయన్నారు. మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్‌షిండే డిప్యూటి సిఎంలు దేవేంద్రఫడ్నవిస్,అజిత్‌పవార్‌లు కూడా ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ముంబయి పర్యటనలతోనే ప్రధాని మోడీ సెంట్రల్ రైల్వే కల్యాన్ యార్డు రీమోడలింగ్ పనులు, గతిశక్తి మల్టీ మోడల్ కార్గో టెర్మినల్‌ను తురభిలోను శంకుస్థాపనచేస్తారు. ఈ కార్యక్రమాలన్నింటినీ రిమోట్ ద్వారా కొనసాగించారు. గోరెగాంవ్‌లోని నెస్కో ఎగ్జిబిషన్ సెంటర్‌లో ఈ కార్యక్రమం జరిగింది. రెండు సొరంగాల నిర్మాణానికే రూ.6300 కోట్లు ఖర్చవుతుందని తెలిపారు. వీటినిర్మాణం పూర్తయితే ప్రయాణసమయం 75 నిమిషాలనుంచి 25 నిమిషాలకు తగ్గుతుందని బిఎంసి అధికారులు చెపుతున్నారు. ఇదే కార్యక్రమంలో ప్రధాని మోడీ ముఖ్యమంత్రి యువ కార్యపరీక్షన్ యోజనను కూడా ప్రారంభించారు. మహారాష్ట్ర ప్రభుత్వం ఈ పథకానికి 5600 కోట్ల రూపాయల నిధులు కేటాయించింది.

# స్వపక్షం వద్దంటున్నా బైడెన్‌కు విదేశీ నేతల మద్దతు




**వాషింగ్టన్, జులై 13:** అమెరికా అధ్యక్షరేసులో ఉన్న డెమొక్రాట్ అభ్యర్థి ప్రస్తుత అధ్యక్షుడు జోబైడెన్ వయసు ఎన్నికల్లో ఇపుడు కీలకంగా నిలిచింది. ఆయన దిగిపోవడమే మేలని స్వపక్షం నేతలే డిమాండ్ చేస్తుండటం గమనార్హం. ఈనేపథ్యంలో బైడెన్‌కు ప్రపంచ నేతలనుంచి మద్దతు లభించింది. మూడురోజులపాటు జరిగిన నాటో దేశాధినేతల సదస్సులో వారు ఆయన్ను గమనించారు. రేసు నుంచి బైడెన్ వైదొలగాలంటూ వస్తున్న విమర్శలపై బ్రిటన్ కొత్తప్రధాని కీర్ స్టార్మర్ మాట్లాడుతూ తమ అధ్యక్షుడుగా ఎవరు ఉండాలో అమెరికా ప్రజలు నిర్ణయించుకోవాలని, చర్చల సమయంలో ఆయన మంచి ఫామ్‌లో కనిపించారన్నారు. డిన్నర్‌లో భాగంగా బైడెన్‌తో చాలాసేపు మాట్లాడాను. బాధ్యతాయుతమైన అధ్యక్షుడిని చూసానని ఆయనకు తెలిసిన అంశాలపై మంచి స్పష్టతతో ఉన్నారన్నారు. కొన్నిసార్లు పొరపాట్లు జరుగుతుంటాయని, అలా నాక్కూడా జరిగాయన్నారు. భవిష్యత్తులో కూడా అలా జరగవచ్చని ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ అన్నారు. జర్మనీ అధ్యక్షుడు ఒలాఫ్ షూల్జ్ కూడా అదే తరహాలో స్పందించారు. మీరు ఒక వ్యక్తిని తదేకంగా గమనిస్తే ఆ పొరపాట్లు ఎక్కువ కనిపిసానతయని ఆయన అవేమీ పెద్దవిష యాలు కాదన్నారు. ప్రత్యర్థి డొనాల్డ్‌ట్రంప్‌తో జరిగిన టివి చర్చలో తడబడిన బైడెన్ వాషింగ్టన్‌లో జరిగిన నాటో శిఖరాగ్ర సదస్సు సందర్భంగా కూడా తన పొరపాట్లు కొనసాగించారు. ఉపాధ్యక్షురాలు కమలా హ్యారిస్ అనబోయి ట్రంప్ అన్నారు. అలాగే ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీని మిస్టర్‌ప్రెసిడెంట్ పుతిన్ అంటూ పరిచయం చేసారు. 81 ఏళ్ల వయసులో బైడెన్ మానసిక సామర్థ్యం సన్నగిల్లుతోందని విమర్శలు వస్తున్న వేళ ఈ పరిణామాలు చోటుచేసు కున్నా యి.తాను రేసునుంచి వైదొలగనని ట్రంప్ ప్రమా దకర ముప్పు అని తాజా ఎన్నికల ర్యాలీలో అమెరికన్ పౌరులకు బైడెన్ హితబోధలు చేసారు.

## పాక్ సుప్రీంకోర్టులో ఇమ్రాన్‌ఖాన్‌కు భారీ విజయం

### ఆయన పార్టీకి రిజర్వుడు సీట్ల అర్హత ఉందని ధర్మాసనం తీర్పు



**ఇస్లామాబాద్, జులై 13:** జైలులో ఉన్న పాకిస్థాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్‌కు సుప్రీంకోర్టులో భారీ విజయం లభించింది. రిజర్వుడు సీట్లకు ఆయన పార్టీ.. పాకిస్థాన్ తెహ్రీకే ఇన్సాఫ్ (పిటిఐ) అర్హురాలని శుక్రవారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ కాజీ ఫైజ్ ఈసా నేతృత్వంలోని 13 మంది సభ్యుల ధర్మాసనం తీర్పు వెలువరించింది. పార్లమెంటు, ప్రొవిన్షియల్ అసెంబ్లీల్లో ఇమ్రాన్ పార్టీకి రిజర్వుడు సీట్లు కేటాయించకూడదంటూ పాకిస్థాన్ ఎన్నికల కమిషన్ (ఇసిపి) తీసుకున్న నిర్ణయాన్ని తప్పుపట్టింది. రాజ్యాంగ విరుద్ధమని పేర్కొంది. సున్నీ ఇత్తిహాద్ కౌన్సిల్ (ఎస్ఐసి) వేసిన పిటిషన్‌కు అనుకూలంగా తీర్పు ఇచ్చింది. ఫిబ్రవరి 8న జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ గుర్తు బ్యాట్‌పై ఇసిపి నిషేధం విధించడంతో ఎన్నికల్లో పోటీ చేసే అర్హతను పిటిఐ కోల్పోయింది. దీంతో ఇమ్రాన్ మద్దతుదారులు స్వతంత్రులుగా పోటీ చేసి నెగ్గారు. అనంతరం ఎస్ఐసి పార్టీలోకి చేరి కూటమిగా ఏర్పడ్డారు. అయితే పార్లమెంట్, ప్రొవిన్షియల్ అసెంబ్లీల్లో దామాషా పద్ధతిలో పార్టీలకు విధిగా ఇవ్వాల్సిన రిజర్వుడు సీట్లను ఎస్ఐసికి కేటాయించలేదు ఇందుకు ఎస్ఐసి అర్హత లేదని ఇసిపి ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పుడు సుప్రీం తీర్పుతో ఇక భారీ సంఖ్యలో ఇమ్రాన్ మద్దతుదారులు రిజర్వుడు సీట్ల ద్వారా పార్లమెంటు, ప్రొవిన్షియల్ అసెంబ్లీల్లోకి అడుగుపెడతారు. ఇది ప్రధాని షెహబాద్ షరీఫ్ నేతృత్వంలోని సంకీర్ణ కూటమికి పెద్ద ఎదురు దెబ్బ.



## స్కైడైవింగ్ చేసిన గజేంద్ర సింగ్ షెకావత్

### 56 యేళ్ల వయసులో మంత్రి సాహసం

**న్యూఢిల్లీ, జులై13:** వరల్డ్ స్కై డైవింగ్ రోజున కేంద్ర పర్యాటక శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ అరుదైన సాహసం చేశారు. 56 ఏళ్ల వయసులో ఆయన స్కై డైవింగ్‌చేశారు. భారతదేశంలో ప్రైవేటు రంగంలో మొట్టమొదటి స్కై డైవింగ్ కేంద్రాన్ని ప్రారంభించిన సందర్భాన్ని ఇలా సెలబ్రేట్ చేసుకున్నారు. భారత్‌తో పాటు ఈ ప్రపంచానికి ఈ రోజు అతి ముఖ్యమైనది. హర్యానాలోని నార్నౌల్‌లో ఈ కేంద్రం ఏర్పాటైంది. దేశ పర్యాటక శాఖ మంత్రిగా ప్రజలకు ఈ తరహా సదుపాయాలు అందుబాటులో ఉంచడం నా బాధ్యత అని షెకావత్ అన్నారు. అలాగే తాను స్కైడైవింగ్ చేసిన చిత్రాలను ఎక్స్ వేదికగా షేర్ చేశారు. ఆ థ్రిల్‌ను నేనూ ఎంజాయ్ చేశాను. భారత పర్యాటక రంగం అంతర్జాతీయ వసతులను పొందుతున్నందుకు సంతోషంగా ఉంది అంటూ పోస్టు పెట్టారు. స్కై డైవింగ్ ఎంతో సాహసంతో కూడుకున్న ఓ విన్యాసం. మొదటి, రెండో ప్రపంచ యుద్ధంలో సైనికులు అవసరాన్ని బట్టి పారాచూట్ జంప్ చేసేవారు. ఇటీవలి కాలంలో సామాన్యులు సైతం స్కైడైవింగ్ చేస్తున్నారు.

### మా సిఎం కేజ్రీవాల్ షుగర్ లెవెల్స్ ఐదు సార్లు తగ్గాయి

## కోమాలోకి వెళ్లే ప్రమాదం: ఆప్ ఎంపి సంజయ్‌సింగ్



**న్యూఢిల్లీ, జులై 13:** మద్యం కుంభకోణానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో అరెస్టయిన ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ప్రస్తుతం తీహార్ జైల్లో ఉన్నారు. ఆయన 8.5 కిలోల బరువు తగ్గారని, షుగర్ లెవెల్స్ దారుణంగా పడిపోయాయని ఆమ్ ఆద్మీ పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. ఆయన ఆరోగ్యం క్షీణిస్తోందని ఆప్ నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. చక్కెర స్థాయిల్లో తీవ్ర హెచ్చుతగ్గులు ఉంటున్నట్లు తెలుస్తోంది. షుగర్ లెవెల్ 50 ఎంజి స్థాయికి పడిపోయింది. ఇది ప్రమాదకర పరిస్థితికి దారి తీస్తుంది. బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం కేజ్రీవాల్‌ను అనారోగ్యానికి గురి చేస్తూ, బాధపెట్టేందుకు కుట్ర పన్నుతోంది. ఆయనను చిత్రహింసలు పెట్టడమే బిజెపి లక్ష్యం అని ఆప్ రాజ్యసభ ఎంపి సంజయ్‌సింగ్ ఆరోపించారు. మార్చి 21న ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కేజ్రీవాల్‌ను అరెస్టు చేసినప్పుడు 70 కిలోల బరువు ఉన్న ఆయన ఇప్పుడు 61.5కు తగ్గారని వాపోయారు. దాదాపు అయిదుసార్లు కేజ్రీవాల్ షుగర్ లెవల్ 50ఎంజి, డిఎల్ కంటే తక్కువకు వెళ్లిందని,తరచుగా ఇలా జరిగితే కోమాలోకి వెళ్లే ప్రమాదముందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇడి నమోదు చేసిన కేసులో కేజ్రీవాల్‌కు సుప్రీంకోర్టు శుక్రవారంమధ్యంతరబెయిల్ మంజూరు చేసింది. అయితే సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వె స్టిగేషన్ దర్యాప్తుచేస్తున్న అవినీతి కేసులో అరెస్టు అవడంతో జైల్లోనే ఉన్నారు. దీనిపై సంజయ్ సింగ్ స్పందిస్తూ కేజ్రీవాల్‌కు సుప్రీంకోర్టు నుంచి ఉపశమనం లభిస్తుందేమో అనే అను మానం తోనే సిబిఐ కల్పిత కేసు పెట్టిందన్నారు. ఈ విధంగా తప్పుడు కేసులు పెడుతూ కేంద్రం ఆయన జీవితంతో ఆడుకుంటోందని విమర్శించారు.


## అధ్యక్ష అభ్యర్థి ట్రంప్‌కు టెస్లా అధినేత భారీ విరాళం



**న్యూయార్క్, జులై 13:** అమెరికాలో ప్రముఖ బిలియనీర్, టెస్లా అధినేత ఎలాన్ మస్క్ అధ్యక్ష ఎన్నికల బరిలో ఉన్న రిపబ్లికన్ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్‌కు భారీ విరాళమిచ్చినట్లు తెలుస్తోంది. ట్రంప్ గెలుపుకోసం పనిచేస్తున్న అమెరికా పొలిటికల్ యాక్షన్ కమిటీ (ఎప్యాక్)కు ఈనిధులను మస్క్ విరాళంగా ఇచ్చినట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు వెలువడ్డాయి. అయితే ఎంత మొత్తం మస్క్ విరాళం ఇచ్చారనేది తెలియ రాలేదు. ఎప్యాక్ తమ గ్రూపునకు విరాళం ఇచ్చినవారి జాబితాను జులై 15న అధికారికంగా వెల్లడించనున్నది. ఈ ఎన్నికల్లో తాను బైడెన్, ట్రంప్‌లో ఎవరి తరపునా ఖర్చుచేయనని మస్క్ గతంలోప్రకటించారు. అయితే తాజాగా మస్క్ ట్రంప్‌నకు భారీగా విరాళం ఇవ్వడం చర్చనీయాంశం అయింది. ఎన్నికల కోసం ధనవంతుల నుంచి ప్రచార నిధుల సేకరణలో బైడెన్‌కంటే ట్రంప్ ముందున్నారు. ఈ పరిస్థితుల్లో మస్క్ కూడా ట్రంప్‌కు విరాళం ఇచ్చారు. మస్క్ ఇప్పటికే డెమొక్రాట్ అభ్యర్థి బైడెన్‌ను అనేక సార్లు విమర్శించిన సంగతి తెలిసిందే. గత ఎన్నికల సమయంలో ట్రంప్ ట్విటర్ ఖాతాను బ్యాన్ చేయగా ట్విట్టర్‌ను కొనుగోలుచేసిన వెంటనే మస్క్ ఆఖాతాను పునరుద్ధరించారు.

## 'కేంద్ర సర్కార్ నిర్ణయంలో ఆశ్చర్యం లేదు'

### రాజ్యాంగ హత్యా దినంపై ప్రియాంక గాంధీ



**న్యూఢిల్లీ, జులై 13:** దేశంలో అత్యవసర పరిస్థితిని విధించిన జూన్ 25ను ఇకపై ఏటా 'రాజ్యాంగ హత్యాదినం'గా జరుపుకోవాలని కేంద్ర ప్రభుత్వం తీసుకున్న కీలక నిర్ణయంపై కాంగ్రెస్ అగ్ర నాయకురాలు ప్రియాంకగాంధీ స్పందించారు. మోడీ సర్కార్ తీసుకున్న చర్యలపై మండిపడ్డారు. రాజ్యాంగాన్ని పూర్తిగా మార్చి ప్రతికూల రాజకీయాలకు పాల్పడేవారు ఇలా చేయడంలో వింతేమీలేదని విమర్శలు గుప్పించారు. దేశంలోని గొప్ప వ్యక్తులు కలిసికట్టుగా స్వాతంత్ర్యాన్ని మాత్రమే కాకుండా రాజ్యాంగాన్ని రూపొందించుకున్నారు. కానీ, కేంద్రంలోని మోడీ సర్కార్ ఎప్పటి నుంచో రాజ్యాంగాన్ని మార్చాలని ప్రయత్నిస్తోంది. దాని రద్దు చేయడానికి విశ్వ ప్రయత్నాలు చేస్తోంది. ప్రతికూల రాజకీయాలకు పాల్పడేవారు 'సంవిధాన్ హత్యాదివస్' ప్రకటించడంలో ఆశ్చర్యం ఏమీ లేదు. రాజ్యాంగంపై విశ్వాసం ఉన్నవారు మాత్రమే పరిరక్షణ కోసం పోరాడుతున్నారు అని ప్రియాంక గాంధీ పేర్కొన్నారు. నాటి ప్రధానమంత్రి ఇందిరాగాంధీ 1975 జూన్ 25న దేశంలో ఎమర్జెన్సీ విధించిన సంగతి తెలిసిందే. ఆమె ప్రజాస్వామ్యం గొంతు నులిమేశారని, కారణం లేకుండా లక్షలాది మందిని జైల్లో పెట్టారని ఎన్డీయే సర్కార్ గుర్తుచేసింది.

# హమాస్‌ను ఉగ్రసంస్థగా ప్రకటించిన అర్జెంటీనా



**బ్యూనస్‌ఎయిర్స్, జులై 13:** అర్జెంటీనా తాజాగా హమాస్‌ను ఉగ్రవాద సంస్థగా ప్రకటించడంతోపాటు దాని ఆర్థిక మూలాలను జప్తు చేయాలని అధికారులను ఆదేశించింది. అమెరికా, ఇజ్రాయెల్‌తో తమ దేశ సంబంధాలను బలోపేతం చేసే దిశగా యోచిస్తున్న అర్జెంటీనా అధ్యక్షుడు జేవియర్ మెయిలీ ఈ విధమైన ప్రకటన చేశారు. గత అక్టోబరు 7న ఇజ్రాయెల్‌లో పాలస్తీనా గ్రూపు జరిపిన దాడిని అర్జెంటీనా ఖండించింది. ఇజ్రాయెల్ 76 యేళ్ల చరిత్రలో ఈ దాడి మాయని మచ్చగా మిగిలిపోతుంది. అర్జెంటీనా దేశంలోని యూదులు ఉంటున్న ప్రాంతాపై హమాస్ ఉగ్రదాడులు చేసిందని, ఈ సంస్థకు ఇరాన్‌తో సన్నిహిత సంబంధాలున్నాయని అర్జెంటీనా ఆరోపించింది. ఇదిలా ఉండగా ఇజ్రాయెల్ తరచూ హమాస్‌ను లక్ష్యంగా చేసుకుని దాడులు చేస్తోంది. గాజాలో జరిగిన ఈ దాడుల్లో 70 మందికిపైగా పాలస్తీనియన్లు మృతి చెందారు. హమాస్ ప్రతినిధి ఒకరు మీడియాతో మాట్లాడుతూ ఇజ్రాయెల్ ఇక్కడి ప్రజలను ఊచకోత కోస్తున్నదని ఆరోపించారు. తూర్పు గాజా నగరంలోని వేలాది మంది పాలస్తీనియన్లను ఇజ్రాయెల్ దళాలు పశ్చిమ, దక్షిణ ప్రాంతాలకు తరిమికొట్టాయని, అయితే వారు అక్కడికి రాగానే వారిపై కాల్పులు జరిపారని హమాస్ ప్రభుత్వ మీడియా కార్యాలయం డైరెక్టర్ జనరల్ ఇస్మాయిల్ అల్ తౌబ్తా పేర్కొన్నారు. పాలస్తీనియన్లంతా గాజా సిటీని ఖాళీ చేసి దక్షిణం వైపు వెళ్లాలని ఇటీవల ఇజ్రాయెల్ ఆర్మీ ఆదేశించింది. ఇజ్రాయెల్ దళాలు గాజా నగరంలో హెచ్చరికల కరపత్రాను జారవిడిచాయి. అక్కడి ప్రజలంతా దక్షిణం వైపునకు వెళ్లాలని దానిలో కోరాయి.

## బస్సు ట్రక్కు ఢీ.. ముగ్గురు మృతి

### 14 మందికి తీవ్రగాయాలు




**బారిపద(ఒడిశా),జులై 13:** రాష్ట్రంలోని మయూర్ భంజ్ జిల్లాలో ప్రయాణీకులతో వెళుతున్న ఒక బస్సు ట్రక్ ఢీకొనడంతో ముగ్గురు చనిపోగా 14 మంది తీవ్ర గాయాల పాలయ్యారు. శనివారం ఉదయం 18వ నెం బరు జాతీయ రహదారిపై ఉదయం 5.30 గం టలకు ఈ ప్రమాదం సంభవించింది. ముదిక్ మరి స్క్వేర్‌వద్ద హటాత్తుగాజరిగిన ప్రమాదంతో బస్సులోని ప్రయాణీకులు ఏంజరుగుతుందో తెలుసుకోడానికి ఎక్కువ తాపత్రయపడ్డారు. ఈ భయాందోళనల్లోనే ముగ్గురు మృతిచెందారని పోలీసులు తెలిపారు. హైదరాబాద్ నుంచి బీహార్‌లోని గయకు వెళుతున్నట్లు పోలీసులు తెలిపారు. హైదరాబాద్‌లోని చార్మినార్‌ప్రాంతానికి చెందిన ఉదయ్‌సింగ్ గా ఒక ప్రయాణీకుడిని గుర్తించారు. పండిట్ రఘునాథ్ ముర్ము వైద్యకళాశాల ఆసుపత్రికి క్షతగాత్రులను తరలించి చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. అదనపు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి బిజయ్‌కుమార్ దాస్ మాట్లాడుతూ స్పాట్‌లోనే డ్రైవర్‌చనిపోయాడని ఆతడిపేఊరు ఉదయ్‌సింగ్ అని తెలిపారు. మరో ఇద్దరుచికిత్సలో ఉండగా చనిపోయారని తెలి పారు. 14మంది ఇప్పటికీ ఆసుపత్రుల్లోనే చికిత్సల్లో కొనసాగుతున్నారు. ప్రమాదం జరగడంతోనే ట్రక్కుడ్రైవర్ ఆ ప్రాంతంనుంచి పరారయ్యాడని పోలీసులు తెలిపారు. కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని, మృతదేహాలను పోస్టుమార్టంకు తరలించినట్లు తెలిపారు.



పాతబస్తీలో మొహరం ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్న కొత్వాల్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి. చిత్రంలో అదనపు సిపి (శాంతిభద్రతలు) విక్రంసింగ్ మాన్ తదితరులు

# మొహరం ఊరేగింపులో అవాంఛనీయ ఘటనలు జరగనీయొద్దు

## ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించిన కొత్వాల్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి

**హైదరాబాద్, జులై 13, ప్రభాతవార్త:** ఈ నెల 17న జరగనున్న మొహరం ఊరేగింపు కోసం జరుగుతున్న ఏర్పాట్లను నగర పోలీసు కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పాత బస్తీలోని చార్మినార్, దారుషిఫా, మీర్‌చౌక్, చార్మినార్ సహా ఇతర ప్రాంతాల్లో మొహరం ఊరేగింపు జరగనుండడం తెలిసిందే. ఈ ఊరేగింపులో సాంప్రదాయ ప్రకారం ఏనుగు కూడా ఉండనుంది. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాలలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి పోలీసులను ఆదేశించారు. ఊరేగింపు సాగే మార్గంలో ట్రాఫిక్ మళ్లింపు ముందుగానే సాగాలని, ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు కూడా జరగకుండా జాగ్రత్తగా వ్యవహరించాలని ఆయన ఆదేశించారు.

అనంతరం బీబీకా అలావా వద్ద మొహరం సందర్భంగా ఏర్పాటు చేసిన వేదికను కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడి మత పెద్దల నుంచి ఆశీర్వచనాలు అందుకున్నారు. ఇదే సమయంలో ఊరేగింపు కోసం ఎంపిక చేసిన ఏనుగును కూడా ఆయన చూశారు.

ఊరేగింపులో పాల్గొనే ఏనుగు విషయంలో మావాటితోపాటు అటవీ శాఖ అధికారులు జాగ్రత్తగా ఉండాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి వెంట అదనపు పోలీసు కమిషనర్ (శాంతి భద్రతలు) విక్రంసింగ్‌మాన్, సిటీ ట్రాఫిక్ చీఫ్ విశ్వప్రసాద్, దక్షిణ మండల డిసిపి స్నేహ మెహ్రా తదితరులు పాల్గొన్నారు.



శనివారం గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న భువనగిరి ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

# తెలంగాణలో అధికారంలోకి వస్తామని కలలు కంటున్న కేంద్రమంత్రి

## ప్రజాసంగ్రామ యాత్ర పేరుతో కిషన్‌రెడ్డి పైసల వసూళ్ల యాత్ర చేశాడు

### భువనగిరి ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

**హైరదాబాద్, జులై 13, ప్రభాతవార్త:** తెలంగాణలో బిజెపి అధికారంలోకి వస్తుందని కేంద్రమంత్రి ధర్మేంద్రప్రధాన్ కలలు కంటున్నారని భువనగిరి ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అపహాస్యం చేశారు. శనివారం గాంధీ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ బిజెపి గాలిలో నాలుగు ఎంపి సీట్లను ఎక్కువ గెలిచిందని అంతమాత్రాన అధికారంలోకి వస్తామనుకోవడం భ్రమ అని ఆయన జోస్యంచెప్పారు. మీ బలం ఎంతో అసెంబ్లీ ఎన్నికలు చెప్పాయి. రేపు స్థానికసంస్థల ఎన్నికలలో తెలుపుతాయని అందులో సున్నా ఫలితాలు వస్తాయని ఆయన ఎద్దేవా చేశారు. ప్రజా సంగ్రామ యాత్ర పేరుతో నువ్వు చేసిన వసూళ్ళు అందరికి తెలుసు, పాదయాత్రపేరుతో పైసల యాత్ర చేశావు నువ్వు మా సిఎం గురించి మాట్లాడుతావా అని ఆగ్రహం వ్యక్తంచేశారు. మా రాహుల్‌కు దమ్ముంది కాబట్టి మీడియా ముందుకు వచ్చిన అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇస్తున్నారు. మా రాహుల్‌కు దమ్ముంది కాబట్టి మణిపూర్ బాదితుల వద్దకు వెళ్ళి ఓదార్పు ప్రకటిస్తున్నారు దేశంలో ఎక్కడ ఏం జరిగినా ధైర్యంగా వెళ్ళుతున్నారు నీ మోడీ లాగా రాహుల్‌సెక్యూరిటి వెనకాలదాక్కోలేదు బండిసంజయ్ నీ బడాయి కబుర్లు ఆపు అనిఆయన అన్నారు. ఇంఫాల్ నుంచి ముంబాయివరకు భారత్‌న్యాయ్ యాత్ర చేశారు. కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు 4000 కి.మి భారత్ జోడోయాత్రను చేశారు రాహుల్‌గాంధీకి దమ్ముంటే ఉస్మానియా యూనివర్సిటికి రావాలని బండి సంజయ్ సవాల్ చేయడం తగదు.

తెలంగాణలో నడిరోడ్డుపై రాజ్యాంగాన్ని అవహేళన చేస్తున్నారని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అంటున్నారు కానీ ఈ దేశాన్ని రాజ్యాంగాన్ని అవహేళన చేసేది బిజెపి అని ఆయన అన్నారు. పదేళ్ళుగా ప్రజాస్వామ్యయుతంగా ఏర్పాటైన ప్రభుత్వాలను కూల్చిన చరిత్ర మీదని ఆయన ఏకరవు పెట్టారు. సుప్రీంకోర్టుతో బిజెపి కేంద్రపాలకులు చీవాట్లు తిన్నా రాష్ట్రప్రభుత్వాలను కూల్చివేస్తూ ఇడి సిబిఐ ఇన్‌కంటాక్స్ వంటి సంస్థలతో బెదిరించి ఎమ్మెల్యేలను చేర్చుకొని ప్రభుత్వాలనుకూల్చేసిన బతుకులు మీవి అని ఆయన అన్నారు. ఫిరాయింపులపై నీతులు పలికే కిషన్‌రెడ్డి నాలుగు రోజుల క్రితం మధ్యప్రదేశ్‌లో బిజెపిలోకి కాంగ్రెస్ ఎమ్మెల్యేను చేర్చుకొని మంత్రివర్గంలో చోటు ఇచ్చారని ఆవేదన చెందారు. ఆరుసార్లు కాంగ్రెస్ ఎమ్మెల్యేగా గెలచిన రామ్ నివాస్‌రావత్ ను జులై 9న సిఎం మోహన్ యాదవ్ తన మంత్రివర్గంలోకి తీసుకున్నారని అన్నారు. విజయ్‌పూర్ నుంచి రావత్ కాంగ్రెస్ నుంచి గెలిచారని ఇప్పటి వరకు ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయలేదని ఆయన అన్నారు. మధ్యప్రదేశ్‌లో మీరు చేసింది రాజ్యాంగహేళన కాదా అన ప్రశ్నించారు. 2014లోతలసాని శ్రీనివాస్‌కు 2018 సబితా ఇంద్రారెడ్డికి మంత్రివర్గంలో చోటు ఇచ్చారని చరిత్రను గుర్తుచేశారు. బిఆర్‌ఎస్ బిజెపి రెండు పార్టీల డిఎన్‌ఏ ఒకటే అని కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు.

పార్లమెంట్ ఎన్నికలలో ఒక తల్లికి పుట్టిన బిడ్డల్లా ఎంత కలిసిపోయాయో అని ఆశ్చర్యం వ్యక్తంచేశారు. సికిందరబాద్‌లో కిషన్ రెడ్డిఎలా గెలిచారు బిఆర్‌ఎస్ చచ్చిపోయి కిషన్‌రెడ్డికి అవయవ దానం చేశారని అన్నారు. హరీష్‌రావు కెటిఆర్ ఢిల్లీ వేదికపై బిఆర్‌ఎస్ బిజెపితో చర్చలు జరిపారని ఆరోపించారు. బిఆర్‌ఎస్ రాజ్యసభ ఎంపిలను బిజెపిలోకి చేర్పించడానికి యత్నం చేస్తున్నారని ఆయన అన్నారు. గతంలో తెలుగుదేశం అనుసరించిన వ్యూహం తెలంగాణలో బిఆర్‌ఎస్ అమలు చేస్తున్నదని ఆయన అన్నారు.

# అమృత్ పథకం నిధుల టెండర్లలో భారీగా అవినీతి

## గ్లోబల్ టెండర్లలో 40శాతం లెస్‌కు పనులు చేయడానికి ముందుకురాకపోతే రాజీనామా

### బిజెపిఎల్‌పి నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

**హైదరాబాద్, జులై 13, ప్రభాతవార్త:** కేంద్ర సర్కార్ ఇచ్చిన అమృత్ పథకం నిధుల టెండర్లలో భారీగా అవినీతి జరిగిందని, ఈ అవినీతిని నిరూపించేందుకు సిద్దంగా ఉన్నానని బిజెపి ఎల్‌పి నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. శనివారం బిజెపిఎల్‌పి కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. అమృత్ పథకంలో గ్లోబల్ టెండర్‌లలో 40శాతం లెస్‌కు పనులు చేయడానికి కాంట్రాక్టర్లు ముందుకు రాకపోతే నేను రాజీనామా చేస్తానన్నారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వానికి చెవిటి వాడి ముందు శంఖం ఊదినట్లుగా ఉందన్నారు. జవాబుదారి తనం లేదు, పారదర్శకత లేదన్నారు. ప్రజాపాలన పేరు మీద రాక్షస రాజ్యం నడుస్తోందన్నారు. రేవంత్ అవినీతి పాలనపై బిజెపి పోరాటం చేస్తుందన్నారు. ప్రజాక్షేత్రంలో వాటిని బయటపెడతామన్నారు. దొంగలు పోయి గజదొంగలు వచ్చినట్లుగా పరిస్థితి తయారైందన్నారు. రాష్ట్రంలో రేవంత్‌బాబా డజను దొంగల పాలన నడుస్తోందంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. ప్రజలకు తెలియకుండా దొంగ జిఓలు జారీ చేస్తున్నారన్నారు. బిఆర్‌ఎస్ ఎమ్మెల్యేలను బెదిరించి కాంగ్రెస్‌లో చేర్చుకుంటున్నారన్నారు. బిఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు చాలా మంది బిజెపితో టచ్‌లో ఉన్నారని, అయితే రాజీనామా చేసి రావాలని షరతు ఉండడంతో వెనకడుగు వేస్తున్నారేమోనని తెలిపారు. రాష్ట్రంలో ఎప్పుడైనా ఏదమైనా జరగవచ్చునన్నారు. కొడంగల్ ఎత్తిపోతల పథకానికి గ్లోబల్ టెండర్లు పిలవాల్సిందేనని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో దొంగలు పడ్డారని, పట్టపగలే దోచుకుంటున్నారన్నారు. అతి తక్కువ కాలంలో అప్రతిష్టను కాంగ్రెస్ ప్రభుత్వం మూటకట్టుకుందన్నారు.

# బైరాగిగూడలోని ఓ ఇంట్లోకి దూసుకొచ్చిన బుల్లెట్

## భయాందోళనలో కుటుంబసభ్యులు

**హైదరాబాద్ (నార్సింగి), జులై 13, ప్రభాతవార్త :** గండిపేట మండలం బైరాగిగూడ గ్రామంలోని ఓ ఇంట్లోకి బుల్లెట్ దూసుకు వచ్చింది. ఈ సంఘటన నార్సింగి పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు, ఇంటి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. నార్సింగి మున్సిపల్ పరిధిలోని బైరాగిగూడ గ్రామంలో ఉన్న ఆర్.కె.అద్వైత్ అపార్ట్‌మెంట్ ఐదో అంతస్థులో సిద్దార్థ ఇల్లు ఉంది. శనివారం ఉదయం ఆయన ఇంటి కిటికి అద్దాలను చీల్చుకొని, పెద్ద శబ్దం చేస్తూ ఓ బుల్లెట్ వచ్చి పడింది. అదృష్టవశాత్తు ఆ సమయంలో అక్కడ ఎవరూ లేరు. ఆ బుల్లెట్ వచ్చిన సమయంలో మనుషులు ఉంటే ప్రాణాపాయం కూడా సంభవించే ప్రమాదం ఉండేదన్నారు. కిటికి అద్దాలు పగులిన శబ్దం రావడంతో కుటుంబ సభ్యులు ఎవరైనా రాళ్లతో కొట్టారా? అని పరిశీలించారు. ఇంట్లో లభించిన బుల్లెట్‌ను చూసి షాక్ తిన్నారు. వెంటనే ఈ బుల్లెట్ విషయంను నార్సింగి పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. భవిష్యత్తులో మరోమారు ఇలాంటి ప్రమాదం జరుగకుండా చూడాలని పోలీసులను కోరారు. ఈ ఇంటికి కొద్ది దూరంలోని మిలిట్రీ ఏరియా ఉంది. అక్కడ నిత్యం జవాన్లు గన్ ఫైరింగ్ ప్రాక్టీస్ చేస్తుంటారు. అది మిస్ అయ్యి వీరి ఇంట్లోకి దూసుకు వచ్చి ఉంటుందని పోలీసులు అనుమానిస్తున్నారు. బుల్లెట్‌ను తీసుకొని, బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు నార్సింగి పోలీసులు తెలిపారు.

# రాష్ట్రంలోనే తొలి కంటైనర్ ఆస్పత్రి ములుగులో ప్రారంభం

## కెజిబివి తరగతి గదులు, వసతిగృహాన్ని ప్రారంభించిన మంత్రి సీతక్క

## పోడుభూముల పట్టాలకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్న ప్రభుత్వం

**ములుగు, జులై 13, ప్రభాతవార్త :**విద్యార్థులకు సంపూర్ణ విద్యను అందిం చాలని, విద్యార్థులు విద్యతోపాటు సమాజంపై కూడా అవగాహన పెంచుకో వాలని పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి గ్రామీణ నీటి సరఫరా స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. గోవిందరావుపేట మండలం చల్వాయి లో 135.00 లక్షల రూపాయలు, తాడ్వాయి మండలంలో 205.00 లక్షల రూపాయలు సమగ్ర శిక్ష నిధులతో నూతనంగా నిర్మించిన కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయ తరగతి గదులు, వసతిభవనాన్ని మంత్రి సీతక్క ప్రారంభించి మాట్లాడారు. కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో విద్యార్థులకు అన్ని ఏర్పాట్లు, సదుపాయాలు కల్పిస్తున్నామని పదవ తరగతి నుంచి కస్తూర్బా గాంధీ పాఠశాలలను అప్‌గ్రేడ్ చేసి ఇంటర్మీడియట్ విద్య అందించడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థులను అనుమతి లేకుండా బయటికి పంపకూడదని విద్యాలయ అధికారులను ఆదేశించారు. గ్రౌండ్ లేవలింగ్ బోర్స్ సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని తెలిపారు.

**ప్రజాదర్బారులో పాల్గొన్న మంత్రి సీతక్క**

తాడ్వాయి మండలంలోని లింగాల గ్రామంలో ప్రజా దర్బార్‌లో మంత్రి పాల్గొ న్నారు. గిరిజన ప్రాంతంలో ఉన్నా సమస్యలను పరిష్క రించడానికి ప్రభుత్వం ముందడుగు వేస్తుందని ప్రతి సీతక్క అన్నారు. కొత్త పోడు కొట్టడం మానేసి ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్క లను పెంచాలన్నారు. ప్రభుత్వం త్వరలో పోడు భూములకు పట్టాలు ఇచ్చేందుకు ప్రణాళికలు సిద్దం చేస్తుందన్నారు. జిల్లా కలెక్టర్ దివాకర్ టీ.ఎస్.ఎస్పీ. శబరీష్, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థల పి.శ్రీజలతో కలిసి ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు.

లింగాల, లవ్వల, బందాల, కొడిశాల గ్రామాలకు చెందిన ప్రజల నుంచి పోడు భూముల పట్టాలు, జీసీసీ డిపో ఏర్పాటు, రహదారి సౌకర్యం, విద్యుత్ ఏర్పాటు, బస్సు రవాణా సౌకర్యం వంటి సమస్యలపై దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గిరిజన ప్రాంతాలలో నెలకొన్న సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని, వికలాంగులకు సదరం క్యాప్, ఏర్పాటు చేస్తామని తెలిపారు.

**రాష్ట్రంలోనే తొలి కంటైనర్ ఆస్పతి ప్రారంభించిన మంత్రి**

రాష్ట్రంలోనే తొలి కంటైనర్ ఆస్పత్రిని (ఆరోగ్య ఉప కేంద్రం) మంత్రి సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర్ టి.ఎస్. ఎస్పీ శబరీష్, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు, పి.శ్రీజలతో కలసి ప్రారంభించారు. సమీపంలో ఉన్న ఐదు గ్రామా లకు ఈ కంటైనర్ ఆసుపత్రి అందుబాటులో ఉంటుంది. ఏజెన్సీ ప్రాంతంలో సీజనల్ వ్యాధులుపై ప్రత్యేక దృష్టితో ఐదు మారుమూల గ్రామాల కోసం రాష్ట్రంలోనే తొలి కంటైనర్ ఆసుప్రతి అందుబాటులో ఉంటుంది.

ఏజెన్సీ ప్రాంతంలో సీజనల్ వ్యాధులపై ప్రత్యేక దృష్టితో ఐదు మారుమూల గ్రామాల కోసం రాష్ట్రంలోనే తొలి కంటైనర్ ఆసుపత్రి (ఆరోగ్య ఉపకేంద్రం) ను ఏర్పాటు చేసి ప్రజలకు వైద్యసేవలు అందిస్తున్నామని మంత్రి సీతక్క తెలిపారు. అనంతరం మంత్రి పోచపూర్‌లోని గురుకులాన్ని పరిశీలించారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని పిల్లలకు అందించే ఆహారంలో నాణ్యత పాటించాలని ఉపాధ్యాయులకు సూచించారు.



# జిఓ 317 సవరణ కోసం 52,235 దరఖాస్తులు

## వీటిలో స్థానికత కోల్పోయిన 30 వేల ఉద్యోగులు

### పరిష్కారంపై సర్కార్ దృష్టి

**హైదరాబాద్, జులై 13, ప్రభాతవార్త:** జిఓ 317కు సంబంధించి తమకు న్యాయం చేయాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వానికి ఇప్పటి వరకూ 52,235 మంది అధికారులు, ఉద్యోగులు దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 30 వేల మంది స్థానికతను కోల్పోయిన వారు ఉండటం విశేషం. శాఖల వారీగా వచ్చిన దరఖాస్తుల వివరాలను సాధారణ పరిపాలన శాఖ రఘునందర్‌రావు సంబంధిత శాఖలకు పంపించారు. వీటిని పరిశీలించి ఫార్మాట్ ప్రకారం రిపోర్ట్ ఇవ్వాలని అన్ని శాఖల అధికారులకు సూచించారు. ఈ దరఖాస్తుల్లో ఎక్కువగా వ్యవసాయ, విద్య, హోం, రెవెన్యూ, హెల్త్, పంచాయితీరాజ్ శాఖలకు సంబంధించిన దరఖాస్తులు ఉన్నాయి. కాగా ఇప్పటికే 317 జిఓపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టిసారించింది. ఇందు కోసం ప్రత్యేకించి మంత్రివర్గ ఉప సంఘాన్ని నియమించింది. పలుమార్లు భేటీ అయిన ఈ ఉప సంఘం ఇటీవల కొన్ని నిర్ణయాలు తీసుకుంది. ఇందులో బాగంగా స్పౌజ్, మెడిక్, మ్యూచువల్, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల భార్య లేదా భర్త చేసుకున్న దరఖాస్తులపై కమిటీ సానుకూలత కనపరచింది. చేసుకున్న దరఖాస్తులను సంబంధిత శాఖాధిపతులకు పంపించాల్సిందిగా మంత్రివర్గ ఉప సంఘం సాధారణ పరిపాలన శాఖ అధికారులను ఆదేశించింది. మిగిలిన దరఖాస్తులను వివిధ శాఖలకు పంపి, వాటిని పరిశీలించిన తర్వాత తిరిగి తమ దృష్టికి తీసుకురావాలని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో సాధారణ పరిపాలన అధికారులు దరఖాస్తులు సంబంధిత శాఖలకు పంపించారు. కాగా గత ప్రభుత్వం కొత్తగా ఏర్పాటు చేసిన జిల్లాలు, జోన్లు, మల్టీ జోన్లకు ఉద్యోగాలను సర్దుబాటు చేసేందుకు 2021, డిసెంబరు 6న 317 జిఓ జారీ చేసింది. ఈ జిఓ ప్రకారం ఉద్యోగులు కొత్తగా ఏర్పడిన జిల్లాలు, జోన్లు, మల్టీ జోన్లలో తాము కోరుకున్న చోటుకు వెళ్లేందుకు ఆప్షను ఎంచుకునే వీలు కల్పించింది. అయితే పోస్టింగ్ విషయంలో సీనియార్టీకి ప్రాధాన్యత ఇవ్వడం వివాదాస్పదమైంది. సీనియర్లు డిమాండ్ ఉన్న చోటుకు వెళ్తే మిగిలిన వారికి అవకాశం ఉండదు. దాంతో సొంత జిల్లాలకు చెందిన వారైనప్పటికీ, కోరుకున్న ప్రాంతంలో పోస్టింగ్ లభించదు. ఫలితంగా ఉద్యోగుల ప్రమోషన్లు, పే స్కేల్స్ వంటి వాటిపై తీవ్ర ప్రభావం చూపనుంది. దాంతో ప్రభుత్వ ఉద్యోగులు 317 జిఓను తీవ్రంగా వ్యతిరేకించారు. దీంతో దీనిపై ఫోకస్ పెట్టిన కాంగ్రెస్ సర్కార్ ఈ జిఓపై మంత్రివర్గ ఉప సంఘాన్ని ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టింది.

# ప్రభుత్వ సంస్థలతోనే ప్రజాసంక్షేమం సాధ్యం

## విద్యుత్ సంస్థలను ప్రైవేట్‌కు అప్పగిస్తే కేంద్రంపై పోరాటం

### విద్యుత్ ఉద్యోగుల ఆత్మీయ సభలో ఎంపి మల్లు రవి



**హైరదాబాద్, జులై 13, ప్రభాతవార్త:** ప్రభుత్వసంస్థలున్నప్పుడే ప్రజా సంక్షేమమే సాధ్యమని రైతులకు ఉచిత కరెంట్,గృహజ్యోతి లబ్దిదారులకు 200 యూనిట్లు ఉచిత విద్యుత్ కాంగ్రెస్‌తోనే సాధ్యమవుతుందని ఎంపి మల్లురవి అన్నారు. కేంద్రం విద్యుత్ సంస్థలను ప్రైవేట్‌కు అప్పగిస్తే ఊరుకోమని ఉద్యోగులు కేంద్ర ప్రభుత్వంపై ఎలాంటి పోరాటాలు చేసిన అండగా నిలుస్తామన్నారు. తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ 1104 యూనియన్ ఆధ్వర్యంలో శనివారం ఖైరతాబాద్ మింట్‌కాంపౌండ్‌లోని 1104 కార్యాలయంలో మల్లురవికి ఆత్మీయ సన్మానసభ నిర్వహించి సత్కరించారు. ఈసందర్భంగా మల్లురవి మాట్లాడుతూ కార్మికుల సంక్షేమమే లక్ష్యంగా 70ఏళ్లుగా పనిచేస్తున్న ఏకైక యూనియన్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ 1104 యూనియన్ అన్నారు. పరిస్థితులకు అనుగునంగా మారినప్పుడే ప్రజల్లో గుర్తింపు ఉంటుందన్నారు. అదేవిధంగా యూనియన్లు కార్మికుల సమస్యలపై పోరాడితే వారే అండగా నిలుస్తారన్నారు. ప్రభుత్వాలు మారినా ప్రభుత్వ సంస్థలు మారవని ..ఏప్రభుత్వాలు వచ్చినా కార్మికుల సమస్యల పరిష్కారమే ఎజెండాగా యూనియన్లు పనిచేయాలన్నారు.

**పదోన్నతులు కల్పించిన తర్వాతే బదలీలు చేపట్టాలి : జి.సాయిబాబా**

విద్యుత్ సంస్థల్లో ఉద్యోగులకు పదోన్నతులు కల్పించిన తర్వాతే బదిలీలు చేపట్టాలని తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.సాయిబాబా డిమాండ్ చేశారు. మార్చిలోనే ఈఅంశాన్ని సిఈసి మీటింగ్‌లో పెట్టినా ఇప్పటివరకు యాజమాన్యం నుంచి ఎలాంటి ప్రకటన రాలేదన్నారు. 5ఏళ్లుగా ప్రమోషన్లు పెండింగ్‌లో ఉన్నాయని, ఈమార్చి నుంచి ఉద్యోగుల పదవివిరమణ ప్రారంభం కావడం ఉద్యోగులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ప్రభుత్వంతో ముందుగా చర్చల ద్వారానే సమస్యలు పరిష్కరించుకునే ప్రయత్నాలు చేస్తామని అప్పటికీ స్పందించకపోతే ఆందోళన చేపడతామన్నారు.

# ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల డిమాండ్లను పరిష్కరించాలి

## ఎంపిలు, ఆర్.కృష్ణయ్య, ఈటల డిమాండ్

**హైదరాబాద్, జులై 13, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ సంస్థల్లో 2లక్షలకుపైగా ఉన్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఎంపిలు, ఆర్.కృష్ణయ్య ఈటెల రాజేందర్‌లు డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రౌండ్‌టేబుల్ సమావేశానికి వారు హాజరై ప్రసంగించారు. ముందుగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ సమానపనికి సమాన వేతనం ఇవ్వాలని ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల కోసం ఏళ్లుగా పోరాటం చేస్తున్నామన్నారు. సిఎం రేవంత్‌రెడ్డి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల భాదలను గుర్తించి వారిని కాంట్రాక్టు ఉద్యోగులుగా మార్చి కనీసం 25వేల జీతం ఇవ్వాలన్నారు. గతంతో ఇదేఅంశంపై పార్లమెంట్‌లో సైతం ప్రస్తావించానని తెలిపారు. కావున ఉద్యోగులకు ఉద్యోగభద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈటెల రాజేందర్ మాట్లాడుతూ ప్రభుత్వం కార్యాలయాల్లో లక్షల జీతాలు తీసుకుంటున్న ఆఫీసర్లు చేయని పనులను ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు చేస్తారన్నారు.కావున వారికి ఉద్యోగ భద్రత అవసరమన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల్లాగానే వీళ్ల కుటుంబసభ్యులకు ఏదైనా ఆరోగ్యపరమైన సమస్య వస్తే వారికి హెల్త్‌కార్డులు ఇవ్వాలన్నారు. అలాగే ఆటో మెటిక్ రెన్యూవల్, పిఆర్‌సి వంటివి వర్తింపచేయాలన్నారు. అంతేకాకుండా డిపార్ట్‌మెంట్‌లు ఏజెన్సీలతో సంబంధం లేకుండా వారికి నేరుగా జీతాలు ఇవ్వాలన్నారు.

# కాంగ్రెస్ అధికారంలోకొచ్చి ఆర్నెల్లయినా ఆరు గ్యారెంటీలు అమలు కాలేదు

## ఎక్స్(ట్విటర్)లో మెదక్ ఎంపి రఘునందన్‌రావు

**హైదరాబాద్, జులై 13, ప్రభాతవార్త:** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలు పూర్తయినా ఆరు గ్యారెంటీలు అమలు కాలేదని మెదక్ ఎంపి రఘునందన్‌రావు విమర్శించారు. ఈ మేరకు ట్వీట్ చేశారు. ఇవి గుర్తుకు ఉన్నాయయా ఎవరికైనా? రాష్ట్ర ప్రజలు లైనులో నిలబడి ఫామ్ నింపి ఆరు నెలలు అయిందన్నారు. కానీ ఆరు గ్యారెంటీలు మాత్రం అమలు కాలేద న్నారు. పార్టీ ఫిరాయింపుల మీద ఉన్న శ్రద్ధ ఇచ్చిన హామీల మీద లేకపోయే ఇదేనా తెలంగాణ ప్రజాపాలన అంటూ ప్రశ్నించారు.

# ప్రపంచంలో అన్నింటికంటే ఎక్కువ రాజ్‌తరుణ్

## వస్తాడన్న నమ్మకంతో పోరాటం చేస్తున్నా

### నా ప్రేమ నిజమైతే వస్తాడు..: లావణ్య



**హైదరాబాద్ (బేగంపేట) జులై 13, ప్రభాతవార్త :** నాకీ ప్రపంచంలో అన్నింటికంటే ఎక్కువ రాజ్‌తరుణ్. వస్తాడో రాడో తెలియదు. వస్తాడన్న నమ్మకంతో పోరాటం చేస్తున్నాను. నా ప్రేమ నిజమైతే వస్తాడు అంటూ లావణ్య మీడియా సమావేశంలో వెల్లడించారు. రాజ్‌తరుణ్, లావణ్య వివాదంలో ఎప్పటికప్పుడు కొత్త ట్విస్టులు చోటు చేసుకుంటున్నాయి. ఈ వివాదంలో లావణ్య తరఫున లాయర్ పోరాటం చేయడానికి రెడీ అయ్యారు. లావణ్య కూడా లాయర్‌తో కలిసి మీడియా ముందుకొచ్చి, తర్వాత పోలీసులకు సాక్ష్యాలు సమర్పించింది.

మాల్వీ మల్హోత్రా వల్లే ఇదంతా చేస్తున్నారు. వాళ్లిద్దరూ మాట్లాడుకుంటు న్నా రు. రాజ్ ప్రస్తుతం మాల్వీ సొంతూరైన మండీలో ఉన్నా డని సమాచారం వచ్చింది. ఆమె వల్లే నన్ను వద్దంటు న్నాడు. రాజ్‌కు మేము ఒక్కసారిగా రూ 70లక్షలు ఇవ్వలేదు. మాది సుమారు పదకొండేళ్ల రిలేషన్. ఇప్పటి వరకూ ఆ మొత్తాన్ని నేను ఇచ్చా. రాజ్ చెడ్డ వాడని నేను అనలేదు. ఇప్పుడు దూరం పెడుతున్నాడనే పోలీసులకు ఫిర్యాదు చేసాను. నా గురించి తప్పుగా మాట్లాడిన తర్వాతే అతడి విషయాలు బయటపెట్టా. వీటిన్నింటికీ ఆధారాలున్నాయి. ఆమె తండ్రి మాట్లాడుతూ.. రాజ్ షూటింగ్స్‌తో బిజీగా ఉండేవాడు. వర్క్‌లైఫ్‌ను దృష్టిలో ఉంచుకుని వీలు కుదిరినపుడు ఫోన్‌లో మాట్లాడేవాళ్లం. బంధుమిత్రుల సమక్షంలో ఘనంగా పెళ్లి చేయాలను కున్నాం. కానీ అతడు విషయాన్ని సాగదీస్తూ వచ్చాడని తెలిపారు. ఆమె తరుపు న్యాయవాది ప్రెస్‌మీట్‌లో పాల్గొన్నారు. ఒకానొక సమయంలో నటి అరియానా లావణ్యకు కాల్ చేసి మాట్లాడారు. వద్దు అంటున్నా అతడి వెంట ఎందుకు పడుతున్నావు. నీ జీవితాన్ని నువ్వెందుకు చూసు కోకూడదని సలహా ఇచ్చారన్నారు. లావణ్య గోవాలో ఈవెంట్ కోసం వెళ్లగా రాజారవీంద్ర ఫోన్‌చేసి నువ్వు లేకపోతే రాజ్‌తరుణ్ గాడితప్పుతున్నాడని చెప్పడంతో ఆమె హైదరాబాద్‌కు వచ్చేసిందన్నారు. దీనికి సంబంధించిన ఆడియో క్లిప్స్ కూడా మా వద్ద ఉన్నాయన్నారు. వాటిని న్యాయస్థానానికి అందజేస్తామన్నారు. రాజ్‌తరుణ్‌ను తన కుటుంబం ఆదుకుందన్న లావణ్య రూ 70లక్షలు ఇచ్చినట్లు ఫిర్యాదులో పేర్కొంది. నటి మాల్వీ పరిచయం అయ్యాకే రాజ్ దూరమయ్యాడని ఇదే విషయాన్ని ప్రశ్నిస్తే మాల్వీతో పాటు ఆమె సోదరుడు మయాంక్ బెదిరించారని తెలిపింది.



ఉప్పల్‌లో జరిగిన వివాహిత హత్య కేసు వివరాలు వెల్లడిస్తున్న ఎసిపి ఎస్.చక్రపాణి, సిఐ ఎలక్షన్‌రెడ్డి తదితరులు

# మహిళ హత్యకు దారితీసిన టిక్‌టాక్ విడియోలు!

## 12 గంటలో నిందితుడి పట్టివేత

**హైదరాబాద్ (ఉప్పల్), జులై 13, ప్రభాతవార్త :** ఉప్పల్‌లో శుక్రవారం హత్యకు గురైన ఒడిశా మహిళ హత్య కేసును రాచకొండ పోలీసులు చేధించారు. భార్య టిక్‌టాక్ విడియోలు తీసి సోషల్ మీడియాలో పెట్టడం, భర్తను సరిగ్గా పట్టించుకోకపోవడంతోనే ఆమెను హత్య చేసినట్లు నిందితుడి అంగీకరించాడు. శనివారం ఉప్పల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎసిపి ఎస్.చక్రపాణి, సిఐ ఎలక్షన్‌రెడ్డి హత్య కేసు వివరాలు వెల్లడించారు. ఒడిశాలోని కేంద్రపర మండలం, అయాబా గ్రామానికి చెందిన నప్రదీప్‌బోలా ఉప్పల్‌లోని కోణార్క్ టిపిన్ సెంటర్‌లో వంట మాస్టర్‌గా చేరినట్లు తెలిపారు. డ్యూటీ నుంచి ఇంటికి వచ్చిన భర్తను మధుస్మిత పట్టించుకోకపోవడం, టిక్‌టాక్ విడియోలు చేసి సోషల్ మీడియాలో పెట్టడంతో పలుమార్లు మందలించినా ఉపయోగం లేకపోయింది. గత ఆదివారం భార్యభర్తల మధ్య గొడవ జరిగిందని, దీంతో రోటిమేకర్ బండతో తలపై కొట్టడంతో అపస్మార కస్థితిలోకి చేరినట్లు తెలిపారు. అనంతరం ఆమెను చున్నీతో ఉరివేసి హత్య చేసి గోనె సంచిలో కుక్కి బాత్‌రూమ్‌లో పెట్టినట్లు తెలిపారు. నిందితుడు పనిచేసిన టిపిన్ సెంటర్ నిర్వహకుడు ఇచ్చిన సమాచారం ఆధారంగా బేగంపేటలో నిందితుడిని పట్టుకున్నట్లు తెలిపారు. నిందితుడిని 12 గంటలలోనే పట్టుకున్న సిఐ ఎలక్షన్‌రెడ్డి, సిఐ మన్మదకుమార్‌లను అధికారులు అభినందించారు. ఉప్పల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# ఉద్యోగాల పేరిట అభ్యర్థుల నెత్తిన శఠగోపం

**కోట్లల్లో వసూలు చేసి నమ్మించి మోసగించిన సంస్థ**

**సంస్థ ఎండి కిడ్నాప్‌కు యత్నం**

**రూ.20 కోట్లు పైనే వసూలు చేశారని ఫిర్యాదులు**

**హైదరాబాద్ (పంజగుట్ట), జూలై 13 ప్రభాతవార్త:** నిరుద్యోగుల ఆశను ఆసరగా చేసుకుని కోట్లాది రూపాయలు వసూలు చేసి వారికి జీతాలు ఇవ్వకుండా చేతులెత్తేయడంతో బాధితులు జూబ్లీ హిల్స్ పోలీసులను ఆశ్రయించారు. మోసపోయిన బాధితులు తెలిపిన వివరాల ప్రకారం జూబీ హిల్స్‌కు చెందిన వాకాటి రవి చంద్రారెడ్డి గత ఏడాది నవంబర్‌లో గచ్చిబౌలిలోని ఆర్బిట్‌లో లెజై సాఫ్ట్‌వేర్ సంస్థను ఏర్పాటు చేశారు. ఆయనే ఆ సంస్థకు సీఈఓగా ఉన్నారు. కొత్త ప్రాజెక్ట్ వచ్చిందని చెప్పి జనవరి నెలలో బ్యాక్‌డోర్‌లో ఉద్యోగులను తీసుకున్నారు. వీరి వద్ద నుండి రెండు నుండి మూడు లక్షల వరకు వసూలు చేశారని బాధితులు వివరించారు. వీరి మాటలు నమ్మిన నిరు ద్యోగులు పెద్ద ఎత్తున డబ్బులు చెల్లించి రవిచంద్రారెడ్డి కంపెనీలో ఉద్యోగులుగా చేరారు. దాదాపు 1200 మంది ఉద్యోగులు ఈ కంపెనీకి డబ్బులు చెల్లించినట్లు జూబ్లీహిల్స్ పోలీసు స్టేషన్ వద్ద పలువురు నిరుద్యోగులు వాపోయారు. మొదట్లో కొంతమేర కంపెనీ యధావిధిగా నడిచినా తర్వాత నుండి జీతాలు ఇవ్వకుండా ఉద్యోగులను కంపెనీ యాజమాన్యం కాలయాపన చేస్తూ వచ్చింది. అనుమానం వచ్చిన కొందరు ఆ కంపెనీ ఉద్యోగులు జగదీష్, గౌతమ్, శివ, సుజీత్, ఆజాద్, మల్లేష్, ప్రవీణ్ తదితరులు రవిచంద్రారెడ్డిని తమతో బలవంతంగా తీసుకుపోయారు. దీంతో రవిచంద్రారెడ్డి తల్లి ఈ విషయమై జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు, జూబ్లీహిల్స్ పోలీసులు ఈ కేసును కిడ్నాప్ కేసుగా నమోదు చేసుకుని సెల్‌ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా నాగర్‌కర్నూల్ సమీపంలో ఓ హోటల్‌లో వీరంతా ఉండగా పోలీసులు దాడి చేసి రామ చంద్రారెడ్డిని విడిపించి బంధించిన ఉద్యోగులను అదుపులోకి తీసుకుని వారిపై కిడ్నాప్ కేసు నమోదు చేశారు. విషయం తెలియడంతో శనివారం రవిచంద్రారెడ్డికి డబ్బులు కట్టిన ఉద్యోగులు పెద్ద ఎత్తున జూబ్లీహిల్స్ పోలీసు స్టేషన్‌కు తరలివచ్చి తమకు న్యాయం చేయాలని పోలీసులను వేడుకున్నారు. కాగా రవిచంద్రారెడ్డి కంపెనీలో డబ్బులు చెల్లించడానికి జాగృతి కన్సల్టెన్సీ సంస్థ అభ్యర్థులకు మంచి ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మబలికినట్లు పోలీసులు అంటున్నారు. జాగృతి సంస్థ నిర్వాహకుడు నగరంలో పేరుపొందిన లెక్చరర్. ఈయన తన వద్ద విద్య నేర్చుకున్న విద్యార్థులకు సమాచారం ఇచ్చి రెండు లక్షలు కడితే మీ జీవితాలు సెటిల్ అవుతాయని చెప్పడంతో జాగృతి కంపెనీ ద్వారా 1200 మంది ఆ కంపెనీకి దాదాపు 24 కోట్ల రూపాయలు చెల్లించి వారంతా ఉద్యోగంలో చేరారు. ఈ మొత్తం ఎపిసోడ్‌లో వాకాటి రవిచంద్రారెడ్డి, జగదీష్, వెంకట్ అనే వ్యక్తుల ప్రమేయం ఉన్నట్లు పోలీసులు ప్రాథమిక విచారణలో గుర్తించారు. మోసపోయిన వారు కడుపుమండి సీఈఓను కిడ్నాప్ చేయడంతో నిన్నటివరకు కిడ్నాప్ కేసుగానే పోలీసులు గుర్తించారు. శనివారం విషయం తెలుసుకుని ఒక్కసారిగా మోసపోయిన వారంతా పోలీసు స్టేషన్ వద్దకు తరలిరావడంతో కేసు కీలక మలుపు తిరిగింది. ఈ విషయంలో పోలీసుల పాత్ర ఎలా ఉండబోతుందన్నది ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. ఇప్పటికైతే బాధితులు కొందరు నిందితులుగా ఉన్నారు. ప్రభుత్వం ఈ విషయంలో సమగ్ర విచారణ జరిపి మోసపోయిన నిరుద్యోగులకు న్యాయం చేసి, నమ్మించి మోసం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు నిరుద్యోగుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



**మియాపూర్ ఇస్కాన్ ఆధ్వర్యంలో వైభవంగా జగన్నాథ రథయాత్ర**

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,జులై13:** మియాపూర్ ఇస్కాన్ ఆధ్వర్యంలో శ్రీజగన్నాథ రథ యాత్ర అంగరంగ వైభవంగా శనివారం జరిగింది. హైదరాబాద్ చందానగర్ నుంచి ప్రారంభమైన రథయాత్ర హరినామ సంకీర్తనలు, భజనలు,మహిళల కోలాటాల మధ్య,జై జగన్నాథ..జైజగన్నాథ అంటూ భక్తుల కేరింతల మధ్య కోలాహలంగా ముందుకు సాగింది. ఇస్కాన్ ముఖ్య ప్రభుజీలు,ప్రవచనకారులు తొలుత జగన్నాతునికి సంప్రదాయబద్ధంగా పూజలు చేసి హారతులిచ్చి లాంచనంగా రథయాత్ర ప్రారంభించారు. మదీనగూడ,ఆల్విన్‌క్రాస్ రోడ్, మియాపూర్ క్రాస్‌రోడ్, జేపీనగర్ పురవీధుల గుండా కొనసాగి విశ్వనాథ్ గార్డెన్ వద్ద ముగిసింది. భక్తుల సౌకర్యం కోసం అల్పాహారం, మంచినీరు అందించారు. భక్తులు ఉత్సాహంగా రథాన్ని తాడుతో లాగుతుండగా, మరోవైపు చీపురుతో శుభ్రం చేస్తూ అత్యంత ఉత్సాహంగా సాగింది. ఇస్కాన్ కమ్యూనికేషన్ డైరెక్టర్, న్యూఢిల్లీ యుదిష్టర్ గోవింద్ దాస్, ముంబై టెంపుల్ అధ్యక్షులు రేవతి రమణదాస్, మియాపూర్ టెంపుల్ అధ్యక్షులు శ్రీరామదాస్, స్థానిక ప్రజాప్రతినిధులు రవికుమార్ యాదవ్, సంపత్, విష్ణువర్ధన్ యాదవ్,గోపరాజు శ్రీనివాస్, ఇస్కాన్ సభ్యులు దేవిశెట్టి శ్రీనివాస్, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# సమాజంలో స్వేచ్ఛ,సమానత్వం విద్యతోనే సాధ్యం

**రాష్ట్ర సాంస్కృతిక, యువజన సర్వీసులశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు**



శనివారం హైదరాబాద్‌లో సభలో ప్రసంగిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

**హైదరాబాద్ (రవీంద్రభారతి), జులై 13 ప్రభాతవార్త :** సమాజంలో స్వేచ్ఛ సమానత్వాలు విద్యతోనే సాధ్యమవుతుందని తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక, పర్యాటక, యువజన సర్వీసులశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. శ్రీ నారాయణగురు ధర్మప్రచార సభ ఆధ్వర్యంలో రవీంద్రభారతి ప్రధాన మంది రంలో సర్వమత సమ్మేళనం, వార్షికోత్సవ వేడుకలకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన మంత్రి కృష్ణారావు కేరళకు చెందిన ప్రముఖ ఆధ్యాత్మిక గురువు, సంఘ సంస్కర్త శ్రీ నారాయణగురు విగ్రహానికి పుష్పాంజలర్పించి ప్రసంగించారు. సమాజంలో మూఢనమ్మకాలు, విశ్వాసాలను, కులతత్వాన్ని నిరసిస్తూ కులం కారణంగా కొన్నివర్గాల ప్రజలు తీవ్ర అన్యాయాలకు గురవుతున్నారని, వారికి ఆధ్యాత్మిక స్వేచ్ఛ, సామాజిక స్వాతంత్రం ఉండాలని భావించిన మహోన్నతవ్యక్తి నారాయణగురు అన్నారు. ఆధ్యాత్మిక జ్ఞానం, సామాజిక మానవత్వాన్ని ప్రోత్స హించేందుకు ప్రయత్నం చేశారని, కాలానికి అనుగుణంగా మతాన్ని సంస్కరించారని ఆయన చేసిన సేవలను కొనియాడారు. నారాయణగురు ఆలోచనలకు అనుగుణంగా ప్రతీఒక్కరూ నడుచుకోవాల్సిన అవసరముందని స్పష్టం చేశారు. దశాబ్దాలు, శతాబ్దాలు గడిచినా సమాజంలో అంతరాలు తొలగిపోలేదని, ఇందుకు కారణం మనుషుల ఆలోచన ధోరణి, ప్రభుత్వాలే కారణమని వ్యవస్థలోని లోపాలను ఎత్తిచూపారు. మనిషి తననుతాను సంస్కరించుకుని సమాజాన్ని సంస్కరించడమే చదువు యొక్క అర్థం పరమార్థమని, నేటి విద్యావ్యవస్థలో అది లోపించిందని, చదివేస్తే ఉన్నమతి పోయిందన్న చందంలా తయారైందని ఆవేదన వ్యక్తపరిచారు. నేటి సమాజంలో నేరాలు, ఘోరాలు పెరిగిపోతున్నాయని, యువత ఆలోచనా ధోరణిలో మార్పు రావాల్సిన అవసరం ఉందని, వారిని సన్మార్గంలో నడపాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందని మంత్రి అన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ బిసి కమిషన్ మాజీ ఛైర్మన్ జస్టిస్ ఈశ్వరయ్య, డా. జయప్రకాష్ నారాయణ, మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్, శ్రీ నారాయణగురు ధర్మప్రచారసభ అధ్యక్షుడు సాయిబాబాగౌడ్, ప్రధాన కార్యదర్శి ఉపేందర్, ఉపాధ్యక్షులు మురళీ మనోహర్, చెన్నయ్య, కోశాధికారి జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

## కాంబోడియా కేంద్రంగా సైబర్ నేరాలు

**భారతీయులను పంపిస్తున్న కీలక నేరగాడు షాదాబ్ ఆలం అరెస్టు**

**హైదరాబాద్, జులై 13, ప్రభాతవార్త:** సైబర్ నేరాలకు కేరాఫ్‌గా వున్న కాంబోడియా దేశంలో సాగుతున్న అడ్డగోలు కార్యకలాపాలలో కీలకంగా వ్యవహరించిన షాదాబ్ ఆలం అనే నేరగాడిని సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు ఢిల్లీలో అరెస్టు చేశారు. కొంతకాలంగా దుబాయ్‌లో వుంటున్న ఆలం చైనా దేశానికి చెందిన సైబర్ నేరగాళ్లతో చేతులు కలిపి దేశ వ్యాప్తంగా అనేక నగరాలకు చెందిన యువతీ, యువకులను విదేశీ ఉద్యోగాల పేరిట కాంబోడియాకు పంపి, వారిచేత బలవంతంగా భారతీయులను టార్గెట్ చేసి సైబర్ నేరాలను చేయిస్తున్నట్లు ఇటీవలే వెలుగు చూడడం తెలిసిందే. ఆలంను నమ్మి మోసపోయిన సిరిసిల్లకు చెందిన ఓ బాధితుడు కాంబోడియాలోని భారత రాయబార కార్యాలయ అధికారుల సహకారంతో గత మే నెలలో భారత్‌కు వచ్చాడు. అనంతరం అతను సిరిసిల్లలో ఆలంపై ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదయ్యింది. ఈ కేసును సైబర్ సెక్యూరిటీ బ్యూరో విభాగానికి బదలీ అయ్యింది. దీనిపై విచారణ చేబట్టిన సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు ఆలం కోసం నిఘా వుంచగా అతను ఢిల్లీ వస్తున్నట్లు సమాచారం సేకరించారు. ఈ సమాచారం ఆధారంగా ఆలంను శనవారం ఢిల్లీ విమానాశ్రయంలో అరెస్టు చేసి హై దరాబాద్‌కు తరలించి, ఇక్కడి కోర్టులో హాజరు పరిచారు. అనంతరం న్యాయమూర్తి ఆదేశాల మేరకు అతన్ని రెండు వారాల రిమాండు నిమిత్తం చంచల్‌గూడ జైలుకు తరలించారు. కాగా ఆలం ఇప్పటి వరకు భారత్‌కు చెందిన వెయ్యి మంది యువతీ, యువకులను కాంబోడియా దేశానికి పంపాడని సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు భావిస్తున్నారు. ఈ కేసులో మరింత సమాచారం కోసం ఆలంను వారం రోజుల కస్టడీకి ఇవ్వాలని సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు కోర్టులో పిటిషన్ దాఖలు చేయనున్నారు.

## చిన్నారిని కిడ్నాప్ చేసిన ముగ్గురు అరెస్ట్

**చార్మినార్,జూలై 13 ప్రభాతవార్త :** నెల్లూరుకు చెందిన ఓ మహిళను మాయమాటలతో నగరంలో నర్సు ఉద్యోగం ఇప్పిస్తామని నమ్మించి పాతబస్తీకి చేరుకున్నతర్వాత బాధితురాలి ఆరు నెలల బాలుడిని కిడ్నాప్ చేసిన నింధితులను మీర్‌చౌక్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.దక్షిణ మండలం డిసిపి స్నేహ మెహ్రా కథనం ప్రకారం ఎపిలోని నెల్లూరు జిల్లా దర్గాకు ప్రాంతానికి చెందిన హబీబున్నీషా బేగంకు పటాన్‌చెరువు ప్రాంతానికి చెందిన నస్రీన్ బేగం (28),నూర్జాహాన్ బేగం (20) మహ్మద్ ఆదిలు పరిచయం అయ్యారు.నస్రీన్ బేగంకు పిల్లలు లేరు.దీంతో నస్రీన్ బేగం తన చెల్లెలైన పఠాన్ చెరువుకు చెందిన నూర్జాహాన్ బేగం (20) ఆమె మరిది మహ్మద్ ఆదిల్ కలిసి హబీబున్నీషాకు హైదరాబాద్‌లో ఉద్యోగం ఇప్పిస్తా మని వారు నమ్మ పలికారు.నెల్లూరు నుంచి ముగ్గురుహబీబున్నీషాను తీసుకుని నగరానికి వచ్చారు.10వ తేదీన ఎంజిబిఎస్‌లో బస్సు దిగిన అనంతరం నిందితులు హబీబున్నీషాను వాష్ రూమ్‌కు పంపించారు.అదే సమయంలో అక్కడ ఉన్న హబీబ్‌ఉన్నీషా బేగంకు చెందిన ఆరు నెలల బాలుడిని నిందితులు తీసుకుని వెళ్లి పోయారు. ఈ విషయాన్ని హబీబున్నీషా బేగం మీర్‌చౌక్ పోలీసులకు ఫిర్యాదు చేసింది.కాగా పోలీసులు నిందితుల వద్ద నుంచి ఆరు నెలల బాలుడిని స్వాధీనం చేసుకుని తిరిగి తల్లి హబీబున్నీషా బేగంకు అప్పగించారు.ముగ్గురు నింధితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.ఈ కేసును మీర్‌చౌక్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# గవర్నర్ కుమారుడు నాపై దాడి చేశాడు..

**రాజ్‌భవన్ ఉద్యోగి బైకుంఠ ప్రధాన్**



జులై 7,8 తేదీల్లో రాజ్‌భవన్‌కు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పర్యటన సందర్భంగా ఏర్పాట్లు చేస్తుండగా ఓ వంట మనిషి తన వద్దకు వచ్చి గవర్నర్ కుమారుడు లలిత్‌కుమార్ పిలుస్తున్నట్లుగా తెలిపాడన్నారు. దీంతో తాను లలిత్‌కుమార్ గదికి వెళ్లానన్నారు. గదిలో అయిదుగురు

**భువనేశ్వర్, జులై 13:** గవర్నర్ కుమారుడు తనపై దాడి చేశాడని రాజ్‌భవన్‌లోని ఓ ఉద్యోగి ఫిర్యాదు చేసిన ఘటన ఒడిశాలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఒడిశా, పూరీలోని రాజ్‌భవన్ ఉద్యోగి తనపై గవర్నర్ రఘుబర్‌దాస్ కుమారుడు, అతడి స్నేహితులు దాడి చేశారని ఆరోపించారు. అయితే ఈ ఘటనపై రాజ్‌భవన్ ఎటువంటి అధికారిక ప్రకటన చేయలేదు. తాను రాజ్‌భవన్‌లో అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్‌గా విధులు నిర్వర్తిస్తున్నట్లుగా బాధితుడు బైకుంఠ ప్రధాన తన ఫిర్యాదులో పేర్కొన్నారు. స్నేహితులతో ఉన్న ఆయన తనను దుర్భాషలాడుతూ, తీవ్రంగా కొట్టాడని పేర్కొన్నారు. వారంతా కలిసి తనను రాత్రి 11 గంటల నుంచి తెల్లవారుఝాము 4.30వరకు కొడుతూనే ఉన్నారని ఫిర్యాదు చేశారు. వారి నుంచి తప్పించుకుని మరో గదిలోకి వెళితే లలిత్‌కుమార్ భద్రతా అధికారులు తనని బలవంతంగా వెనక్కి తీసుకువచ్చారని వివరించారు. నిన్ను హత్య చేసినా ఎవరూ రక్షించేవారు లేరంటూ లలిత్ కుమార్ బెదిరించాడని బాధితుడు ఆరోపించాడు. బైకుంఠ ప్రధాన్ భార్య సయోజ్ ప్రధాన్ మాట్లా డుతూ తన భర్తపై దాడికి పాల్పడిన నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమండ్ చేశారు. ఆమె ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడతామని పోలీసులు పేర్కొన్నారు.

## ఇటలీలో భారతకార్మికులకు వెట్టిచాకిరీనుంచి విముక్తి





**రోమ్, జులై 13:** ఇటలీలో అత్యంత దయనీయంగా నివసిస్తున్న 33 మంది భారత కార్మికులను వెట్టిచాకిరీనుంచి ఇటలీపోలీసులు విముక్తి కల్పించారు. వెరోనా ప్రావిన్స్‌లో వారిచేత చాకిరీ చేయించుకుంటున్న ఇద్దరు వ్యక్తులనుంచి 5,45,300 యూరోలను అంటే సుమారుగా 45 లక్షల విలువైన కరెన్సీని కూడా స్వాధీనంచేసుకున్నట్లు వివరించారు. ఇటలీపోలీసుల వివరాలను బట్టి ఈముఠా ఇండియానుంచి సీజనల్‌వర్క్ పర్మిట్‌తో ఇక్కడి వ్యవసాయ కార్మికులను తెచ్చుకుంటారు. వారికి మంచి ఉపాధి చూపిస్తామని చెప్పి 17వేలయూరోలు అంటే 15 లక్షలుక ట్టమని చెపుతారు. వారిని ఏడురోజులు రోజుకు 10 నుంచి 12 గంటలు పనిచేయిస్తారు. ఒక్కో గంటకు నాలుగు యూరోలు ఇస్తామని ఒప్పందం చేయించుకుంటారు. కానీ అలా కార్మికులతో బానిస పనులు చేయించుకుంటారు. మరికొంత సొమ్ములిస్తే శాశ్వత వర్క్ పర్మిట్ ఇస్తామని నమ్మిస్తారని, కానీ అదికూడా ఎప్పటికీ ఇవ్వరని బాధిత కార్మికులు ఈ ముఠా సభ్యులు ఇటలీలో భద్రత ఉపాధి అవకాశాలు చట్టబద్ధమైన నివాసపత్రాలు అందిస్తామనిమోసం చేస్తూ బానిసత్వంలోకి దించుతున్నట్లు ఇటలీపోలీసులు తెలిపారు. ఇతరయూరోపియన్ దేశాలతో పోలిస్తే ఇటలీలో తీవ్రమైన కార్మికుల కొరత నెలకొన్నది. దీనితో ఇక్కడికి పనిచేయడానికి వచ్చే వారికి కొన్ని ముఠాలు తక్కువ వేతనంతో ఇతర దేశాల వ్యవసాయ కార్మికులను మోసం చేస్తారని, లేబర్ చట్టాల ఉల్లంఘనలు ఇటలీలో మరింత ఎక్కువని బాధితులు చెపుతున్నారు.

## ప్రభుత్వ గొర్రెలకు బ్రేక్

**సొమ్ము రిఫండ్ కోసం రూ.196 కోట్లు విడుదల**

**హైదరాబాద్, జూలై 13, ప్రభాతవార్త:** గత బిఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన గొర్రెల పంపిణీ పథకానికి బ్రేక్ పడింది. యూనిట్లు మంజూరైన వారి నుండి డీడీల రూపంలో సేకరించిన సొమ్మును తిరిగి వెనక్కి ఇచ్చేయాలని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు సుమారు 45వేల డిడిలను సంబంధిత గొల్ల, కురుమలకు తిరిగి ఇచ్చేందుకు వీలుగా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అంతేకాకుండా ఇందుకు గాను 196 కోట్ల రూపాయలను విడుదల చేయాలని అధికారులను ఆదేశించింది. కాగా ప్రభుత్వ గొర్రెలు వస్తాయనే ఆశతో అందిన కాడల్లా అప్పులు చేసి తమ వాటా సొమ్మును చెల్లించిన లబ్దిదారుల పరిస్థితి ప్రస్తుతం దయనీయంగా తయారైంది. గొర్రెల రాక, తాము కట్టిన సొమ్ము బ్యాంకుల్లో స్థంభించిపోవడంతో గొల్ల, కురుమలు ఆందోళన చెందుతున్నారు. ఈ విధంగా తెలంగాణ వ్యప్తంగా దాదాపు 85 వేల మంది రెంటికీ చెడిన రేవడిలా తయారైంది. మరోపక్క తెచ్చిన అప్పులకు వడ్డీలు పెరిగిపోతున్నాయని ఆందోళన చెందుతున్నారు. గత కేసీఆర్ ప్రభుత్వ హయంలో గొల్లలు, కురుమలకు సబ్సిడీపై 21 గొర్రెలు (యూనిట్) పంపిణీ పథకాన్ని చేపట్టారు. యూనిట్ ధర 1.75 లక్షల రూపాయల్లో ప్రభుత్వ వాటాగా 1,31,250 రూపాయలు భరించగా, లబ్దిదారుని బాటా కింద ఒక్కొక్కరూ 43,750 రూపాయల మొత్తాన్ని డిడిలు తీసి చెల్లించారు. సుమారు 32 వేల మందికి అప్పటి ప్రభుత్వం సబ్సిడీ గొర్రెలను పంపిణీ చేసినా తదుపరి దీన్ని అమలు చేయడంలో జాప్యం చేసింది. ఎన్నికల ముందు మళ్లీ అమలు చేసేందుకు యత్నం చేసినా అది సాధ్యం కాలేదు. తాజాగా గొర్రెల పంపిణీపై ప్రభుత్వం కూడా ఏమీ స్పందించకపోగా, తాము కట్టిన సొమ్ములన్నీ బ్యాంకుల్లో నిలిచిపోవడంతో లబ్దిదారులు ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో తాజాగా ప్రభుత్వం డీడీల సొమ్మును తిరిగి ఇచ్చేందుకు నిర్ణయం తీసుకుంది.

# ఎపిలో 37 మంది ఐపిఎస్‌ల బదలీ



**డిజిపి కార్యాలయానికి రిపోర్ట్ చేయాలని 9మందికి ఆదేశం**

**విజయవాడ,జూలై13,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీలో 37మంది ఐపీఎస్ అధికారులు బదిలీ అయ్యారు. వారిలో 9మంది ఐపిఎస్‌లను డీజీపీ కార్యాలయానికి రిపోర్ట్ చేయాలని ఆదేశించారు. మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేసారు. జీవోఆర్డీనంబరు 1252 తో ఈ ఉత్తర్వులు జారీ చేసారు. కేవీ మహేశ్వరరెడ్డిని శ్రీకాకుళం జిల్లా ఎస్పీగా, వకుల్ జిందాను విజయనగరం జిల్లా ఎస్పీగా, ఎం. దీపికాను అనకాపల్లి ఎస్పీగా బదిలీ చేసారు. వి.రత్నను శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీగా,ఎస్వీ మాధవ్‌రెడ్డిని పార్వతీపురం ఎస్పీగా, విక్రాంత్ పాటిల్‌ను కాకినాడ జిల్లా ఎస్పీగా బదిలీ చేసారు.ఏపీ ఏస్పీ కాకినాడ మూడవ బెటాలియన్ కామెండెంట్‌గా పూర్తి అదనపు బాధ్యతలను విక్రాంత్ పాటిల్‌కు అప్పగించారు.ఎస్, సతీష్‌కుమార్‌ను గుంటూరు జిల్లా ఏస్పీగా, అమిత్ బర్ధర్‌ను అల్లూరు సీతారామరాజు జిల్లా ఎస్పీగా, తుహిన్ సిన్హాను విశాఖపట్టణం సీటీ డిపూటీ కమీషనర్2గా బదిలీ చేసారు. డి.నరసింహ కిశోర్‌ను ఎస్పీ ఈస్ట్ గోదావరికి బదిలీ, వి.విద్యాసాగర్‌నాయుడును ఎస్పీగా అన్న మయ్య జిల్లాకు బదిలీ అయ్యారు. బి.కృష్ణా రావును ఎస్పీగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాకు బదిలీ చేసారు.ఆర్,గంగాధర్‌రావును కృష్ణాజిల్లా ఎస్పీగా బదిలీ,అధ్నాన్ నాయిమ్ అస్మిని ఎస్పీ పశ్చిమగోదావరి జిల్లా బదిలీ, అజితా వేజెండ్లను విశాఖపట్టణం డిప్యూటీ కమీషనర్ సిటీ కమీషనర్ ఆఫ్ పోలీస్‌వన్‌గా బదిలీ అయ్యారు. కె.ప్రతాప్ శివకిశోర్‌ను ఎస్పీగా ఏలూరు జిల్లాకు బదిలీ, కె.శ్రీనివాసరావవబును పల్నాడు జిల్లా ఎస్పీగా బదిలీ,మల్లికా గార్గ్‌ను ఏపీ ఎస్పీ ఫిఫ్త్ బెటాలియన్ విజయనగరానికి బదిలీ చేసారు. ఏఆర్ దామోదర్‌ను ప్రకాశం జిల్లా ఎస్పీగా, జి.బింద మాదవ్‌ను కర్నూలు జిల్లా ఎస్పీగా బదిలీ చేసారు. జి,కృష్ణకాంత్‌ను నెల్లూరు జిల్లా ఎస్పీగా, అధికాజ్‌సింగ్ రాణాను నంద్యాల జిల్లా ఎస్పీగాను బదిలీ చేసారు.వి.హర్షవర్ధన్ రాజును కడపజిల్లా ఎస్పీగా,కెవీ మురళీకృష్ణను అనంతపురం ఎస్పీగా, గౌతమిశాలిని ఎన్టీఆర్ జిల్లా పోలీసు కమిషనరేట్ సీపీ, లా అండ్ ఆర్డర్‌వన్‌గా బదిలీ చేసారు.ఎల్ సుబ్బారాయు డును తిరుపతి ఎస్పీగా బదిలీ చేసారు.సుబ్బా రాయుడికే ఎర్రచందనం టాస్క్‌పోర్స్ ఎస్పీగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. వి.గీతికాదేవిని ఇంటలిజెన్స్ అడ్మిన్ ఎస్పీగా బదిలీ చేసారు.జీఆర్ రాధిక, డీ.మేరీ ప్రశాంతిని,కె,ఆరీఫ్ హనీఫ్, కె.రఘువీరారెడ్డి,సిద్దార్ కౌశల్, సుమిత్ సునీల్, పీ.జగదీష్, ఎస్,శ్రీధర్, ఎం,సత్తి బాబు లను డీజీపీ కార్యాలయంలో తదుపరి ఉత్తర్వులు వచ్చేవరకు రిపోర్ట్ చేయాలని ఆదేశం జారీ చేసారు.

## గౌడన్నలకు 'కాటమయ్య రక్ష'

**సేఫ్టీ కిట్ల పంపిణీ స్కీమ్‌ను నేడు ప్రారంభించనున్న సిఎం రేవంత్‌రెడ్డి**

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,జులై13:** కల్లుగీత కార్మికులకు తెలంగాణ ప్రభుత్వం గుడ్ న్యూస్ వినిపించింది. ఈదులు,తాళ్లు ఎక్కి కల్లు గీసే గౌడ సోదరుల కోసం ప్రభుత్వం 'కాటమయ్య రక్ష' కిట్లను అందించనుంది. ఈ కిట్ల పంపిణీ కార్యక్రమాన్ని అబ్దు ల్లాపూర్‌మెట్ మండలం,లష్కర్‌గూడ గ్రామంలో సిఎం రేవంత్‌రెడ్డి ఆదివారం ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమం ఉదయం 11 గంటలకు జరగనుంది. గౌడన్నలతో సమావేశం అనంతరం అక్కడే వారితో కలిసి సిఎం సహపంక్తి భోజనం చేయనున్నారు. తెలంగాణ రాష్ట్ర బీసీ కార్పొరేషన్ ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న గౌడన్నలకు కాటమయ్య రక్ష కిట్లను పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. చెట్టు ఎక్కి కల్లు గీసే క్రమంలో చాలాసార్లు ప్రమాదాల బారినపడి గీత కార్మికులు ప్రాణాలు కోల్పోతున్నారు. ఈ ప్రమాదాలను నివారించేందుకు ఆధునికతను జోడించి సేఫ్టీ కిట్లను హైదరాబాద్ ఐఐటితో కలిసి ఓ ప్రైవేటు సంస్థ తయారు చేసింది. గీత కార్మికులు సులువుగా తాళ్లు ఎక్కేలా ఈ కిట్లను రూపొందించారు. ప్రమాదవశాత్తు తాటి చెట్ల మీద నుంచి కింద పడకుండా ఈ పరికరాల్లో అత్యాధునిక టెక్నాలజీని వినియోగించారు. ఒక్కో కిట్‌లో మొత్తం 6 పరికరాలు ఉంటాయి. తాడు,క్లిప్పులు,హ్యాండిల్స్, స్లింగ్‌బ్యాగ్,లెగ్ లూప్ వంటివన్నీ వేర్వేరుగా ఉంటాయి. ప్రస్తుతం గీత కార్మికులు ఉపయోగిస్తున్న సాంప్రదాయ కిట్ల తరహాలోనే యూజర్ ఫ్రెండ్లీగా ఈ పరికరాలు ఉంటాయి.

# అంబాని ఇంట శుభ్‌ఆశీర్వాద్ వేడుకకు తరలివచ్చిన ప్రముఖులు

**ప్రధాని మోడీ, ముఖ్య మంత్రులు, బాలీవుడ్ తారాగణంతో సందడి**



**ముంబయి, జులై 13:** ప్రపంచస్థాయి అతిథులు దేశసెలబ్రిటీలు, రాజకీయ నాయకులు హాజరుకాగా పారిశ్రామిక దిగ్గజంముకేష్ అంబాని చిన్నకుమారుడు అనంత్ అంబాని రాధికామర్చంట్‌ల వివాహ వేడుక అంగరంగ వైభవంగా జరిగింది. సుమారు 1200మందికిపైగా హాజరయిన అతిథుల సమక్షంలో అనంత్ రాధిక మెడలో మూడుముళ్లువేసాడు. సినీ, రాజకీయ రంగాలకు చెందినపలువురుప్రముఖులు ఈ వేడుకలో పాల్గొన్నారు. ప్రముఖులంతా ఆడిపాడి అంబాని ఇంట వేడుకలో మరింత ఆనందోత్సాహాలను నింపారు. తమిళనటుడు రజనీకాంత్‌తోపాటు పలువురు నటులు, బాలివుడ్ నటీమణులు ఆడిపాడి అలరించారు. శుక్రవారం వివాహ మహోత్సవం పూర్తి కావడంతో శనివారం శుభ్ ఆశీర్వాద్‌ఫంక్షన్‌పేరుతో వెడ్డింగ్‌రిసెప్షన్ నిర్వహిస్తున్నారు. కళ్యాణ మహోత్సవం జరిగిన జియో వరల్డ్ కన్వెన్షన్ సెంటర్‌లోనే ఈ వెడ్డింగ్ రిసెప్షన్ కూడా జరిగింది. ఎపి ముఖ్యమంత్రి చంద్రబాబు దంపతులు, డిప్యూటి సీఎం పవన్ కళ్యాణ్, టాలివుడ్‌హీరో రామ్‌చరణ్ దంపతులు, కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తదితరులు హాజరై అనంత్ రాధిక దంపతులను ఆశీర్వ దించారు. ఈసందర్భంగా ముకేష్ అంబాని స్వయంగా తన కోడలు రాధికా మర్చంట్‌ను ఎపిసిఎం, డిప్యూటి సీఎంలకు పరిచయంచేసారు. మాజీ రాష్ట్రపతి రామ్‌నాద్‌కోవింద్‌తోపాటు ప్రధాని నరేంద్రమోడీ సైతం అంబాని ఇంట పెళ్లివే డుకకు హాజరయి వధూవరులను ఆశీర్వదించారు. మహారాష్ట్ర సీఎం ఏక్‌నాథ్‌షిండే, డిప్యూటి సిఎం ఫడ్నవిస్‌లతోపాటు అజిత్‌పవార్‌లతో చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లు ముచ్చటించారు. బ్రిటన్ మాజీ ప్రధాని టోనీ బ్లెయిర్, ఫిఫా అధ్యక్షుడు గియాన్నీ ఇన్ఫాంటినో వంటి ప్రముఖులు అంబాని ఇంట వేడుకకు హాజర య్యారు. ఇక బాలివుడ్ మొత్తం కదిలివచ్చింది. అమితాబ్ బచ్చన్, సచిన్ టెండూల్కర్; సానియా మీర్జా, షారూక్‌ఖాన్, సుహానాఖాన్, జాన్వీకపూర్, ఖుషీకపూర్; సంజయ్ దత్, సల్మాన్‌ఖాన్, రణబీర్‌కపూర్; రజనీకాంత్, మహేశ్‌బాబు, ధోనీ కెఎల్‌రాహుల్ అతియాశెట్టి, ఆహాన్‌శెట్టి, జస్‌ప్రీత్‌బుమ్రా, సూర్యకుమార్, అజయ్‌దేవగన్, సారా అలీఖాన్, హేమమాలిని, జాక్వెలిన్ ఫెర్నాండెజ్ వంటి తారలందరూ హాజరయి వధూవరులను ఆశీర్వదించారు.

## ఒడిశా రోడ్డు ప్రమాదంలో పాతబస్తీ ఉప్పుగూడకు చెందిన ముగ్గురు మృతి, పలువురికి గాయాలు

**హైదరాబాద్ (చార్మినార్),జూలై 13 ప్రభాతవార్త :** ఒరిస్సాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో హైదరాబాద్ పాతబస్తీ ఉప్పుగూడ ప్రాంతానికి చెందిన ముగ్గురు మృతిచెందారు.ఈ సంఘటన ఒరిస్సాలోని బెత్తో నటి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.పాతబస్తీ ఉప్పుగూడ ప్రాంతానికి చెందిన ఉదయ్ సింగ్ ఠాకూర్ (53),వృత్తి రీత్యా డ్రైవర్‌తో పాటు ఎజెంట్.ఉదయ్ సింగ్ తీర్ధ యాత్రల ట్రిప్‌లు చేస్తుంటాడు.ఈ నేపథ్యంలోనే హైదరాబాద్ పాతబస్తీ ఉప్పుగూడతో పాటు పలు ప్రాంతాలకు చెందిన 23 మందితో కలిసి నార్త్ ఇండియా టూర్‌కు వెళ్లారు.15రోజుల పాటు జరిగే యాత్రకు ఉప్పుగూడ శివాజీ నగర్‌కు చెందిన బస్ డ్రైవర్ ఓనర్ మల్లేష్ అనే వ్యక్తితో ఒప్పందం కుదుర్చుకున్నారు.12వ తేదీన పూరీ జగన్నాథ స్వామిని దర్శించుకుని అక్కడ నుంచి మహరాష్ట్ర వెళ్లవలసి ఉంది.శనివారం తెల్లవారు జామున 3.30గంటల సమయంలో అప్పటి వరకు బస్సు నడిపిన మల్లేష్ విశ్రాంతి తీసుకోవటంతో ఉదయ్‌సింగ్ డ్రైవింగ్ చేస్తున్నట్లు సమాచారం.బెత్తోనటి పోలీస్ పోలీస్ స్టేషన్ పరిధిలో బుడీకమర్ చెక్‌వద్ద ఆగి ఉన్న ట్రక్‌ను బస్సు ఢీ కొట్టింది. ఈసంఘటనలో డ్రైవర్ ఉదయ్ సింగ్, పాతబస్తీకి చెందిన ఉప్పలయయ్య (70), క్రాంతి భాయి(62)లు మృతి చెందారు. డ్రైవర్ మలేష్‌తో పాటు మరి కొంతమందికి గాయాలు అయ్యాయి.

# ఆగస్టు 1న 'శివం భజే'



ఇటీవల విడుదలైన ఫస్ట్ లుక్, టీజర్‌తో అందరి దృష్టిని ఆకర్షించిన గంగా ఎంటర్‌టైన్మెంట్స్ 'శివం భజే' చిత్రం ఆగస్టు 1న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్ రిలీజ్ అవ్వనున్నట్లు నిర్మాత మహేశ్వర్ రెడ్డి మూలి తెలిపారు. అప్సర్ దర్శకత్వంలో తెరకక్కనున్న ఈ న్యూఏజ్ డివైన్ సస్పెన్స్ థ్రిల్లర్ చిత్రంలో హీరో–హీరోయిన్లుగా అశ్విన్ బాబు, దిగంగనా సూర్యవంశీ నటించారు. బాలీవుడ్ నటుడు అర్బాజ్ ఖాన్, మురళీ శర్మ, తనికెళ్ల భరణి, సాయి ధీన, అయ్యప్ప శర్మ, హైపర్ ఆది, బ్రహ్మాజీ, తులసి, దేవి ప్రసాద్ వంటి నటులు ముఖ్యమైన పాత్రలు పోషించారు. ఈ సందర్భంగా చిత్ర నిర్మాత మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, 'వైవిధ్యమైన కథతో, సాంకేతిక విలువలతో మా సంస్థ గంగా ఎంటర్‌టైన్‌మెంట్స్ నిర్మాణంలో ఆగస్టు 1న విడుదలవ్వనున్న చిత్రం శివం భజే. ఫస్ట్ లుక్‌కి, టీజర్‌కి అద్భుతమైన స్పందన రావడంతో చిత్ర విజయంపై మాకున్న విశ్వాసం మరింత పెరిగింది. మా హీరో అశ్విన్ బాబు, దర్శకుడు అప్సర్, అర్బాజ్ ఖాన్, సాయి ధీనా, హైపర్ ఆది, మురళీ శర్మ, బ్రహ్మాజీ, తులసి వంటి నటులు, ఇండస్ట్రీ మేటి సాంకేతిక నిపుణుల సహకారంతో మా మొదటి చిత్రం అనుకున్నట్లుగా రూపు దిద్దుకుంది. ప్రస్తుతం నిర్మాణాంతర కార్యక్రమాలు చివరి దశలో ఉండగా, ఆగస్టు 1న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేయడానికి సిద్ధమవుతున్నాం. శివస్మరణతో మొదలైన మా చిత్రానికి ఆయన ఆశీస్సులతో అద్భుత స్పందన లభించడం చాలా ఆనందంగా ఉంది. అన్ని వర్గాల ప్రేక్షకులకు కచ్చితంగా నచ్చుతుంది. ట్రైలర్, పాటల విడుదల గురించి వివరాలు త్వరలో వెల్లడిస్తాం' అని అన్నారు. దర్శకుడు అప్సర్ మాట్లాడుతూ ఆగస్టు 1న ప్రపంచవ్యాప్తంగా విడుదలవుతూ అన్ని వర్గాల, వయసుల ప్రేక్షకులని అలరించడానికి సిద్ధంగా ఉంది మా శివం భజే. టైటిల్,టీజర్‌తో అందరి దృష్టి ఆకర్షించిన మాచిత్రంపై అన్ని భాషల ప్రేక్షకులలో మంచి అంచనాలున్నాయి. మా హీరో అశ్విన్ బాబే. ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణులు, నిర్మాత మహేశ్వర్ రెడ్డి పూర్తి సహకారంతో ఈ చిత్రం అద్భుతంగా రూపొందింది. మా పాటలు, ట్రైలర్ త్వరలో విడుదల చేస్తాం అన్నారు. హీరో అశ్విన్ బాబు మాట్లాడుతూ, మాశివం భజే టీజర్‌కి వచ్చిన అనూహ్య స్పందనకి మా అందరి విశ్వాసం అమాంతం పెరిగిపోయింది. దర్శకుడు అప్సర్ వైవిధ్యమైన కథకి తగ్గట్టుగా కావాల్సిన సాంకేతిక విలువలు, నిపుణులని ఖర్చుకి వెనకాడకుండా మా నిర్మాత మహేశ్వర్ రెడ్డి గారు సహకారం అందించడం, ప్రతి ఒక్కరు తమ కెరీర్ బెస్ట్ ఇవ్వడంతో ఈ చిత్రం మేము ఊహించిన దానికంటే అద్భుతంగా వచ్చింది అన్నారు. నటీనటులు: అశ్విన్ బాబు, అర్బాజ్ ఖాన్, దిగంగనా సూర్యవంశీ, హైపర్ ఆది, మురళీ శర్మ, సాయి ధీన, బ్రహ్మాజీ, తులసి, దేవి ప్రసాద్, అయ్యప్ప శర్మ, శకలక శంకర్, కాశీవిశ్వనాథ్, ఇనాయ సుల్తాన తదితరులు.

# 'కమిటీ కుర్రోళ్లు' నుంచి లిరికల్ సాంగ్

నిహారిక కొణిదెల సమర్పణలో పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ ఎల్ఎల్‌పి, శ్రీరాధా దామోదర్ స్టూడియోస్ బ్యానర్‌పై రూపొందిన 'కమిటీ కుర్రోళ్లు' సినిమాకు యదు వంశీ దర్శకుడు. పక్కా ప్లానింగ్‌తో మేకర్స్ అనుకున్నసమయాని కన్నా ముందే సినిమా షూటింగ్‌ను పూర్తి చేయడం ఇక్కడ విశేషం. ఇప్పటికే రిలీజ్ చేసిన టీజర్, సాంగ్స్‌కు మంచి రెస్పాన్స్ వచ్చింది. తాజాగా ఈ చిత్రం నుంచి జాతర పాటను రిలీజ్ చేశారు. సందడి సందడి అంటూ సాగే ఈ పాటను సింహాచలం మన్నెల రచించగా, అనుదీప్ దేవ్, రేణూ కుమార్, శ్రీనివాస్ దరిమిశెట్టి ఆలపించారు. అనుదీప్ దేవ్ మంచి ఊపునిచ్చే బాణీని అందించారు. ఈ లిరికల్ విడియోలోని విజువల్స్, జాతర సన్నివేశాలు, కుర్రాళ్ల ధూంధాం స్టెప్పులు బాగున్నాయి. రాజు ఎదురోలు ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు. అన్వర్ అలీ ఎడిటర్‌గా పనిచేశారు. ఈ చిత్రానికి సుభాష్ చీర్ల, కొండల రావు అడ్డగళ్ల సంభాషణలు రాశారు. ఆగస్టులో ఈ చిత్రాన్ని విడుదల చేసేందుకు మేకర్లు ప్లాన్‌చేస్తున్నారు. నటీనటులు: సందీప్ సరోజ్, యశ్వంత్ పెండ్యాల, ఈశ్వర్ రాచిరాజు, త్రినాధ్ వర్మ, ప్రసాద్ బెహరా, మణికంఠ పరసు, లోకేష్ కుమార్ పరిమి, శ్యామ్ కళ్యాణ్, రఘువరన్, శివకుమార్ మట్ట, అక్షయ్ శ్రీనివాస్, రాధ్య, తేజస్వి రావు, టీనా శ్రావ్య, విషిక, ముఖ్యపాత్రల్లో సాయి కుమార్, గోపరాజు రమణ, బలగం జయరాం, శ్రీ లక్ష్మి, కంచెరపాలెం కిషోర్, కిట్టయ్య, రమణ భార్గవ్, జబర్దస్త్ సత్తిపండు తదితరులు. సమర్పణ: నిహారిక కొణిదెల, బ్యానర్స్– పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ ఎల్.ఎల్.పి, శ్రీరాధా దామోదర్ స్టూడియోస్, నిర్మాతలు: పద్మజ కొణిదెల, జయలక్ష్మి అడపాక, రచన, దర్శకత్వం: యదు వంశీ, సినిమాటోగ్రఫీ: రాజు ఎదురోలు, మ్యూజిక్ డైరెక్టర్: అనుదీప్ దేవ్, ప్రొడక్షన్ డిజైనర్: ప్రణయ్ నైని, ఎడిటర్: అన్వర్ అలీ, డైలాగ్స్: వెంకట సుభాష్ చీర్ల, కొండల రావు అడ్డగళ్ల, ఫైట్స్: విజయ్, నృత్యం: జె.డి మాస్టర్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: మన్యం రమేష్, సౌండ్ డిజైనర్: సాయి మణిందర్ రెడ్డి తదితరులు.



# 'కార్యకర్త' టైటిల్ పోస్టర్ లాంచ్

మోక్షజ్ఞ సమర్పణలో నక్షత్ర మీడియా అసోసియేషన్స్‌లో జిఎంఆర్ ప్రొడక్షన్ వారి 'కార్యకర్త' అనే పొలిటికల్ మూవీ సిరీస్ యొక్క టైటిల్ అనౌన్స్‌మెంట్ పోస్టర్ లాంచ్ కార్యక్రమం మాదాపూర్‌లో జరిగింది. ఈ కార్యక్రమానికి నాతో



నేను డైరెక్టర్ జబదస్త్ శాంతి కుమార్ విచ్చేశారు. ఈ చిత్రంలో ఆదిత్య ఓం ముఖ్య పాత్రలో నటిస్తుండగా, శ్రీనివాస రెడ్డి టైటిల్ రోల్ చేస్తున్నాడు. మిగతా పాత్రల్లో శిరీష, విజయ, సుమన్ శెట్టి, శాంతికుమార్, షానీ, నారి సర్కార్, మధు నటిస్తున్నారు. ఈ పొలిటికల్ మూవీ సిరీస్‌కు జి.శ్రీనివాస్ కథను అందిస్తుండగా రాఘవ తిరువాయిపాటి స్క్రీన్‌ప్లే దర్శకత్వం వహిస్తున్నారు.

# మల్వీ మల్హోత్రా స్పెషల్ పాట 'షాబానో' రిలీజ్!




ఆడు ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై హీరోయిన్ మాల్వీ మల్హోత్రా నర్తించిన స్పెషల్ సాంగ్ 'షాబానో' డివో మ్యూజిక్ ద్వారా విడుదల అయింది. గౌతమ్ చవాన్ నిర్మాతగా భాస్కర్ బంటుపల్లి దర్శకత్వంలో రూపొందిన ఈ సాంగ్‌కు ఎస్ మాస్టర్ డ్యాన్స్ కంపోజ్ చేశారు. సాంగ్ విడుదలైన తర్వాత యువత నుంచి మంచి రెస్పాన్స్ లభిస్తోంది. సోషల్ మీడియాలో సాంగ్ వైరల్ అవ్వడమే కాకుండా యంగ్ స్టర్స్ రీల్స్ చేస్తూ ఉండడం విశేషం. అద్భుతమైన లొకేషన్స్‌లో చిత్రీకరించిన ఈ సాంగ్ మెలోడిగా క్యాచీ లిరిక్స్‌లో ఆకట్టుకుంటుంది. టాలెంటెడ్ సింగర్ సాకేత్ కోమండూరి ఈ సాంగ్‌కు తనదైన శైలిలో సంగీతం అందించారు. ఎ.డి.మార్గల్ సినిమాటోగ్రఫీ అందించిన ఈ సాంగ్‌కు శ్రీకాంత్ పట్నాయక్ ఆర్ ఎడిటర్ అలాగే ఆర్.మురళీమోహన్ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్, ఆర్.చంద్రమోహన్ ఈ సినిమాకు లైన్ ప్రొడ్యూసర్. షాబానో సాంగ్ తెలుగుతో పాటు హిందీ, తమిళ్, కన్నడ భాషల్లో ఒకేసారి విడుదల అయింది. అన్ని భాషల్లో ఈ సాంగ్‌ను సోనీ కోమండూరి పాడడం జరిగింది. సోని కోమండూరి బాహుబలి సినిమాలో హంసనావ పాట పాడడం విశేషం.

# 'ది గోట్' ఫస్ట్ సింగిల్ రిలీజ్



దళపతి విజయ్, వెంకట్ ప్రభుల మోస్ట్ ఎవైటెడ్ పాన్ ఇండియా మూవీ ది గోట్ (ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్) ఫస్ట్ సింగిల్ రిలీజ్ అయింది. యువన్ శంకర్ రాజా కంపోజ్ చేసిన ఈ పాటకు యువన్ శంకర్ రాజా, నకాష్ అజీజ్ వారి ఎనర్జిటిక్ వోకల్స్‌తో ఎనర్జీని యాడ్ చేశారు. రామజోగయ్య శాస్త్రి రాసిన లిరిక్స్ ఆకట్టుకున్నాయి. ఈ సాంగ్ పవర్ ఫుల్ ఎనర్జీతో డ్యాన్స్ అంథమ్. ట్రాక్ స్పార్క్లింగ్ ఎట్మాస్ఫియర్‌ని క్రియేట్ చేసి లిజనర్స్‌కి ఫుట్ ట్యాపింగ్ నంబర్‌గా అలరించింది. ఛాంపియన్ షిప్‌ని సెలబ్రేట్ చేసుకునే సాంగ్ ఇది, సినిమా సెంట్రల్ థీమ్‌ని రిజనేట్ చేస్తోంది. లిరికల్ విడియోలో ప్రభుదేవా, ప్రశాంత్, అజ్మల్ అమీర్‌లతో కలిసి విజయ్ డ్యాన్స్ అదరగొట్టారు. రాజు సుందరం మాస్టర్ కొరియోగ్రఫీ చేశారు. కంప్లీట్ విజువల్స్‌తో పాటను చూపినప్పుడు మరింత ఇంపాక్ట్‌గా ఉండబోతోంది. విజయ్ ద్విపాత్రాభినయం చేస్తున్న ఈ చిత్రంలో ప్రశాంత్, ప్రభుదేవా, మోహన్, జయరామ్, స్నేహ, లైలా, అజ్మల్ అమీర్, మీనాక్షి చౌదరి, వైభవ్, యోగి బాబు, ప్రేమి అమరెన్, యుగేంద్రన్ వాసుదేవన్, అఖిలన్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఎజిఎస్ ఎంటర్‌టైన్‌మెంట్ ప్రైవేట్ లిమిటెడ్‌పై కల్పాతి ఎస్ అఘోరమ్, కల్పాతి ఎస్ గణేష్, కల్పాతి ఎస్ సురేష్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి సిద్ధార్థ నుని సినిమాటోగ్రఫీ అందించారు. పాన్ ఇండియా ప్రొడక్షన్ హౌస్ మైత్రీ మూవీ మేకర్స్ ఈ పాన్ ఇండియా మూవీ తెలుగు వెర్షన్‌ను గ్రాండ్‌గా విడుదల చేయనుంది.



కీర్తి సురేష్ నయా లుక్

# 'సర్దార్ 2' షూటింగ్ షురూ

హీరో కార్తీ సర్దార్ సినిమా తమిళం, తెలుగు భాషల్లో బంపర్ హిట్ అయ్యింది. సర్దార్ థియేటర్స్‌లో విడుదలైన కొద్ది రోజుల తర్వాత మేకర్స్ సినిమా పార్ట్ 2ని అఫీషియల్‌గా అనౌన్స్ చేశారు. సర్దార్ 2కి సంబంధించిన పూజా కార్యక్రమాలు ఇటీవల జరిగాయి. ఈ సినిమా షూటింగ్ 2024 జులై 15న చెన్నైలో భారీ సెట్స్‌లో ప్రారంభం కానుంది. ప్రీక్వెల్‌కి దర్శకత్వం వహించిన పిఎస్ మిత్రన్ సర్దార్ 2కి దర్శకత్వం వహించనున్నారు. ప్రిన్స్ పిక్చర్స్ నిర్మించనుంది. సర్దార్ ఎండింగ్‌లో నెక్స్ట్ మిషన్ కంబోడియాలో జరగబోతోందని రివిల్ అయ్యింది. సర్దార్ 2 భారీ బడ్జెట్‌తో హ్యూజ్ స్కేల్‌లో తెరకెక్కనుంది. టాప్ టెక్నీషియన్స్ ఈ సనిమాకి పని చేస్తున్నారు. సర్దార్ 2 చిత్రానికి యువన్ శంకర్ రాజా సంగీతం అందించనున్నారు. జార్జ్ సి విలియమ్స్ ఫోటోగ్రఫీ డైరెక్టర్, దిలీప్ సుబ్బరాయన్ స్టంట్ డైరెక్టర్. రాజీవ్ నంబియార్ ప్రొడక్షన్ డిజైనర్. విజయ్ వేలుకుట్టి ఎడిటర్, ఎపి పాల్ పాండి ప్రొడక్షన్ ఎగ్జిక్యూటివ్, ఎ.వెంకటేష్ సహ నిర్మాతగా, ఎస్.లక్ష్మణ్‌కుమార్ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. తారాగణం: కార్తీ, సంకేతిక సిబ్బంది: దర్శకత్వం: పిఎస్ మిత్రన్, నిర్మాత: ఎస్ లక్ష్మణ్ కుమార్,



బ్యానర్: ప్రిన్స్ పిక్చర్స్, సహ నిర్మాత: ఎ.వెంకటేష్, సంగీతం: యువన్ శంకర్ రాజా డివొపి: జార్జ్ సి విలియమ్స్, ఎడిటర్: విజయ్ వేలు కుట్టి, ప్రొడక్షన్ డిజైనర్: రాజీవ నంబి యార్, స్టంట్స్: దిలీప్ సుబ్బ రాయన్, ప్రొడక్షన్ ఎగ్జిక్యూటివ్: ఎపిపాల్ పాండి.

# 'డార్లింగ్' నుంచి 'సున్ చలియా'

రొమాంటిక్, ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ జానర్‌లలోకి వచ్చే సినిమాలు ఆడియన్స్ ఎక్స్‌పీరియన్స్‌ను బూస్ట్ చేయడానికి చార్ట్‌బస్టర్ ఆల్బమ్‌లు అవసరం. ఈ జానర్ చిత్రాలు ఇంపాక్ట్ క్రియేట్ చేయడంలో మ్యూజిక్ కీలక పాత్ర పోషిస్తుంది. 'డార్లింగ్' సినిమా విడుదలకు ముందే మ్యూజికల్ హిట్‌గా మారింది. ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్ కె.నిరంజన్ రెడ్డి, శ్రీమతి చైతన్య నిర్మించిన ఈ చిత్రానికి అశ్విన్ రామ్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాలోని మొదటి రెండు పాటలు సూపర్ డూపర్ హిట్ అయ్యాయి. మేకర్స్ థర్డ్ సింగిల్ సున్ చలియాను రిలీజ్ చేశారు. మొదటి రెండు పాటలు ప్రియదర్శి, నభా నటేష్‌ల సోలో నంబర్‌లు కాగా, మూడవ పాట ఇద్దరూ కలిసి ఆలపించిన డ్యూయెట్. వివేక్ సాగర్ ఈ పాటని ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న లవ్ సాంగ్ ఆఫ్ ది ఇయర్‌గా బ్యూటీఫుల్‌గా కంపోజ్ చేశారు. అద్భుతమైన ఆర్కెస్ట్రేషన్‌తో ఈ పాట మెస్మరైజ్ చేస్తోంది. వివేక్ మ్యూజిక్ సాంగ్ మూడ్‌కి పర్ఫెక్ట్. కాసర్ల శ్యామ్ లిరిక్స్ లవ్లీగా ఉండగా, అనురాగ్ కులకర్ణి వోకల్స్ ఎక్స్‌పిసివ్‌గా ఉన్నాయి. ఈ పాట లీడ్ పెయిర్ ప్రియదర్శి, నభా నటేష్‌ల లవ్లీ జర్నీని అద్భుతంగా ప్రజెంట్ చేస్తోంది. ఈ పాటలో వీరిద్దరూ స్పార్క్లింగ్ కెమిస్ట్రీని షేర్ చేసుకున్నారు. ఈ పాట ఇన్‌స్టంట్ ఇంప్రెషన్‌ని క్రియేట్ చేస్తోంది. థియేట్రికల్ రిలీజ్‌కి ముందే ఇది చాలా పాపులర్ అవుతుంది. ఈ చిత్రానికి హేమంత్ డైలాగ్స్ రాస్తుండగా, లవ్ టుడే ఫేం ప్రదీప్ ఇ రాఘవ్ ఎడిట్ చేస్తున్నారు.

గాంధీ ప్రొడక్షన్ డిజైనర్. డార్లింగ్ మూవీ జులై 19న ప్రపంచ వ్యాప్తంగా విడుదల కానుంది. నటీనటులు: ప్రియదర్శి, నభా నటేష్, బ్రహ్మానందం, విష్ణు, కృష్ణ తేజ్, అనన్య నాగళ్ల తదితరులు. సాంకేతిక సిబ్బంది: రచన–దర్శకత్వం: అశ్విన్ రామ్, నిర్మాతలు: కె.నిరంజన్ రెడ్డి, శ్రీమతి చైతన్య, బ్యానర్: ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్, సంగీతం: వివేక్ సాగర్, డివొపి: నరేష్ రామదురై, ఎడిటర్: ప్రదీప్ ఇ రాఘవ, డైలాగ్స్: హేమంత్, ప్రొడక్షన్ డిజైనర్: గాంధీ, పబ్లిసిటీ డిజైనర్: అనంత్ కంచర్ల, క్రియేటివ్ ప్రొడ్యూసర్: సీతారామ్ వై, లిరిక్స్: కాసర్ల శ్యామ్.



# పవర్ ఫుల్ రోల్‌లో 'ఆర్‌సి 16'

ఆర్ఆర్ఆర్ గ్లోబల్ సక్సెస్ గ్లోబల్ స్టార్ రామ్‌చరణ్‌కు ప్రపంచవ్యాప్తంగా ఫేమ్ తెచ్చింది. ఉప్పెనతో బ్లాక్ బస్టర్ డెబ్యూ చేసిన సెన్సేషనల్ బుచ్చిబాబు సానాతో కలిసి తన 16వ సినిమా చేయనున్నారు రామ్‌చరణ్. పాన్ ఇండియా ప్రొడక్షన్ హౌస్ మైత్రి మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సగర్వ సమర్పణలో వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై మెగా బడ్జెట్, హై–క్లాస్ ప్రొడక్షన్, టెక్నికల్ వాల్యూస్‌తో రూపొందే ఈ మోస్ట్ ఎవెయిటింగ్ ప్రాజెక్ట్ ఆర్‌సి 16తో వెంకట సతీష్ కిలారు గ్రాండ్‌గా ఫిల్మ్ ప్రొడక్షన్‌లోకి ఎంట్రీ ఇస్తున్నారు. ఈ క్రేజీ పాన్ ఇండియా ప్రాజెక్ట్‌లో వివిధ భాషలకు చెందిన పలువురు ప్రముఖ నటీనటులు కనిపించనున్నారు. తాజాగా టీమ్ ఆర్16 తెలుగు సినిమాకి కరుణాడ చక్రవర్తి శివ రాజ్ కుమార్ ఎరైవల్‌ని సెలబ్రేట్‌చేసుకుంటుంది. కన్నడ సూపర్ స్టార్ ఈ చిత్రంలో వెరీ పవర్‌ఫుల్ రోల్ పోషించడానికి సైన్ చేశారు. ఈ న్యూస్‌ని శివ రాజ్‌కుమార్ పుట్టిన రోజు ప్రత్యేకత సందర్భంగా అనౌన్స్ చేశారు. ఈ న్యూస్‌తో ఇద్దరు స్టార్స్ అభిమానులు ఆనందంగా ఉన్నారు. ఇద్దరు సూపర్ స్టార్‌లను కలిసి తెరపై చూసేందుకు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. రామ్ చరణ్ సరసన జాన్వీ కపూర్ హీరోయిన్‌గా కనిపించనున్న ఈ మ్యాసీవ్ మూవీకి అకాడమీ–అవార్డ్–విన్నింగ్ కంపోజర్ ఎఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్నారు. ఆర్ రత్నవేలు డివొపి కాగా, అవినాష్ కొల్లా ప్రొడక్షన్ డిజైనర్. ఈ చిత్రానికి సంబంధించిన ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణులవివరాలు మేకర్స్ త్వరలో తెలియచేస్తారు. నటీనటులు: రామ్ చరణ్, జాన్వీ కపూర్, శివరాజ్ కుమార్, సాంకేతిక సిబ్బంది: రచన, దర్శకత్వం: బుచ్చిబాబు సాన, సమర్పణ: మైత్రి మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్, బ్యానర్: వృద్ధి సినిమాస్, నిర్మాత: వెంకట సతీష్ కిలారు, సంగీతం: ఎఆర్ రెహమాన్, డివొపి: ఆర్ రత్నవేలు, ప్రొడక్షన్ డిజైన్: అవినాష్ కొల్లా, మార్కెటింగ్: ఫస్ట్ షో.



# గిరిజన బిడ్డ.. ఐఐటి సాధించింది !

జెఇఇ.. ప్రతిష్ఠాత్మక కళాశాలల్లో ఇంజినీరింగ్ ప్రవేశానికి నిర్వహించే ప్రవేశపరీక్ష. దీనికి దేశవ్యాప్తంగా లక్షల్లో పోటీపడతారు. అందుకే చాలామంది ప్రత్యేకంగా కోచింగ్ తీసుకుంటారు. అయినా వెనకబడే వారెందరో! అలాంటిది ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదివీ .. ఐఐటి బాంబేలో సీటు సాధించింది..బానోతు నవ్య !




ఖమ్మం జిల్లా కూసుమంచి మండంలోని గగబండ తండా నవ్వది. అమ్మానాన్నలు మోతీలాల్, సరోజ. ముగ్గురు సంతానంలో నవ్య పెద్దది. వీళ్లది వ్యవసాయంపై ఆధారపడి బతికే గిరిజన రైతు కుటుంబం. స్థానిక మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాలలో నాలుగో తరగతి వరకు చదివింది నవ్య. అదీ తెలుగు మాధ్యమంలో! ఉన్నత పాఠశాల కోసం 3కి.మీ. దూరంలోని మండల కేంద్రానికి వెళ్లాలి. అమ్మానాన్నలు చదువుకోలేదు. ఆర్థిక పరిస్థితీ అంతంతమాత్రమే. అయినా నవ్య ఆసక్తిని కాదలనలేదు. అయితే అయిదు నుంచి ఆంగ్లమాధ్యమం. కాస్త తడబడినా పట్టుదలగా చదివి పదో తరగతిలో 9.5 గ్రేడ్ సాధించింది. ఆపై వికారాబాద్ జిల్లా పరిగిలోని గిరిజన సంక్షేమ గురుకుల కళాశాలలో ఇంటర్ ఎంపిసి విభాగంలో చేరింది. ఇకనకడా 964 మార్కులు సాధించింది. అతేకాదు ప్రతిష్ఠాత్మక జెఈఈ ప్రవేశపరీక్షలో ర్యాంకు సాధించి, ఐఐటి బాంబేలో సీటునీ సాధించింది.

'కళాశాలలో పాఠాలే కాదు.. జెఈఈకి సంబంధించిన శిక్షణనీ ఇచ్చారు. రెండిటికీ ప్రాధాన్యమిస్తూ వచ్చా. ఇంటర్ పరీక్షలు అయ్యాక పూర్తిగా జెఈఈపైనే దృష్టిపెట్టా. సన్నద్ధతకే 16 గంటలు కేటాయించా. లెక్చరర్లు నేర్పిన మెలకువలూ సాయపడ్డాయి. కాబట్టే, ఎస్టీ విభాగంలో 1251వ ర్యాంకు సాధించా. ఈ క్రమంలో ప్రధానాచార్యులు సమతి ప్రోత్సాహాన్ని మర్చిపోలేను. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటి) బాంబేలో సీటొచ్చింది. మెటలర్జికల్ ఇంజినీరింగ్ అండ్ మెటీరియల్ సైన్స్ ఎంచుకున్నా. మారుమూల గిరిజన అమ్మాయిని ఇక్కడివరకూ వెళ్లడం, నాన్న నమ్మకానినన నిలబెట్టడం ఆనందంగా ఉంది. అయితే నా లక్ష్యం మాత్రం ఐఎఎస్ అవ్వడం' అని చెప్పుకొచ్చింది నవ్య. □

# అనుభవాలనే పాఠాలుగా నేర్చుకుని..

**వాళ్లెవరూ ఎంబిఎలు చదివి వ్యాపారంలో అడుగుపెట్టిన వాళ్లు కాదు. అనుభవాలనే పాఠాలుగా మార్చుకున్నా వాళ్లు. సవాళ్లతోనే మెలకువలు నేర్చుకున్న ఈ గిరిజన బిడ్డలు శానిటరీ న్యాప్కిన్ల తయారీలో రాణిస్తున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఆదివాసీ మహిళలు సాధించిన విజయమిది.**



ఆ రోజు కూలి పని దొరికితే సరే సరి. లేదంటే ఆకలితో ఉండాలినసందే! అలాంటి పరిస్థితి నుంచి మార్కెటింగ్ మెలకువలతో వ్యాపారాన్ని కొత్తపుంతలు తొక్కించే స్థాయికి ఆదివాసీ మహిళలు వెళ్లారంటే గొప్పవిషయమేగా! లలిత, వెంకటలక్ష్మి, మంగా వీణ, సమ్మక్క, సుక్కమ్మ వంటి వారంతా పరిశ్రమ లోకి రాకముందు రోజువారీ కూలీలుగా ఉండేవారు. ఏజెన్సీ ప్రాంతంలో తగిన ఉపాధి లేక ఎన్నో ఇబ్బందులు పడ్డారు. వీళ్ల జీవితాల్లో మార్పు రావాని 2016లో ఐటిడిఎ అధికారులు శానిటరీ న్యాప్కిన్ల తయారీ పరిశ్రమను నెలకొల్పారు. అనుభవలేమి, నష్టాలతో ఆ ప్రయత్నం విఫలమైంది. దాంతో అధికారులు మరిన్ని జాగ్రత్తలు తీసుకుని రెండో ప్రయత్నం చేశారు. హైదరాబాద్, ముంబయి, ఢిల్లీ తదితర ప్రాంతాల్లో నాప్కిన్స్ తయారీ ఎలా ఉంటుందో అధ్యయనం చేయించారు. శిక్షణ ఇప్పించారు. మహిళల్లో ఆత్మవిశ్వాసం వచ్చాక 2018లో ఆధునిక మెషినరీని సమకూర్చారు. ప్రభుత్వ రాయితీ, బ్యాంకు రుణంతో ఆదివాసీ మహిళలూ తాము దాచుకున్న సొమ్ముని పెట్టుబడిగా పెట్టారు. అలా 2020 నుంచి న్యాప్కిన్ల ఉత్పత్తి మొదలైంది. గిరిజన సహకార సంస్థ (జిసిసి) సాయంతో మార్కెటింగ్‌పైనా పట్టుసాధించారు. మొదట్లో ఆశ్రమ పాఠశాలలకు ఈ స్యాప్కిన్లను సరఫరా చేసేవారు. ఆ తరవాత కళాశాలలు, ఎస్సీ, ఎస్టీ గురుకులాలు, జెడ్పీ ఉన్నత పాఠశాలలకు నెలకు 60 వేల వరకూ న్యాప్కిన్స్ తయారుచేసేవారు. అంతా బాగుందనుకుంటే కోవిడ్ ముంచుకొచ్చింది. ఆర్డర్లు లేవు. పరిస్థితి మొదటికొచ్చింది. ఆ స్థితి నుంచి కోలుకోవడానికి సమయం పట్టినా నాణ్యతలో రాజీపడకుండా తిరిగి ఆర్డర్లు సంపాదించారు. ప్రస్తుతం ఉమ్మడి ఖమ్మ, వరంగల్, నిజామాబాద్ జిల్లాల్లోని విద్యాసంస్థలకు తమ ఉత్పత్తులను అందిస్తున్నారు. ఒక్కో మహిళా నెలకు సుమారు రూ.10-15వేల వరు సంపాదిస్తున్నారు. వీరిన ఇఊసి మరికొందరూ చిన్న పరిశ్రమల స్థాపనకు ముందుకొస్తున్నారని అధికారులు చెబుతున్నారు. □



# కురులు వేగంగా పెరగాలా?

**పుట్టుకుచ్చులా అందంగా, పొడవుగా ఉండే కురులు.. కోరుకోని అమ్మాయి ఉంటుందా? కానీ ఈ కాలుష్యానికి ఊడటమే కానీ పెరగడం ఎక్కడుంది? ఈ చిన్న చిట్కాలను పాటించండి. వేగంగా పెరుగుతాయి అంటున్నారు నిపుణులు. అవేంటో చూద్దామా?**



★ తల ఆరోగ్యంగా ఉండాలంటే తరచూ దాన్ని శుభ్రం చేయడం తప్పని సరి. కానీ ఆరబెట్టడమే పెద్ద పని. అందుకే చాలామంది డ్రైయ్యర్‌ని వాడుతుంటారు. కానీ దాని వేడి కురుల పెరుగుదలను అడ్డుకుంటుందని తెలుసా? స్టైలింగ్, స్టైలింగ్, స్ట్రెయిట్‌నింగ్ కోసం వాడేవే కాదు.. ఎండలో అతిగా తిరగడం, జడను లాగివేయడం, తువాలుతో తడిపోవాలని కొట్టడం వంటివీ చేటు చేసేవే. వీటికి దూరంగా ఉండండి.

★ కండిషనర్ వెంట్రుకలకు బాగా పడుతుంది. ఇప్పుడైతే చిక్కులు బాగా వస్తాయి. అని తడి తలమీద దువ్వెన ఉపయోగిస్తున్నారా? మేలు చేయడం మాట అటుంచితే కుదుళ్లకు హాని. ఫలితమే కురులు రాలడం. కాబట్టి, తడి వెంట్రుకలు ఆరేవరకూ ఆగండి. తరవాతే దువ్వండి.

★. ఒకప్పుడు సమస్యేదైనా నిపుణులను సంప్రదించేవారు. మరి ఇప్పుడు? అరచేతిలోనే సమాచారం. దాని సలహాతో ఇష్టారీతిన సప్లిమెంట్లను వాడేస్తున్నారు. మీదీ అదే ధోరణా? ఇవి మేలు చేయకపోగా చేటు చేస్తాయి. వాటి ప్రభావం తొలుత పడేది చర్మం, కురులపైనే! నిపుణుల సలహా లేనిదే వాడకపోవడమే మేలు.

★ త్వరగా పెరగవు అని చాలామంది కురులను కత్తిరించడానికి వెనకాడతారు. కానీ రెండు నెలలకో సారైనా ట్రిమ్ చేసుకోవాలి. చిట్లడం, చివర్లు పొడిబారడం కూడా కురుల పెరుగుదలకు అవరోధంగా మారతాయి. కాబట్టి, వాటిని తొలగించడం తప్పనిసరి.

★. జిడ్డు, సమయం లేదని బద్ధకించక వారానికి రెండుసార్లు గోరువెచ్చని నూనెతో తలకు మర్దనా చేయండి. మాడుకి రక్తప్రసరణ బాగా జరుగుతుంది. అలాగే కండిషనర్ వాడకం కూడా తప్పనిసరి. ఇది వాతావరణ పరిస్థితుల నుంచి కురులకు సంరక్షిస్తుంది.

★ దిండు కూడా కేశాల పెరుగుదలపై ప్రభావం చూపుతుందని తెలుసా? సరైన గలేబులను వాడకపోతే అవి కురుల్లోనే సహజ నూనెలను పీల్చేయడమే కాదు, రాపిడికి గురిచేసి వెంట్రుకలు తెగేలానూ చేయగలవు. కాబట్టి, శాటిన్ రకాలనే ఎంచుకోండి. చిన్నవే కదూ.. అందమైన, ఆరోగ్యకరమైన కురుల కోసం పాటించండి మరి. □

# కత్తెర ఒక్కటే కానీ..



పరికరాలతో పని తేలికయ్యే మాట నిజమే.. కానీ ప్రతి పనికీ ఒక పరికరాన్ని కొనలేం కదా! ఇదిగో ఈ మల్టీ ఫంక్షనల్ కత్తెర ఒకటి మీ దగ్గర ఉంటే ఐదారు పనులు సులభంగా చేసుకోవచ్చు. రెండు వైపులా పదును ఉండే ఈ కత్తెరతో చికెన్‌ని కావాల్సిన పరిమాణంలో ముక్కలు చేసుకోవచ్చు. చేపపొలుసులు తీసుకోవచ్చు.కాయగూర తొక్కలని వలిచే పీలర్‌గానూ ఉపయోగప‌డుతుంది. వాల్‌నట్స్ వంటి కఠినమైన గింజలని పగలకొట్టడం తేలిక. వెనుక భాగాన్ని బాటిల్ ఓపెనర్‌గా మలుచు కోవచ్చు. ఎక్కడ పెట్టాం అని వెతుక్కోవాల్సిన అవసరం లేకుండా ఫ్రిజ్‌కి తగిలించుకోవచ్చు. □



# ఆకుకూరలతో నాన్‌వెజ్ రుచులు

**ఒట్టి ఆకుకూరలంటే కష్టమేమో కానీ.. వాటికి సరైన నాన్‌వెజ్ జోడీ దొరికితే అదిరిపోదూ! గోంగూర పచ్చిరొయ్యలు, గోంగూర మటన్ అలాంటి రుచులే. అవేకాదు మరికాస్త భిన్నంగా ఆకుకూర నాన్‌వెజ్ రుచులు ప్రయత్నిద్దాం..**

## గోంగూర బోటీ



**కావాల్సినవి :** శుభ్రం చేసిన బోటీ-300గ్రా, గోంగూర కట్టలు-రెండు, నూనె-మూడున్నర చెంచాలు, ఉల్లిపాయలు-రెండు, పచ్చిమిర్చి-నాలుగు, టొమాటోలు-రెండు, అల్లంవెల్లులి పేస్ట్-చెంచా, ధనియాలపొడి-చెంచా, కారం-రెండు చెంచాలు, పసుపు-పావుచెంచా, గరంమసాలాపొడి-చెంచా, ఉప్పు-తగినంత.

**తయారీ :** కుక్కర్‌లో తగినన్ని నీళ్లు, ఉప్పు, పసుపు వేసి బోటీని మెత్తగా ఉడికించుకోవాలి. స్టౌపై కడాయి పెట్టి వేడెక్కాక కొద్దిగా నూనె వేసి అందులో గోంగూరని మెత్తగా మగ్గించుకోవాలి. మరొక కడాయి తీసుకుని అందులో మిగిలిన నూనె పోసి వేడెక్కాకి. ఉల్లిపాయముక్కలు వేసి బాగా వేయించుకోవాలి. తర్వాత టొమాటో ముక్కలు కూడా వేసి మగ్గాక, ఇందులో అల్లం వెల్లుల్లి పేస్ట్ వేసి పచ్చివాసన పోయేంతవరకూ వేగనివ్వాలి. ధనియాలపొడి,గరంమసాలా, ఉప్పు, పసుపు, కారం వేసుకోవాలి. కాసేపటికి నూనె వేరవుతుంది. అప్పుడు ఉడికించిన బోటీని నీళ్లతో సహా వేసుకోవాలి. ఓ పది నిమిషాలకు కూర దగ్గరవుతున్నప్పుడు ఉడికించిన గోంగూర వేసి కలపాలి. మరో ఐదు నిమిసాలకు వేడివేడి గోంగూర బోటీ కూర సిద్ధం.

## మెంతికూర మటన్..



**కావాల్సినవి :** బోన్‌లెస్ మటన్-500గ్రా, ఉల్లిపాయముక్కలు-ఒకటిన్నర కప్పు, టొమాటోలు-మూడు, మెంతాకు-ఒకటిన్నర కప్పు, దాల్చినచెక్క-చిన్నముక్క, లవంగాలు- మూడు, యాలకులు-రెండు, షాజీర-పావుచెంచా, ధనియాలపొడి-అరచెంచా, గరంమసాలా-చెంచా, ఉప్పు-తగినంత, నూనె-మూడు చెంచాలు, కారం-ఒకటిన్నర చెంచా, పసుపు-తగినంత, పచ్చిమిర్చి-నాలుగు అల్లంవెల్లుల్లి పేస్ట్-చెంచాన్నర.

**తయారీ :**... మటన్‌కి ఉప్పు, పసుపు, కారం పట్టించి ఓ అరగంటపాటు పక్కన పెట్టేయాలి. స్టౌ వెలిగించి కడాయి పెట్టి నూనె పోసి దాల్చినచెక్క, యాలకులు, షాజీర, లవంగాలు వేసి తక్కువ మంట మీద వేడిచేశాక ఉల్లిపాయముక్కలు, మిర్చి, ఉప్పు వేసుకుని దోరగా వేయించుకోవాలి. తర్వాత అల్లంవెల్లుల్లి పేస్ట్ వేసి పచ్చిన వాసన పోయాక మెంతాకు వేసుకోవాలి. దానిలో నీరు పోయిదగ్గరకు వచ్చేతవరకూ ఆగి. తర్వాత మారినేట్ చేసి పెట్టుకున్న మటన్ వేసి మూతపెట్టి పదినిమిషాలు ఉడికించుకోవాలి. కూరలోని నీరంతాపోయి పొడిగా అయ్యాక కప్పు నీళ్ల పోసుకుని మెత్తగా ఉడకనివ్వాలి. చివరిగా గరంమసాలా, ధనియాలపొడి వేసుకుంటే రుచకరమైన మేతి మటన్ రెడీ.

## చుక్కకూర చికెన్..



**కావాల్సినవి :** చికెన్-అరకేజీ, చుక్కకూ-నాలుగు కప్పులు, పచ్చిమిర్చి-మూడు, నూనె-ఐదు చిన్నచెంచాలు, కారం-ఒకటిన్నర చెంచా, ఉప్పు-తగినంత, పసుపు-పావుచెంచా, ఉల్లిపాయ-ఒకటి, ధనియాపొడి-ఒకటిన్నర చెంచా, గరంమసాలా-చెంచా, కొత్తిమీర తరుగు-రెండు చెంచాలు, అల్లంవెల్లుల్లి పేస్ట్-రెండు చెంచాలు.

**తయారీ :** చికెన్‌కి అల్లంవెల్లుల్లి పేస్ట్, కారం, పసుపు, ఉప్పు పట్టించి అరగంటపాటు పక్కన పెట్టేయాలి. స్టౌపై కడాయి పెట్టి వేడెక్కాక నూనెపోసుకుని ఉల్లిపాయ ముక్కలు, పచినచమర్చిలను బాగా వేయించు కోవాలి. తర్వాత అల్లం వెల్లుల్లి పేస్ట్ వేసి, వేగాక మారినేట్ చేసి పెట్టుకున్న చికెన్‌ని వేసి అందులోని నీరంతా పోయేతవరకూ ఉడికించుకోవాలి. అప్పుడు కప్పున్నర నీళ్లపోసి, ఉడుకుతున్నప్పుడు చుక్కకూర ధనియాలపొడి, గరంమసాలా, ఉప్పు వేసుకోవాలి. చివరిగా కొత్తిమీర వేసుకొని దించుకోవాలి.

## సోయకూర లివర్ ఫ్రై ..



**కావాల్సినవి :** తరిగిన సోయకూళ-కప్పు, మటన్ లివర్-150నరగా, ఉల్లిపాయ-ఒకటి, పచ్చిమిరపకాయలు-మూడు, టొమాటో-1, జీలకర్రపొడి-చెంచా, ధనియాలపొడి-చెంచా, గరంమసాలా-చెంచా, కొత్తిమీర-కొద్దిగా, నూనె మూడు చెంచాలు, ఉప్పు, కారం-తగినంత అల్లం వెల్లుల్లి పేస్ట్-చెంచా, కారం-చెంచా,

**తయారీ :** స్టౌపై కడాయి పెట్టి, వేడెక్కాక అందులో నూనె పోసుకోవాలి. ఉల్లిపాయ ముక్కలు, ఉప్పు వేసి వాటిని బాగా మగ్గనివ్వాలి. ఆ తర్వాత అల్లం వెల్లుల్లి పేస్ట్, పచ్చిమిరపకాయలు వేసుకుని పచ్చి వాసన పోనివ్వాలి. అప్పుడు కాసిని నీళ్ల పోసుకుని దానిలో లివర్ మటన్ వేసుకోవాలి. దాన్ని గరిటెతో కలుపుతూ కారం, ధనియాలపొడి, జీలకర్రపొడి, పసుపు, గరంమసాలా వేసికాసేపు మగ్గనివ్వాలి. అవి కూడా ఉడికాక కొద్దిగా నీళ్ల పోసి, సోయకూరని సన్ననగా తరిగి కూరలో వేసి మూతపట్టేయాలి. మరో ఐదునిమిషాలకు కూర దగ్గరకు వచ్చి సోయకూర లివర్ ఫ్రై రెడీ అవుతుంది.

## తోటకూర కాడలు-రొయ్యల పులుసు ..




**కావాల్సినవి :** తోటకూర కాడలు-రెండు కప్పులు, రొయ్యలు-కప్పు, ఉల్లిపాయలు-రెండు, అల్లం-చిన్నముక్క, వెల్లుల్లి రెబ్బలు-ఎనిమిది, పచ్చిమర్చి- మూడు, కరివేపాకు-రెబ్బ, నూనె-తగినంత, ఉప్పు-తగినంత, ఎండుమిర్చి-రెండు జీలకర్రపొడి-చెంచా, ధనియాలపొడి-చెంచా, గరుంమసాలా-చెంచా, కారం-చెంచా.

**తయారీ :** స్టౌ వెలిగించి కడాయి పెట్టి వేడెక్కాక నూనె పోసి, కరివేపాకు, ఎండుమిర్చిని తుంచి వేసి బాగా వేగనివ్వాలి. అందులో తరిగిన తోట కూర కాడల్ని వేసి మూత పెట్టి బాగా మగ్గనివ్వాలి ఇప్పుడు మిక్సీ.ఆర్‌లో ఉల్లిపాయ ముక్కలు, వెల్లుల్లి రెబ్బలు, అల్లం, గరంమసాలా, జీలకర్రపొడి, ధనియాలపొడి వేసి మెత్తగా మిక్సీ పట్టాలి. ఈ మసాలాని ఉడికిన తోటకూర కాడల్లో వేసుకోవాలి. అవి ఉడకుతున్నప్పుడే ఉప్పు, కారం, పసుపు వేసి బాగా మగ్గనివ్వాలి. ఇందులోనే రొయ్యల్ని వేసుకుని గరిటెతో తిప్పుతూ ఉంటే రొయ్యల నుంచి నీరు వస్తుంది. అది కూడా ఇగిరిపోయేంతవరకూ ఉంచి తర్వాత కొద్దిగా పోసి మూత పెట్టేయాలి. ఐదుపది నిమిషాలకు కూర సిద్ధమవుతుంది. □

# ప్రార్ధనకు జవాబు

అంతర్వాణి

'హన్నా.. బహుదుఃఖాక్రాంతురాలై వచ్చి యెహోవా సన్నిధిని ప్రార్థనచేయుచు బహుగా ఏడ్చుచు- సైన్యములకధిపతివగు యెహోవా, నీ సేవకురాలనైన నాకు కలిగియున్న శ్రమను చూచి, నీ సేవకురాలనైన నన్ను మరువక జ్ఞాపకము చేసికొని, నీ సేవకురాలనైన నాకు మగపిల్లను దయచేసినయెడల, వాని తలమీదికి క్షౌరపుకత్తి యొన్నటికి రానియ్యక, వాడు బ్రదుకుదినములన్నిటను నేను వానిని యెహోవానగు నీకు అప్పగించుతునని మ్రొక్కుబడి చేసికొనెను' (1సమూయేలు 1:10,11).



ఇక్కడ ప్రార్థన చేసిన స్త్రీ పేరు 'హన్నా'. ఈమె భర్త పేరు ఎల్కానా. ఇతనికి ఇద్దరు భార్యలు. హన్నా, పెనిన్నా. పెనిన్నాకు సంతానం ఉంది, హన్నాకు పిల్లలు లేరు. దేవుడే ఆమెకు సంతులేకుండా చేశాడు. ఏ స్త్రీకైనా సంతానం లేకపోతే ఆ బాధ వర్ణించలేనిది. సమాజంలో వారికి సరైన గౌరవం లభించదు. ఈ కాలం పర్వాలేదుకానీ, పూర్వదినాల్లో పిల్లలు లేని ఇల్లాలిని చాలాహీనంగా చూసేవారు. ఇలాంటి అవమానంలో హన్నా జీవించింది. హన్నాకు సంతానం లేనికారణంగా భరించలేని బాధ, వేదనతో ఉండేది. అయితే హన్నా షిలోహులో ఉన్న దేవుని సన్నిధిలో బహుగా ఏడుస్తూ, దుఃఖిస్తూ ప్రార్థించింది. హన్నా మనలా కోరికలు కోరలేదు, కానీ దేవుడితో ఒక నిబంధన చేసుకుంది. తనకు మగసంతానం ఇస్తే, ఆ పిల్లాడిని దేవుడి సేవకే అర్పిస్తాను అంది. అన్నట్లుగా హన్నాకు దేవుడు ఒక కుమారుడిని దయచేయగా, అతనికి 'సమూయేలు' అని పేరు పెట్టింది. పిల్లాడు పాలు విడిచిన తర్వాత, దేవుడి మందిరానికి తీసుకొచ్చి, దేవుడి సేవకు అర్పించుకుంది. మళ్లీ దేవుడు హన్నాకు ముగ్గురు కొడుకులు, ఇద్దరు కుమార్తెలను ఇచ్చాడు. సమూయేలు దేవుడి సన్నిధిలో యాజకత్వం చేస్తూనే, ఇశ్రాయేలు ప్రజలకు న్యాయాధిపతిగా ఉన్నాడు. సమూయేలు ఒక ప్రవక్తగా, యాజకుడిగా, న్యాయాధిపతిగా వర్థిల్లాడు. హన్నా దేవుడు తనకు ఇచ్చిన సంతానాన్ని దేవుడి సేవకు అర్పించు కుంది. నిజమే మనం యదార్థంగా ప్రార్థన చేసినప్పుడు దేవుడు తప్పనిసరిగా ప్రార్థనలకు జవాబు ఇస్తాడు. 'మీరు నన్ను వెదకినయెడల, పూర్ణమనస్సుతో నన్ను గూర్చి విచారణ చేయునెడల మీరు నన్ను కనుగొందురు' (యిర్మీయా 29:13). దేవుడు హన్నా ప్రార్థన చేసి, సంతానం ఇచ్చాడు. ఇలాంటి విశ్వాసం మనకు ఉండాలి. మనం దేనిగురించి అయితే ప్రార్థిస్తున్నామో దేవుడు తప్పనిసరిగా సాయం చేస్తాడనే విశ్వాసం ఉండాలి. ఇలాంటి విశ్వాసంతో ముందుగు సాగిపోదాం.

-పి.వాణిపుష్ప

# సమానంగా కోసేయండి..



కేకు కోయడం వరకూ బాగానే ఉంటుంది. కానీ దానిని అందరికీ సమానంగా పంచాల్సి వచ్చినప్పుడే చిక్కొస్తుంది. ఒకటి పెద్దది. ఒకటి చిన్నది. ఇలా జరిగితే పిల్లలు పేచీ పెట్టినా పెడ తారు. ఆ కేక్ ముక్కలని సమానంగా కోయా లంటే ఈ ఈక్వల్ కేక్ స్లైసర్‌ని వాడి చూడండి. మీ పని ఎంత తేలిక అవుతుందో! కేక్‌పై ఈ పరికరానినన ఉంచి, నొక్కి తీయడమే చేతికి అంటు కోకుండానే చిక్కు రాకుండా సమానంగా కోసేయొచ్చు. □

# టి20 ట్రోఫీ భారత్ కైవసం

## 3-1తో దక్కించుకున్న సిరీస్
## చితక్కొట్టిన యశస్వీ, గిల్



**న్యూ ఢిల్లీ:** ప్రపంచకప్ విజేత టీమిండియా రెండు వారాల వ్యవధిలోనే మరో సిరీస్‌ను పట్టేసింది. సీనియర్ ప్లేయర్లు లేకుండానే జింబాబ్వే టూర్‌కు వెళ్లిన యంగ్ ఇండియా అదరగొట్టింది. జింబాబ్వేతో ఐదు టీ 20ల సిరీస్‌ను మరో మ్యాచ్ మిగిలి ఉండానే 3-1 తేడాతో టీ 20 ట్రోఫీని భారత్ సొంతం చేసుకుంది. శనివారం జరిగిన నాలుగో టీ 20లో టీమిండియా 10 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. జింబాబ్వే నిర్ధేశించిన 153 పరుగుల లక్ష్య ఛేదనలో బరిలోకి దిగిన టీమిండియా కుర్రాళ్లు ఈ మ్యాచ్‌లో తమ ప్రతాపం చూపించారు. ఓపెనర్లు యశస్వీ జైస్వాల్ 93 పరుగులతోనూ, శుభ్‌మన్ గిల్ 58 పరుగులతో నాటౌట్‌గా ఆతిధ్య జట్టు బౌలర్లకు చుక్కలు చూపించారు.
తొలి ఓవర్ నుంచే ఔండరీలతో విరుచుకుపడ్డారు. బౌలర్ మారినా బంతి వెళ్లాల్సిందే ఔండరీయే అన్నట్లు చితకొట్టారు. దీంతో ఈ జంట రికార్డు భాగస్వామ్యంతో టీమిండియాను గెలుపు బాట పట్టించింది. తొలి ఓవర్‌లోనే యశస్వీ 15 పరుగులు పిండుకుని తన ఉద్దేశం చాటగా, గిల్ సైతం దూకుడుగా ఆడాడు. దాంతో స్కోర్ బోర్డు పరుగులు పెట్టగా, జింబాబ్వే ఫీల్డర్లు బౌండరీ లైన్‌కు పరుగులు పెట్టారు. 29 బంతుల్లోనే యశస్వీ అర్ధ సెంచరీ సాధించాడు. కెప్టెన్ గిల్ కూడా మెరుపు ఫిఫ్టీతో జింబాబ్వే ఆటగాళ్లను అసహనానికి గురి చేశాడు. ముజరబనీ వేసిన 16వ ఓవర్ రెండో బంతికి యశస్వీ బౌండరీ కొట్టడంతో 10 వికెట్లతో గెలిచిన శుభ్‌మన్ సేన 3-1తో సిరీస్‌ను కైవసం చేసుకుంది. తొలుత టాస్ ఓడి బ్యాటింగ్ చేసిన జింబాబ్వే నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 152 పరుగులు చేసింది. సొంతగడ్డపై టీ 20 సిరీస్‌లో వెనుకబడిన జింబాబ్వే నాలుగో మ్యాచ్‌లో పోరాడగలిగే స్కోర్ చేసింది. గత రెండు మ్యాచ్‌ల్లోనూ భారత్ బౌలర్ల ధాటికి చేతులెత్తేసిన బ్యాటర్లు పట్టుదలగా ఆడారు. ఓపెనర్లు తడివనషె మరుమని 32 పరుగులు, వెస్లీ మధెవెరె 25 పరుగులతో శుభారంభం ఇవ్వగా, సికిందర్ రజా 0 కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడి స్కోర్ బోర్డును నడిపించాడు. అయితే భారత్ బౌలర్లు వరస విరామాల్లో వికెట్లు తీస్తూ జింబాబ్వే జట్టును కట్టడిచేశారు. చివర్లో డియాన్ యోర్స్ 13 పరు గులు, కల్విన్ మదండే 7 పరుగులతో పోరాడ దంతో జింబాబ్వే నిర్ణీత ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 152 పరుగులకు పరిమితమైంది. భారత్ బౌలర్లలో ఖలీల్ అహ్మద్ 2 వికెట్లు పడగొట్టాడు.



# నేడు వింబుల్డన్ ఫైనల్

## టాప్ సీడ్‌లు అల్కారజ్‌తో జోకోవిచ్ ఢీ

**న్యూ ఢిల్లీ:** ప్రతిష్టాత్మక వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నీ టైటిల్ పోరులో టాప్ సీడ్‌లో తలపడనున్నాయి. ఈ టెన్నిస్ టోర్నీ టైటిల్ పోరు ఆదివారం లండన్‌లో జరిగే ఫైనల్లో డిఫెండింగ్ ఛాంపియన్, స్పెయిన్‌కు చెందిన మూడో సీడ్ కార్లోస్ అల్కారజ్‌తో సెర్బియా దిగ్గజం రెండో సీడ్ జోకోవిచ్ అమీతుమీ తేల్చుకోనున్నాడు. గత ఏడాది కూడా వీరిద్దరి మధ్యే ఫైనల్ జరగ్గా అల్కారజ్ ఛాంపియన్‌గా నిలిచాడు. కాగా రికార్డు స్థాయిలో 25వ గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ టైటిల్ కోసం వీరిద్దరి మధ్య టైటిల్ పోరు ఆసక్తికరంగా మారింది. ఇక స్పెయిన్ నయా సంచలనం అల్కారజ్ వరుస విజయాల ప్రస్థానం దిగ్విజయంగా కొనసాగుతోంది. ఇటీవలె ఫ్రెంచ్ ఓపెన్‌లో టైటిల్‌తో మెరిసిన అల్కారజ్ తాజాగా లండన్ వేదికగా జరుగుతున్న సెమీస్‌లో వింబుల్డన్ ఫైనల్ పోరుకు దూసుకెళ్లాడు. డిపెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగిన ఈ 21 ఏండ్ల స్పెయిన్ నయాబుల్ తనకు తిరుగు లేదని ఘనంగా చాటిచెప్పాడు. పురుషుల సింగిల్స్ సెమీ ఫైనల్లో మూడో సీడ్ అల్కారజ్ 6-7 (1-7), 6-3, 6-4, 6-4తో మెద్వదెవ్‌పై అద్భుత విజయంసాధించాడు. మూడు గంటల పాటు హోరా హోరీగా సాగిన పోరులో అల్కారజ్ మెద్వదెవ్‌పై పూర్తి ఆధిపత్యం ప్రదర్శించాడు. మెద్వదెవ్‌కు తొలి సెట్ చేజార్చుకున్న అల్కారజ్ మళ్లీ వెనుదిరిగి చూసుకోలేదు. కోర్టులో చిరుతను తలపిస్తూ వరుసగా మూడు సెట్లలో మ్యాచ్‌ను తన సొంతం చేసుకున్నాడు. మరో సెమీస్‌లో రెండో సీడ్ జోకోవిచ్ ఫైనల్స్‌లోకి దూసుకెళ్లాడు. సెమీఫైనల్స్‌లో జోకోవిచ్ 2 గంటల 4 నిముషాల్లో 53, 7-6 (7/2), 6-4తో ఇటీలీకి చెందిన 25వ సీడ్ లొరెంజో ముసెట్టిపై గెలుపొందాడు. ఈ మ్యాచ్‌లో జోకోవిచ్ 6ఏస్‌లు సంధించడంతో పాటు, ప్రత్యర్థి సర్వీస్‌ను నాలుగుసార్లు బ్రేక్ చేశాడు. ఇందులో ముసెట్టీపై లవోక విజయం సాధించి ఫైనల్లోకి ప్రవేశించాడు.

# పారిస్ ఒలింపిక్స్ గ్రూపులు ఖరారు



**న్యూ ఢిల్లీ:** పారిస్ ఒలింపిక్స్‌లో బ్యాడ్మింటన్ డ్రాలు ఖరారయ్యాయి. డబుల్ ఒలింపిక్ ఛాంపియన్ పీవీ సింధుతో పాటు, హెచ్‌ఎస్ ప్రణయ్‌కు సులవైన డ్రా ఎదురు కాగా, లక్ష్యసేన్, తనీషా క్యాస్ట్రో, అశ్విని పొనప్ప జోడీకి మాత్రం కఠిన ప్రత్యర్థులతో తలపడనున్నారు. మహిళల సింగిల్స్ ప్రపంచ ర్యాకింగ్స్‌లో ప్రస్తుతం 13వ ర్యాంక్‌లో కొనసాగుతున్న సింధు గ్రూప్ ఎమ్‌లో ఈస్తోనియకు చెందిన క్రిస్టిన్ కుబా, మాల్దీవులుకు చెందిన ఫతిమత్ నబాతోకలిసి బరిలోకి దిగనుంది. మూడో ఒలింపిక్స్ పతకంకోసం పట్టుదలగా ఉన్న సింధుకు ప్రిక్వార్టర్స్‌లో చైనాకు చెందిన హీ బింగ్ జియావో, క్వార్టర్స్‌లో చెన్‌యుఫీ ఎదురుకానున్నారు.

# వరల్డ్ ఛాంపియన్స్‌ఆఫ్ లెజెండ్స్ ఫైనల్స్‌కు భారత్

## ఆస్ట్రేలియాపై ఘన విజయం



**న్యూ ఢిల్లీ:** వరల్డ్ ఛాంపియన్ షిప్ ఆఫ్ లెజెండ్స్-2024 టోర్నీలో ఫైనల్స్‌కు టీమిండియా ఛాంపియన్స్ దూసుకుపోయింది. ఆస్ట్రేలియా ఛాంపియన్స్‌ను ఓడించి టీమిండియా ఛాంపియన్స్ ఫైనల్ బెర్త్‌ను ఖరారు చేసుకుంది. ఇంగ్లండ్‌లోని ఎడ్జ్‌బాస్టన్ క్రికెట్ స్టేడియంలో ఆస్ట్రేలియా ఛాంపియన్స్‌తో జరిగిన సెమీ ఫైనల్లో 86 పరుగుల తేడాతో టిమిండియా ఛాంపియన్స్ ఘన విజయం సాధించింది. తొలుత టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన టీమిండియాకు శుభారంభం దక్కలేదు. అంబటి రాయుడు 11 బంతుల్లో 14 పరుగులు, 3 ఫోర్లు, సురేశ్ రైనా 11 బంతుల్లో 14 పరుగులు, 3 ఫోర్లు చేసి తక్కువ స్కోరుకే వెనుదిరిగారు. ఈ దశలో బ్యాటింగ్‌కు వచ్చిన యువరాజ్‌తో కలిసి ఉతప్ప ఇన్నింగ్స్ చక్కదిద్దాడు. ఊతప్పదూకుడుగా ఆడటం, యువరాజ్ అతనికి సహకరించడంతో స్కోరు బోర్డు పరుగులు పెట్టింది. నాకౌట్ మ్యాచ్‌లో ఆస్ట్రేలియాతో మ్యాచ్ అంటే చెలరేగిపోయే యువరాజ్ 28 బంతుల్లో 59 పరుగులు, 4 ఫోర్లు, 5 సిక్సర్లతో ఈ సారి కూడా విజృంభించాడు. దీంతో 10 ఓవర్లకు జుట్టు స్కోరు 101/2కు చేరింది. ఆ తర్వాత ఉతప్ప ఔటైన అనంతరం యువరాజ్ టాప్ గేర్‌లోకి వెళ్లాడు. బౌండరీలు, సిక్సర్లతో హోరెత్తించాడు.
దీనికి తోడు మరోపక్క భారత్ ఆల్ రౌండర్ ఇర్ఫాన్ పఠాన్ విధ్వంసం సృష్టించి, ఆస్ట్రేలియా బౌలర్లను ఊచకోత కోశాడు. ఏడో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చిన పఠాన్ బౌండరీల వర్షం కురిపించాడు కేవలం 19 బంతుల్లోనే పఠాన్ తన హాఫ్ సెంచరీ మార్క్‌ను అందుకున్నాడు. 19 బంతుల్లో 3 ఫోర్లు, 5 సిక్స్‌లతో 50 పరుగులు చేసి పఠాన్ ఔటయ్యాడు. ఇర్ఫాన్ పఠాన్‌తో పాటు, రాబిన్ ఉతప్ప 65 పరుగులు, యూసఫ్ పఠాన్ 51 పరుగులు, యువరాజ్ 59 పరుగులతో హాఫ్ సెంచరీలతో చెలరేగిపోయారు. వీరి నలుగురి విధ్వంసకర ఇన్నింగ్స్ ఫలితంగా టీమిండియా ఛాంపియన్స్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 254 పరుగుల భారీ స్కోర్ సాధించింది. అనంతరం 255 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఆస్ట్రేలియా నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 168 పరుగులకే పరిమితమైంది. ఆస్ట్రేలియా బ్యాటర్లలో టిమ్ పైన్ 32 బంతుల్లో 40 పరుగులు, 2 ఫోర్లు, 3 సిక్సర్లతో తో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. ఛావల్ కులకర్ణి, పవన్ నేగి తలో రెండు వికెట్లు తీశారు.

# బిగ్ బాష్ షెడ్యూల్ ఫైనల్

## డిసెంబరు 15 నుండి జనవరి 27 వరకూ టోర్నీ

**న్యూ ఢిల్లీ:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపిఎల్) తర్వాత అతి పెద్ద లీగ్ అయిన బిగ్ బాష్-2024-25 త్వరలో ప్రారంభం కానుంది. ఇండియన్ ప్రీమియర్ లీగ్ తర్వాత క్రికెట్ ఫ్యాన్స్ ఎక్కువగా ఈ లీగ్ చూడడానికే అసక్తి చూపిస్తారు. ఇప్పటి వరకూ 13 సీజన్‌లు పూర్తి చేసుకున్న బిగ్ బాష్ లీగ్, తాజాగా 14వ సీజన్‌కు సిద్ధమైంది. దీనికి సంబంధించిన షెడ్యూల్‌ను తాజాగా విడుదలచేశారు. ఈ టోర్నీ డిసెంబరు 15వ తేదీ నుండి ప్రారంభమై 2025 జనవరి 27వ తేదీతో ముగియనుంది. ఇక 21న క్వాలిఫైయర్, 22న నాకౌట్, 24న ది ఛాలెంజర్, 27వ తేదీన ఫైనల్స్ జరగనున్నాయి. ఈ మ్యాచ్‌లన్నీ అప్టస్ స్టేడియం, మనుకా ఓవల్, ఎంసిజి, జిఎంహెచ్‌బిఎ, అడిలైట్ ఓవల్, బ్లాండ్‌స్టోన్ అరేనా, ఇఎన్‌జిఐఇ, గబ్బా, మార్వెల్ స్టేడియంలో జరగనున్నాయి. ఈ సీజన్ తొలి మ్యాచ్‌లో పెర్త్ స్కార్చర్స్‌తో మెల్‌బోర్న్ స్టార్స్ తలపడుతోంది. డిఫెండింగ్ ఛాంపియన్‌గా బ్రిస్బేన్ హీట్ బరిలోకి దిగుతుంది. పెర్త్ స్కార్చర్స్, మెల్బోర్న్ స్టార్స్, సిడ్నీ సిక్సర్స్, మెల్బోర్న్ రెనెగేడ్స్, సిడ్నీ థండర్, అడిలైడ్ స్ట్రైకర్స్, బ్రిస్బేన్ హీట్, హోబర్డ్ హరికేన్స్ టైటిల్ కోసంతలపడతాయి. ఇదేసమయంలోఆస్ట్రేలియా స్టార్‌ఆటగాళ్లు భారత్‌తోబోర్డర్‌గవాస్కర్ సిరీస్ అడనున్నారు.

# ప్రత్యక్ష పన్ను వసూళ్లు రూ.5.74 లక్షల కోట్లు

**న్యూఢిల్లీ, జులై 13:** దేశంలో నికర ప్రత్యక్ష పన్ను వసూళ్లు భారీగా పెరిగాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జులై 11 వరకు ప్రత్యక్ష పన్ను వసూళ్లు 19.54శాతం వృద్ధి చెంది రూ.5.74 లక్షల కోట్లకు చేరాయని ఆదాయపు పన్ను శాఖ తెలిపింది. 2024 ఆర్థిక సంవత్సరం ఇదే సమయంలో ఈ పన్ను వసూళ్లు రూ.4.80 లక్షల కోట్లుగా ఉన్నాయని పేర్కొంది. నికర ప్రత్యక్ష పన్ను వసూళ్లు రూ.5.74 లక్షల కోట్లలో కార్పొరేషన్ పన్ను రూ.2.1 లక్షల కోట్లు, వ్యక్తిగత ఆదాయపు పన్ను రూ.3.46 లక్షల కోట్లు, సెక్యూరిటీస్ ట్రాన్సాక్షన్ టాక్స్ రూ.16,634 కోట్లు ఉన్నట్లు కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు (సిబిడిటి) వివరించింది. కాగా ప్రభుత్వం 2024-25లో జులై 11 వరకు రూ.70,902 కోట్ల ప్రత్యక్ష పన్ను రీఫండ్‌లను జారీ చేసింది. 2023-24లో జారీ చేసిన రూ.43,105 కోట్లతో పోలిస్తే ఇది 64.49 శాతం పెరిగింది. ప్రత్యక్ష పన్ను వసూళ్లకు సంబంధించి ప్రభుత్వం సవరించిన అంచనాల్లో పూర్తి ఆర్థిక సంవత్సరానికి రూ.21.99 లక్షలకోట్ల వసూళ్లను అంచనా వేసింది. ఒక నిర్దిష్ట సంవత్సరానికి ప్రభుత్వం తన ఆర్థిక లోటు లక్ష్యాన్ని చేరుకోవడంలో సహాయపడుతుంది. కాబట్టి ఆరోగ్యకరమైన పన్ను వసూళ్లు ముఖ్యమైనవి. కేంద్రం మధ్యంతర బడ్జెట్‌లో ఆర్థిక లోటు 5.2




శాతం లక్ష్యంగా పెట్టుకుంది. స్థూల ప్రాతిపదికన, రీఫండ్‌లను సర్దుబాటు చేయడానికి ముందు, ప్రత్యక్ష పన్ను వసూళ్లు జులై 11 నాటికి రూ.6.45 లక్షల కోట్లుగా ఉన్నాయి. ఇది గత యేడాది ఇదే కాలంతో పోలిస్తే 23.24 శాతం వృద్ధి.

# బ్యాంకుల్లో ఆరు రెట్లు పెరిగిన మోసాలు


**ముంబై, జులై 13:** ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో 2024 ఆర్థిక సంవత్సరంలో మోసాలు గత యేడాది కంటే దాదాపు ఆరు రెట్లు పెరిగినట్లు ఎనిమిది పిఎస్‌బిల వార్షిక నివేదికలో వెల్లడైంది. 2023 ఆర్థిక సంవత్సరంలో 4,787 మోసాలు జరగ్గా, ఇప్పుడు ఆ సంఖ్య దాదాపు 28వేలకు చేరుకున్నట్లు నివేదిక పేర్కొంది. వీటిలో రుణ పోర్ట్‌ఫోలియో, నెట్‌బ్యాంకింగ్, కార్డులు, డిజిటల్ చెల్లింపులు, ఇతర సైబర్ మోసాలు ఉన్నాయి. బ్యాంకు ఆఫ్ బరోడాకు సంబంధించి ఎఫ్‌వై24లో అత్యధికంగా 12,061 మోసాలు జరగ్గా, గత యేడాది ఎఫ్‌వై23 లో 784 కేసులు మాత్రమే నమోదయ్యాయి. పంజాబ్ నేషనల్ బ్యాంకులో ఎఫ్‌వై23లో 289 మోసాలు జరగ్గా ఎఫ్‌వై24లో ఇది 7,112కు పెరిగినట్లు డేటా పేర్కొంది. రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా కూడా ఎఫ్‌వై24 వార్షిక నివేదికలో గత రెండేళ్లుగా ఆన్‌లైన్ మోసాలు సంఖ్య క్రమంగా పెరుగుతుందని పేర్కొంది. నివేదిక ప్రకారం, గత రెండేళ్లలో ఆన్‌లైన్ మోసాల కేసులు 708 శాతం పెరిగి 29,082కి చేరుకున్నాయి. మరోవైపు ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో పెద్దదైన స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా మోసాల సంఖ్య తగ్గిందని నివేదించింది. ఎఫ్‌వై23లో




2,755 కేసులు నమోదు కాగా, ఎఫ్‌వై24కి అది 1,586గా ఉంది. ఇది యేడాది ప్రాతిపదికన 42శాతం తగ్గింది. గత మూడు సంవత్సరాలలో, సైబర్ ప్రమాదాలను ఎదుర్కోవడానికి కొత్త సాంకేతికతకు సంబంధించిన బలాన్ని పెంచుకోవడానికి, ప్రభుత్వ రంగ బ్యాంకులు తమ సమాచార సాంకేతిక ఫ్రేమ్ వర్క్‌పై వ్యయాన్ని పెంచడం ప్రారంభించాయి. వీటితో పాటు ప్రైవేట్ బ్యాంకులు హెచ్‌డిఎఫ్‌సి వంటివి కూడా తమ వ్యయంలో ఎక్కువ భాగం సైబర్ ప్రమాదాలను ఎదుర్కోవడానికి కొత్త టెక్నాలజీపై పెడుతున్నాయి.

# బడ్జెట్‌పైనే ఇన్వెస్టర్ల ఫోకస్

**ముంబై, జులై 13:** త్వరలోనే బడ్జెట్ సమావేశాలు జరగబోతున్నాయి. ఏడాది ఫిబ్రవరిలో కేంద్రం ఎన్నికల దృష్ట్యా మధ్యంతర బడ్జెట్ ప్రవేశపెట్టిన విషయం విదితమే. అయితే ప్రస్తుతం పూర్తిస్థాయి వార్షిక బడ్జెట్ ప్రవేశపెట్టడానికి కొత్తగా ఏర్పడిన ఎన్డీఏ ప్రభుత్వం సన్నాహాలుచేస్తోంది. ఈ క్రమంలో స్టాక్ మార్కెట్లలోని ఇన్వెస్టర్లలో కోలాహలం కొనసాగుతోంది. ఈ క్రమంలో కేంద్ర ఆర్థికమంత్రి బాధ్యతలు చేపట్టిన నిర్మలాసీతారామన్ జులై 23న కొత్తగా మోడీ నేతృత్వంలో ఏర్పాటైన ఎన్డీఏ కూటమి తరపున బడ్జెట్‌ను సమర్పించనున్నారు. మోడీ 3.0కి ఇదే తొలి పూర్తి బడ్జెట్ కావడంతో వ్యాపార వర్గాల నుంచి సామాన్య ప్రజల వరకు తమకు ఎలాంటి ప్రయోజనాలు ఉంటాయనే ఆశతో ఎదురు చూస్తున్నారు. అయితే ఇప్పుడు దేశీయ స్టాక్ మార్కెట్లలో అందరి దృష్టి కేంద్ర బడ్జెట్ నిర్ణయాల వల్ల ఏరంగాలకు చెందిన కంపెనీలు లాభపడతాయనే అంశంపై ఇన్వెస్టర్లుఆసక్తిగా పరిశీలిస్తున్నారు. కొన్ని నివేదికల ప్రకారం, బడ్జెట్‌లో ప్రభుత్వ దృష్టి విద్యుత్, పునరుత్పాదక ఇంధనంపై ఉండవచ్చని యాక్సిస్ సెక్యూరిటీస్ అభిప్రాయపడింది. ఈ రెండు రంగాలకు సంబంధించి కొత్త పథకాలతో పాటు మరిన్ని బడ్జెట్‌లో ప్రభుత్వం ప్రకటించవచ్చని అంచనా వేస్తోంది. గత రెండు దఫాలుగా మోడీ ప్రభుత్వం పెద్ద సంఖ్యలో దేశంలో నిరుపేద కుటుంబాలకు ఇళ్లు నిర్మించుకునేందుకు నిధులు మంజూరుచేసింది. ఈసారి బడ్జెట్లో కూడా దీనికి నిధులు అధికంగా కేటాయించవచ్చని తెలుస్తోంది. అలాగే ప్రభుత్వం కొత్త గృహ నిర్మాణ పథకాన్ని కూడా ప్రకటించవచ్చు. ఇదే జరిగితే ఎస్‌బిఐ, బిఒబి, కెనరాబ్యాంకు, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు, ఐసిఐసిఐ బ్యాంకులు భారీ లాభాలను ఆర్జించవచ్చు. వీటికి తోడు ఇన్వెస్టర్లు పిఎఫ్‌సి, ఆర్‌ఇసి, ఐఆర్‌ఇడిఎ షేర్లపై కూడా ఒక కన్నేసి ఉంచాల్సి ఉంది. మోడీ ప్రభుత్వంలో తన తొలి బడ్జెట్లో ప్రస్తుత ప్రభుత్వం మౌలిక సదుపాయాల రంగానికి మరింత బడ్జెట్‌ను ప్రకటించవచ్చని తెలుస్తోంది. దీని ద్వారా కెఎన్‌ఆర్ కన్‌స్ట్రక్షన్, పిఎన్‌సి ఇన్‌ఫ్రాటెక్, ఆర్‌ఐటిఇఎస్, కెఇసి ఇంటర్నేషనల్, జె కుమార్ ఇన్‌ఫ్రాప్రాజెక్ట్స్ షేర్లలో కదలిక కనిపించవచ్చని తెలుస్తోంది. అలాగే సిమెంట్ తయారీ కంపెనీలపై నిఘాఉంచాల్సిన అవసరముంది. ఎందుకంటే ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌లో ఎక్కువనిధులను ప్రకటించడం అంటే సిమెంట్‌కు డిమాండ్ పెరుగుతుందని తద్వారా సిమెంట్ స్టాక్స్ లాభపడే అవకాశం ఉందని తెలుస్తోంది. అలాగే రైల్వే రంగానికి చెందిన రైల్ వికాస్ నిగమ్ లిమిటెడ్ (ఆర్‌విఎన్‌ఎల్), ఐఆర్‌ఎఫ్‌సి, ఒరియంటల్ రైల్ స్టాక్స్ కూడా బడ్జెట్ ప్రకటనలతో లాభపడే అవకాశాలు మెండుగా ఉన్నాయని మార్కెట్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.




# వాణిజ్యం


# ఆహార సేవల రంగం వృద్ధి రూ.7.76 లక్షల కోట్లు!

**న్యూఢిల్లీ, జులై 13:** భారతదేశంలో ఆహార సేవల పరిశ్రమ విలువ రూ.5.69 లక్షల కోట్ల నుంచి 2028 నాటికి రూ.7.76 లక్షల కోట్లకు చేరుకుంటుందని ఇండియా ఫుడ్ సర్వీసెస్ రిపోర్ట్ వెల్లడించింది. వేగంగా విస్తరిస్తున్న మార్కెట్ అవకాశాలు, ఆర్థిక పరిస్థితుల కారణంగా ఈ పరిశ్రమ దాదాపు యేడాది ప్రాతిపదికన 8.1 శాతం వృద్ధి చెందుతుందని నివేదిక పేర్కొంది. ముఖ్యంగా పెరుగుతున్న ఆదాయ స్థాయిలు వినియోగదారుల ప్రవర్తనలో మార్పుకు దారితీశాయి. కరోనా కారణంగా తీవ్రంగా దెబ్బతిన్న ఆహార సేవల పరిశ్రమ క్రమంగా ఇప్పుడు కోలుకుంటుంది. 2024లో రిటైల్, ఇన్సూరెన్స్ తర్వాత రూ.5.7లక్షల కోట్లతో ఈ రంగం భారతదేశంలో మూడవ అతిపెద్ద పరిశ్రమగా అవతరించింది. దేశంలో ఉపాధిపరంగా ఇది రెండవ అతిపెద్దదని, వివిధ పాత్రలు, నైపుణ్య స్థాయిలలో ఉపాధి అవకాశాలను అందించడంలో ఇది ప్రముఖంగా ఉందని నివేదిక తెలిపింది. 2024లో పరిశ్రమ 85.5 లక్షల మంది వ్యక్తులకు ఉపాధి కల్పించగా, 2028 నాటికి ఈ సంఖ్య ఒక కోటికి పైగా పెరుగుతుందని, ఈ ఆర్థిక సంవత్సరంలో ఆహార సేవల పరిశ్రమవృద్ధి 8శాతంగా ఉంటుందని ఇండియా ఫుడ్ సర్వీసెస్ పేర్కొంది. ఇదే సమయంలో డెలివరీ మార్కెట్ కూడా దాదాపు 22 శాతం వద్ద బలంగా పెరుగుతోందని నివేదిక అంచనా వేసింది.




# ఆన్‌లైన్ గేమింగ్‌లో పెరుగుతున్న ఉద్యోగులు

**న్యూఢిల్లీ, జులై 13:** భారతదేశ యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్, గేమింగ్, కామిక్ (ఎవిజిసి) పరిశ్రమ 2026 నాటికి 68శాతం వృద్ధిని సాధిస్తుందని ఒ అధ్యయనం అంచనా వేసింది. 'ఇండియాస్ బూమింగ్ ఆన్‌లైన్ గేమింగ్ ఇండస్ట్రీ: ఎ పొటెన్షియల్ పవర్‌హౌస్' పేరుతో ది ఫౌండేషన్ ఫర్ ఎకనామిక్ గ్రోత్ అండ్ వెల్ఫేర్, ప్రైమస్ పార్ట్‌నర్స్ సహకారంతో రూపొందించిన నివేదిక ప్రకారం, ఆన్‌లైన్ గేమింగ్ రంగ సహకారం 2019లో 41శాతం నుంచి 2026 నాటికి 68శాతానికి పెరగనుంది. పరిశ్రమలో శ్రామిక శక్తి పెరుగుదల 2018-2023 మధ్య 20 రెట్లు పెరిగింది. దేశంలో ఎవిజిసి పరిశ్రమ వేగవంతమైన వృద్ధిపై స్పందించిన ఇజిఆర్‌ఒడబ్ల్యూ ఫౌండేషన్ సిఇఒ చరణ్ సింగ్, ఆన్‌లైన్ గేమింగ్ పరిశ్రమ ఆర్థికవ్యవస్థకు అధిక సహకారం అందిస్తుంది. గేమింగ్ రంగం దేశంలోఇన ఉపాధి కల్పనకు ప్రధాన సహకారం అందించనుంది. ఆన్‌లైన్ గేమింగ్ పరిశ్రమలో ఉద్యోగుల సంఖ్య 2018-2023 మధ్య యేటా 97.5 శాతం పెరగడమే ఇందుకు నిదర్శనం. నివేదికలోని ప్రధాన అంశాల్లో మీడియా, వినోద పరిశ్రమకు ఆన్‌లైన్ గేమింగ్ రంగ సహకారం 2019లో 3.4 శాతం నుంచి 2024లో 10.5 శాతానికి, 2026 నాటికి 12.6 శాతానికి చేరనుంది. మొత్తం ఎవిజిసి పరిశ్రమకు తద్వారా ఉపాధి, విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను ఆకర్షించడం, ఇతర రంగాల్లోనూ ఉద్యోగావకాశాలు పెంచడం వంటి సానుకూలతలు ఉన్నాయని పేర్కొన్నారు.



# ఖతార్‌లోనూ యుపిఐ సేవలు!

**ముంబై, జులై 13:** దేశంలో డిజిటల్ చెల్లింపులకు కీలకంగా ఉన్న యుపిఐ ఖతార్‌కు విస్తరిస్తున్నట్లు నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఇంటర్నేషనల్ పేమెంట్స్ (ఎన్‌ఐపిఎల్) తెలిపింది. ఈ మేరకు ఖతార్ నేషనల్ బ్యాంకు (క్యూఎన్‌బి)తో ఒప్పందం జరిగినట్లు పేర్కొంది. ఆ దేశంలో నివసిస్తున్న భారతీయులు, ప్రయాణికులకు ఈ సేవలు ఎంతో ఉపయోగపడుతాయని ఎన్‌ఐపిఎల్ చెప్పింది. ఈ సందర్భంగా ఎన్‌పిసిఐ పార్ట్‌నర్స్ అండ్ బిజినెస్ డెవలప్‌మెంట్ డిప్యూటీ చీఫ్ అనుభవ్ శర్మ మాట్లాడుతూ, ప్రపంచవ్యాప్తంగా డిజిటల్ చెల్లింపుల సంఖ్య వేగంగా పెరుగుతోంది. ఖతార్‌లోని భారత వినియోగదారులకు మరిన్ని సేవలందించేందుకు ఎన్‌పిసిఐ ఇంటర్నేషనల్ ఖతార్ నేషనల్ బ్యాంకు (క్యూఎన్‌బి)తో ఒప్పందం కుదుర్చుకుంది. ఖతార్‌లోని భారతీయులు, ప్రయాణికులు, టూరిస్టులు క్యూఆర్‌కోడ్ స్కాన్‌చేసి యుపిఐ చెల్లింపులు చేసుకోవచ్చు' అని తెలిపారు. 2024లో గల్ఫ్ కోఆపరేషన్ కౌన్సిల్ దేశాలకు వెళ్లే భారతీయ పర్యాటకుల సంఖ్య 98 లక్షలుగా ఉంటుందని అంచనా. అందులో యుఎఇ ద్వారానే 52.9 లక్షల మంది రాకపోకలు జరిపే అవకాశంఉంది. ఇటీవల యుఎఇలో యుపిఐసేవలు ప్రారంభిస్తున్నట్లు ప్రకటించింది.




Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps.